


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 345 | ఆదివారం | 16-11-2025 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



దక్షిణ అమెరికాలో మరో గాజాను సృష్టిస్తారా?

దాడులతో ఉక్రేన్ అతలాకుతలం 02




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను రాహుల్ గాంధీకి సిఎం పరిచయం చేశారు. రాహుల్‌ను కలిసిన వారిలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి ఉన్నారు.

# రేపు కేబినేట్ భేటీ

## స్థానిక సంస్థలు, బిసి కోటాపై చర్చ?

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాల సూచనలు, తదితర న్యాయపరమైన చిక్కులను కూడా సమీక్షించనుంది. స్థానిక ఎన్నికలపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే గిగ్ వర్కర్లకు సంబంధించిన బిల్లు, నీటి పారుదల ప్రాజెక్ట్ పనులు, వాటికి సంబంధించిన నిధులు, ఇందిరమ్మ ఇండ్లు, కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపైన కూడా మంత్రివర్గంలో చర్చించనున్నారు.




గద్వాల్‌లో పల్లా వెంకట్‌రెడ్డి, జోడేఘాట్‌లో కూనంనేని సాంబశివరావు ప్రచార జాతాలను ప్రారంభించిన దృశ్యాలు

# సిపిఐ శతాబ్ది ఉత్సవ జాతాలు షురూ



బాసరలో ప్రచార జాతా ప్రారంభించిన దృశ్యం

సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని జోడేఘాట్, బాసర, గద్వాల్ నుంచి శనివారం ప్రచార జాతాలు ప్రారంభమయ్యాయి. ఈ జాతాలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే ముగింపు సభలో విరివిగా పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గద్వాల్‌లో జాతాను సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జోడేఘాట్ వద్ద స్రిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బాసరలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ జెండా ఊపి ప్రారంభించారు. కాగా గద్వాల్ జాతాలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్ నర్సింహ్మా, జోడేఘాట్‌లో సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, కలవేణ శంకర్, బాసరలో మాజీ రాజ్యసభ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర నాయకుడు కంజర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజల హక్కుల పరిరక్షణలో

సిపిఐదే కీలక పాత్ర 03

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ


## పోరాటంతోనే పాలకుల అరాచకాలు

# తిప్పికొట్టడం సాధ్యం

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**

ప్రజాపక్షం/ గద్వాల

కమ్యూనిస్టు పార్టీల పోరాటంతోనే రాష్ట్రంలో, కేంద్రంలో పాలకుల అరాచకాన్ని తిప్పికొట్టడం సాధ్యమవుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ వందేళ్ల సందర్భంగా నిర్వహించే రాష్ట్ర బస్సు జాతాను గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం పల్లా వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో సిపిఐ బహిరంగ సభను సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్ నర్సింహ్మా ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిచారు. గద్వాల పోరాటాల నడిగడ్డ అని, వీరయోధులను కన్న గడ్డ అని, అందుకే ఇక్కడ నుంచి బస్సు జాతాను ప్రారంభించామన్నారు. ప్రతి ఒక్కరూ సిపిఐ జెండా పట్టి నడిగడ్డ సమస్యల పైన పోరాడాలని పిలుపునిచ్చారు. వందేళ్ళలో దేశంలోని పేద ప్రజలు, కార్మికులు, రైతులు, ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన ఘనత సిపిఐదేన్నారు. దేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తులను చేసిందని, తెలంగాణ నైజాం విముక్తికి పోరాడి రాచరిక పాలన నుంచి విముక్తి చేసిందన్నారు. నేటికీ ప్రజా సమస్యల కోసం అనేక పోరాటాలు చేస్తుందని చెప్పారు. నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదారులతో చేతులు కలిపి మన దేశ భవిష్యత్తును అంధకారంలోకి తరువాయి 12లో





ప్రజల ఆశాజ్యోతి సిపిఐ

కీ.శే. కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్

ప్రత్యేక వ్యాసం 6వ పేజీలో


## కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే

# ప్రజలకు రక్షణ

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

ప్రజాపక్షం / కేరిమేరి

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా శనివారం జోడేఘాట్ నుండి ప్రచార జాతాను కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ముందుగా కొమురం భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మ్యూజియంలో ఆయన కొమురం భీం అనుచరుల ప్రతిమలు, ఆదివాసి గిరిజనులు ఉపయోగించే సాంప్రదాయ పనిముట్లు, అభరణాలు, వ్యవసాయ పనిముట్లను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తున్నదని, ముఖ్యంగా పేదలు, నిరుపేదల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఎర్రజెండా పోరాటాలతో పేదలకు భూములు దక్కుతాయని, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనిస్టు భావజాలంతోనే కొమురం భీం పోరాటం కొనసాగించారని తెలిపారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని, వామపక్ష ప్రజాతంత్ర పురోగామి శక్తులు కమ్యూనిస్టుల ఐక్యతను కోరుకుంటున్నాయని తరువాయి 12లో

## ‘ఏరో, డిఫెన్స్ అభివృద్ధికి

# సమగ్ర ప్రణాళిక

- 2030 నాటికి దేశ ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ
- ‘ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్’లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణను 2030 నాటికి దేశ ‘ఏరో ఇంజిన్ రాజధాని’గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో ‘ఏరో స్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్’ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్‌ను రూపొందిస్తున్నామన్నారు. ‘ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం’ కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్‌గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్‌బి, ముంజాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో నిర్వహించిన ‘ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్’కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం(కీ నోట్ అడ్రస్) చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఏఅండ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా ‘భారత్’ లాంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి తరువాయి 12లో

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

# ఏసిబి దాడులు

- లెక్కల్లో చూపని రూ.2,51,990లు స్వాధీనం
- 289 అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సీజ్
- 79 మంది అనధికార వ్యక్తుల గుర్తింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు జరిపింది. గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల, పెదపల్లి, భూపాలపల్లి, వైరాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తనిఖీలో, లెక్కల్లో చూపని రూ. 2,51,990 నగదును కార్యాలయాల నుండి స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 289 అక్రమ తరువాయి 2లో

## అమెరికాలో వెల్లువెత్తిన ప్రజావ్యతిరేకత

# దిగొచ్చిన ట్రంప్

- ఆహార వస్తువులపై సుంకాల తగ్గింపు
- ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడి సంతకం

**వాషింగ్టన్:** ప్రజా వ్యతిరేకత తట్టుకోలేక అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిగి వచ్చారు. కాఫీ, టమోటా, గొడ్డు మాంసం, సీజనల్ ఫ్రూట్స్ సహా అనేక ఆహార వస్తువులపై సుంకాలలో కోత విధించారు. టీ, పండ్ల రసాలు, కోకో, సుంగంధాలు, అరటి పళ్ళు, బత్తాయిలు సహా కొన్ని ఎరువులపై కూడా టారిఫ్‌లను తొలగిస్తూ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. రిటైలర్లు, ఉత్పత్తిదారులకు ప్రాతినిధ్యం వహించే ఆహార పరిశ్రమ సంఘం టారిఫ్‌ల ఉపశమన తరువాయి 12లో

## నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో

# భారీ పేలుడు

- 9 మంది మృతి, 32 మందికి గాయాలు
- ‘వైట్-కాలర్’ టెర్రర్ మాడ్యూల్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నమూనాలను సేకరిస్తుండగా ఘటన
- ఉగ్రదాడి కాదని డిజిపి ప్రకటన





**శ్రీనగర్ /న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా, 32 మంది గాయపడ్డారు. పేలుడు వెనుక ఉగ్ర కుట్ర ఉందంటూ వస్తున్న ప్రచారాలను జమ్ముకశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ త్రోసిపుచ్చారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటననేనని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి 11:20 గంటల ప్రాంతంలో ప్రత్యేక బృందం ‘వైట్‌కాలర్’ టెర్రర్ మాడ్యూల్ దర్యాప్తుకు సంబంధించి స్వాధీనం చేసుకున్న భారీ, అస్థిర పేలుడు పదార్థాల నిల్వల నుండి నమూనాలను తీస్తున్నప్పుడు పేలుడు సంభవించింది. ఘటనపై శ్రీగర్, ఢిల్లీలో మీడియా వస్తున్న కథనాలను జమ్ముకశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ , హోంమంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ఉగ్రవాద దాడి ఊహాగానాలను తోసిపుచ్చారు. ఈ ఘటన దురదృష్టకర ప్రమాదం అని పేర్కొన్నారు. పేలుడులో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) బృందంలోని ముగ్గురు సిబ్బంది, ఇద్దరు క్రైమ్ ఫోటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు (మేజిస్ట్రేట్ బృందంలో భాగం), రాష్ట్ర దర్యాప్తు సంస్థకు చెందిన తరువాయి 2లో

# పెన్షనర్ల ఆందోళన బాట

- 20 నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛన్లు రాకపోవడంతో తీవ్ర నిరసన
- రేపు ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా

ప్రజాపక్షం/ ఖమ్మం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై పెన్షనర్ల పోరాట ప్రక్రియ వివిధ దశలు దాటి మహా ధర్నాకు చేరుకుంది. 20 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు రాకపోవడంతో ఇప్పటికే వివిధ రూపాలలో పెన్షనర్ సంఘాలు ఆందోళన నిర్వహించాయి. వినతి పత్రాలు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక వినతులు, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. అయినా ఫలితం రాకపోవడంతో అనేక మంది పెన్షనర్లు దిగులుతో అనారోగ్యం పాలవుతుండటం ఇప్పటికే కొందరు ప్రాణాలు కోల్పోవడం ఉద్యోగ విరమణ అనంతరం తాము అనుకున్న ప్రణాళికలకు సంబంధించి అమలు చేయలేకపోవడంతో ఆవేదనతో మరి కొంత మంది ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా, చర్చలు జరపడం సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛన్ బకాయిలు విడుదల కాలేదు. దాదాపు 30 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా విభిన్న రంగాల్లో సేవలు అందించిన వారికి ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్ రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వేల మంది ఉద్యోగులు పింఛన్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు పింఛన్ బకాయిలు రాకపోవడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లయింది. ఉద్యోగ విరమణ తర్వాత పిల్లల పెళ్లిళ్లు, స్థిర నివాసాల ఏర్పాటుతో తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బిబిసిపై 500 కోట్ల డాలర్లు పరువునష్టం దావా

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌బిబిసిపై పరువునష్టందావా వేసేందుకు సిద్ధమయ్యారు. తన ప్రసంగాన్ని ఎడిట్ చేసి పరువునష్టం కలిగించినందుకు బిబిసిపై 500 కోట్ల డాలర్లు (ఐదు బిలియన్ డాలర్లు) మేరకు వచ్చేవారం నాటికి దావా వేస్తానని చెప్పారు.100కోట్ల డాలర్లు పరిహారం చెల్లించాలని ట్రంప్ న్యాయబృందం తొలుత బిబిసిని లిఖితపూర్వకంగా కోరింది.అందుకు సంస్థ నిరాకరించడంతో ట్రంప్ దిగ్భ్రాంతి కలిగించేలా నిర్ణయం తీసుకున్నారు. వాషింగ్టన్‌లోని యు.ఎస్ క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ అనుచరులు వందలమంది దాదాపు ఐదేళ్ళక్రితందాడి చేశారు. దాడికి ముందుగా 2021 జనవరి 6న ఆనాటికి అధ్యక్ష పదవిలో ఉన్న ట్రంప్ తన అనుచరులను, అభిమానులు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, శాంతియుతంగా నిరసన తెలియజేయాలని కోరారు. ఈ భాగాన్ని ప్రసంగం నుండి బిబిసి తొలగించిందన్నదిప్రధాన అభియోగం. బిబిసి డైరెక్టర్ జనరల్ టిమ్, వార్తల విభాగం అధిపతి ,న్యూస్ సిఇఓ డెబోరాటర్నెస్‌లుట్రంప్‌ప్రసంగాన్ని ఎడిట్‌చేశారు. దశాబ్దాలుగా వీరిద్దరూ సంస్థలో పనిచేస్తున్నారు.

# దక్షిణ అమెరికాలో మరో గాజాను సృష్టిస్తారా?

## అంతులేని యుద్ధాలను ఆపాలని అమెరికన్లకు మదురో పిలుపు





**కారకస్:**దక్షిణ అమెరికాలో మరోగాజాను సృష్టించాలని కోరుకుంటున్నారా? అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురో నిలదీశారు. వెనిజులా సరిహద్దుల్లో కరీబియన్ సముద్రంలో ''ఆపరేషన్ సదరన్ స్పియర్'' పేరుతో సైనికచర్యలకు సన్నద్ధమై, యుద్ధ వాతావరణం కల్పించి, కయ్యానికి కాలుదువ్వేందుకు ట్రంప్ సిద్ధపడ్డారు. దీంతో శనివారం ఉదయం నికొలస్ మదురో దేశరాజధాని కారకస్‌లో మీడియాతో మాట్లాడుతూ, దక్షిణ అమెరికాను మరో వియత్నాంలా తయారు చేయాలనుకుంటున్నారా? అధి సాధ్యపడదు అన్నారు. ''వాస్తవానికి ట్రంప్ మాదక ద్రవ్యాలపేరుతో వెనిజులాలో కమ్యూనిస్టుల అధికారాన్ని కుప్పకూల్చి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నారని విమర్శించారు. వి రామం లేని మరో యుద్ధానికి ట్రంప్ సన్నద్ధం అవుతున్నారన్నారు. ఇక ఇలాంటి అంతం లేని యుద్ధాలకు వ్యతిరేకంగా అమెరికన్లు ఐక్యం కావాలని పిలుపు ఇచ్చారు. ''మన అమెరికా ఖండాన్ని విషాదంలో ముంచేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో అమెరికా ప్రజలు వీరోచిత పాత్ర పోషించాలి'' అని మదురో కోరారు. వెనిజులాలో కమ్యూనిస్టు నేత హ్యూగో ఛావెజ్ 1999నుండి2013లో మరణించేవరకూ దేశాధ్యక్షుడుగా కొనసాగారు. ఆయన హయాంలో శిక్షణ పొందిన నికొలస్ మదురో 2013 నుండి అధికారంలో కొనసాగుతున్నారు. యుద్ధ వాతావరణం సృష్టించకుండా వెనక్కు మ ళ్ళాలని, శాంతిని పాటించాలనీ కూడా ట్రంప్‌కు మదురో హితవు చెప్పారు. ట్రంప్ శాంతిని వదిలేసి ముందుకే రావాలనుకుంటేతమ దేశాన్ని కాపాడుకునేందుకు సర్వశక్తులనూ ఒడ్డుతామన్నారు. స్థిరత్వాన్ని సాధించి ఉనికిని నిలబెట్టుకుని, తమ సార్వభౌమాధికారాన్ని ఎలా కాపాడుకోవాలోవెనిజులా ప్రజలకు తెలుసునని, ఈ పరిణామాల ద్వారా వారు అన్నీ అర్థం చేసుకున్నారన్నారు. కరీబియన్ ప్రాంతంలో, వెనిజులాలో ఎన్ని ప్రయత్నాలు చేసినా చిట్ట చివరకు శాంతి, అంతర్జాతీయ చట్టాలే గెలుస్తాయన్నారు. ట్రంప్ గడచిన 80 రోజులుగా కరీబియన్ జలాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారు. అత్యంత శక్తిమంతమైనవిమానవాహకనౌకలను కరీబియన్ జలాలలో ట్రంప్ మోహరించి సైనిక విన్యాసాలకు సన్నద్ధమతువున్న తరుణంలో మదురో తీవ్రస్థాయిలో స్పందించారు. ట్రంప్‌కు అటు హెచ్చరికలతోపాటు విజ్ఞప్తులు, హితవులు కూడా చెప్పారు. ''గాజాలో దారుణమైన మారణహోమం జరిగింది,ఆమారణహోమం చూసి మా నవత్వంకృంగికృశించిపోతోంది, ప్రపంచ ప్రజలు ఆవేదన చెందుతున్నా రు, మళ్ళీ దక్షిణ అమెరికాలో కూడా మీరు మరో గాజాను సృష్టించాలనుకుంటున్నారా?'' అని ట్రంప్‌ను మదురో ప్రశ్నించారు.

### వెనిజులాపై సైనిక చర్య.. కానీ ఏం చేస్తానో చెప్పను : ట్రంప్

కరీబియన్ జలాల్లో నావికాదళాన్ని, సైన్యాన్ని మోహరించి సైనిక విన్యాసాలు చేసేందుకు సన్నద్ధమతుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాన్డ్ ట్రంప్, వెనిజులాపై సైనిక చర్యకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విమానంలో వెళుతూ మీడియాతో మాట్లాడిన సందర్భంగా,''బలమైన చర్యలు తీసుకోవడానికి నిర్ణయం తీసుకుంటున్నారా?'' అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు, ''వెనిజులాలో సైనిక చర్య తీసుకునే అవకాశం ఉంది,ఐతేనేనుఏం చేస్తానో చెప్పను,చెప్పలేను''అన్నారు. అమెరికాలోకి మాదక ద్రవ్యాలను రాశు లు రాశులుగా రవాణా చేయకుండా ఇప్పటికే చాలా చర్యలు తీసుకుని ఎంతో పురోగతి సాధించామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు అమెరికా తీసుకుంటున్న చర్యలు ఫలితాలు చూపిస్తున్నాయన్నారు. ఐతే ఈ ఫలితాలు పొరుగు దేశాలలో ఉన్న సమస్యలతో తమ సవాళ్ళు ముడిపడి ఉన్నాయన్నారు. ''ఈ విషయంలో మాకు మెక్సికోతో సమస్య ఉంది, కొలంబియాతో సమస్య ఉంది, కానీ మేం బాగా పనిచేస్తున్నాం, అమెరికాలోకి మాదక ద్రవ్యాల రవాణా బాగా తగ్గుముఖం పట్టింది'' అన్నారు. ఐతే మదురో కూడా మొదటినుండీ ఇదే విషయం చెబుతూ వస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ ముఠాలను అణచివేశామని, చాలా వరకూ వారి కార్యకలాపాలను నియంత్రించామని మదు రో చెబుతున్నప్పటికీ ట్రంప్ కరీబియన్ జలాల్లో అక్రమంగా వెనిజులా పడవలపై దాడులు చేస్తూ అనేకమందిని గడచిన రెండున్ననెలలుగాచంపుతున్నారు. పెంటగాన్‌లోని సైనిక కేంద్రం ఆధ్వర్యంలో ఈ దాడులు జరుగుతున్నాయి. గడచిన రెండునెలలుపైగాట్రంప్ కరీబియన్ జలాల్లో లాటిన్ అమెరికా దేశాలపై అణచివేత చర్యలకు పూనుకున్నారు. దాదాపు 21పైగా పడవలపై అమెరికా సైనికులు ప్రాణాంతకమైన దాడులు చేశారు. అనేకమంది దాడుల్లో మరణించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వెనిజులా కూడా సైన్యాన్ని సిద్ధం చేసింది. అటు కొలంబియా అధ్యక్షుడి కుటుంబంపైనకూడానిషేధంవిధించారు.కమ్యూనిస్టు ప్రభుత్వాలనుఅణచివేసేదృష్టితోఆయనహయాంలో మాదక ద్రవ్యాలా రవాణా ఉద్ధృతంగా జరుగుతోందంటూ ట్రంప్ ఆరోపణలు చేశారు.


## దాడులతో ఉక్రేన్ అతలాకుతలం

### కాల్పుల విరమణకు ఐక్యరాజ్యసమితి పిలుపు

**కీవ్:**రష్యా చేస్తున్న దాడులతో ఉక్రేన్ దేశం అతలాకుతలం అవుతోంది.శీతాకాలంలో భారీగా మంచు పేరకుపోయి గడ్డకట్టేపరిస్థితులు సమీపించడంతో రష్యా తన దాడులను మరింత ఉద్ధృతం చేసింది. తాజా దాడుల్లో ఎనిమిది మంది పౌరులు మరణించారు. ఒక్క కీవ్ నగరంలోనే ఆరుగురు మరణించారు. అనేక నివాసిత ప్రాంతాలు, ఇంథన వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. అనేకమంది గాయపడ్డారు. దీంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంథోనీ గుటెర్రెస్ దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ఎక్కడ జరిగినా సమ్మతింపసాధ్యం కాదన్నారు. తక్షణం బేషరతుగా పూర్తిస్థాయి కాల్పుల విరమణ పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌లోని అనేక ప్రాంతాలలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. యుద్ధం మొదలైన తర్వాత తొలుత దాడిని వ్యతిరేకిస్తూ యూరోపియన్ యూనియన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2022 మార్చి రెండో తేదీన భారీ మెజారిటీతో ఆమోదించింది. గడచిన కొద్ది రోజులుగా రష్యాను రెచ్చగొట్టే రీతిలో ఆంక్షలు విధించడంతోపాటు ఉక్రేన్‌కు భారీ ఎత్తున ఆర్థిక సహాయం ప్రకటిస్తూ యూరప్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూ ఉండగంలో ఉక్రేన్‌పై విరామం లేకుండావందల డ్రోన్లతో రష్యా దాడులు కొనసాగిస్తున్నది.తాజాగా శనివారం తెల్లారకముందే చేసిన దాడుల్లో ఉక్రేన్‌కు అపారనష్టం వాటిల్లింది. మరో ఆరుగురు పౌరులు మరణించారు. ఉక్రేన్ ఇంథన వనరులకు నష్టం వాటిల్లింది. 430 డ్రోన్లు, 18 క్షిపణులతో రష్యా దాడి చేసిందని, ఇప్పటివరకూ రష్యా చేసిన అతిపెద్ద దాడి ఇదేనని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. జెపోరిఝియా రీజినల్ గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ మాట్లాడుతూ, 20 నివాసిత ప్రాంతాలపై 731 దాడులు జరిగాయని, నలుగురు పౌరులు మరణించారని చెప్పారు. మరోవైపు రష్యా కూడా ఒక ప్రకటన చేస్తూ అనేక రష్యా ప్రాంతాలపై ఉక్రేన్ ప్రయోగించిన 216 డ్రోన్లను కూల్చివేశామని, మరికొన్ని డ్రోన్లను నల్లసముద్రంలో కూల్చివేసినట్లు పేర్కొంది. అదేవిధంగా రెండు రోజుల క్రితం ఉక్రేన్‌కు నాలుగువైపులా జరిగిన పోరాటంలో ఒక్కరోజులో 1,150 మంది సైనికులను ఆ దేశం కోల్పోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఉక్రేన్ శత్రువుకు సంబంధించిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ స్టేషన్‌ను ధ్వంసం చేశామని తెలిపింది.ఇదిలా ఉండగా శీతాకాలం సమీపిస్తూ ఉండటంతో ధ్వంసమైన ఇంథన మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికపై మరమ్మతులు చేసే పనులను ఉక్రేన్ ప్రారంభించింది.

## క్లింటన్ సహా ప్రముఖ డెమోక్రాట్లతో జెఫ్రీ ఎప్స్టీన్ సంబంధాలపై న్యాయశాఖ దర్యాప్తు

**వాషింగ్టన్:**మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ సహా పలువురు ప్రముఖ డెమోక్రాట్లతో, ప్రధాన బ్యాంకులతో లైంగిక కార్యకలాపాల నేరస్థుడు, పెడోఫైల్‌ఫైనాన్సియర్‌జెఫ్రీఎప్స్టీన్(1953–2019)కు ఉన్న సంబంధాలపై దర్యాప్తుకు ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ''ఎప్స్టీన్‌ఒక డెమోక్రాట్, అందువల్ల ఇది డెమోక్రాట్స్‌సమస్య, రిపబ్లికన్ల సమస్య కాదు'' అన్నారు. క్లింటన్‌తోపాటుమాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్, లింక్డ్‌ఇన్‌వ్యవస్థాపకుడురీడ్‌హాఫ్మన్,జె.పి. మోర్గాన్, ఛేజ్ బ్యాంకులు సహాఅనేకమంది వ్యక్తులు, సంస్థలతో ఎప్స్టీన్‌కు ఉన్న సంబంధాలను బహిర్గతం చేయాలని అటార్నీ జనరల్ పామ్ బాంని, ఎఫ్‌బిఐనిట్రంప్‌కోరారు.తన సోషల్ మీడియా కంపెనీ ట్రూత్‌సోషల్‌వేదికగాశనివారం పోస్టింగ్ పెట్టారు. అమెరికా న్యాయశాఖ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది.పామ్‌బాండీ స్పందిస్తూ, దర్యాప్తు ప్రారంభించాల్సిందిగా న్యాయవాది జె. క్లాటన్‌ను ఆదేశించినట్లు మరో పోస్టింగ్‌లో పేర్కొన్నారు. డెమోక్రాట్లు తమ వైఫల్యాలను, ఎప్స్టీన్ మోసాన్ని కప్పిపుచ్చుకోవడంకోసం తనపై ఆరోపణలను మళ్ళీ ముందుకు తెస్తున్నారని విమర్శించారు.ఈవారారంభంలో షట్‌డౌన్ ముగిసిపోయిందని, డెమోక్రాట్లు పొడిగించేందుకు ప్రయత్నం చేసి విఫలం కావడంతో ఇప్పుడు తిరిగి జెఫ్రీ ఎప్స్టీన్ పేరుతో తనపై ఆరోపణలను ముందుకు తెస్తున్నారని విమర్శించారు.ట్రంప్‌ఎన్నికలోరష్యాజోక్యం ఉందంటూ గతంలో వచ్చిన విమర్శలను గుర్తుచేస్తూ, ఈ అధికారులు, వ్యక్తులు ఎక్కువకాలం ఎప్స్టీన్‌తోనే గడిపారని రికార్డులు రుజువు చేస్తున్నాయన్నారు. ఎప్స్టీన్ చేసిన నేరాలన్నీ ట్రంప్‌కు తెలుసునని, ఇ–మెయిల్స్‌లో ఆయన పేరు కూడా ఉం దని డెమోక్రాట్లుతప్పుపట్టారు. జెఫ్రీ ఎప్స్టీన్ ఎస్టేట్ నుండి దాదాపు 20,000పేజీలను, ఇ–మెయిల్స్ ను డెమోక్రాట్ల ఒత్తిడితో అమెరికా ఓవర్‌సైట్ కమిటీ విడుదల చేసింది. వీటిల్లోని 16 00 పత్రాలు లేదా 2,324 ఇ–మెయిల్ థ్రెడ్స్‌లో ట్రంప్ పేరు ఉందని 'వాల్‌స్ట్రీట్‌జర్నల్' వివరించింది.ఎ ప్స్టీన్‌కార్యకలాపాలన్నీట్రంప్‌కుతెలుసుననిడెమోక్రాట్లు విమర్శలు చేయడంతోట్రంప్ శనివారం ఎదురుదాడి చేశారు.



న్యూఢిల్లీలో శనివారం సిఎం రేవంత్‌రెడ్డిని విన్ గ్రూప్ ఆసియా సిఇఒ ఫామ్ సాన్ చౌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఫ్యూచర్ సిటీలో ప్రధాన పెట్టుబడులపై వారిద్దరు చర్చించారు. రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను స్థాపించడానికి ఫామ్ సాన్ చౌ ఆసక్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) తయారీ యూనిట్లు, బ్యాటరీ నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే విన్‌గ్రూప్ యొక్క ఆసక్తిని ఫామ్ సాన్ చౌ సిఎంకు తెలియజేశారు.

## పెన్షనర్ల ఆందోళన బాట

(మొదటి పేజీ తరువాయి)

పాటు చాలా మంది ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దాదాపుగా రూ.15వేల కోట్లు బకాయిలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61కు పెంచింది. దీనితో 2024 మార్చి నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రిటైర య్యారు. వీటితో పాటు ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత చికిత్స కోసం కూడా పెన్షనర్లు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఈహెచ్‌ఎస్ కార్డులు అమలు కాకపోవడంతో సరైన వైద్యం సరైన సమయంలో పొందలేకపోతున్నామన్న ఆవేదన పెన్షనర్లలో వ్యక్తమవుతుంది. పెన్షనర్ల బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్న ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం లేని పరిస్థితి. మేము దాచుకున్న డబ్బులు కూడా మాకు ఇవ్వరా అంటూ పెన్షనర్లు ప్రశ్నిస్తున్నారు. పెన్షనర్లకు సంబంధించి జిపిఎఫ్ పొదుపుకు సర్వీసులో ఉన్నప్పుడు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. ఉద్యోగ విరమణ చేసి 20 మాసాలు కావస్తున్నా బెనిఫిట్స్ అందకపోవడంతో వడ్డీ కోల్పోతున్నామన్న ఆవేదన కూడా మరో పక్క వ్యక్తమవుతుంది. ముఖ్యంగా ఖజానా ఖాళీ మేము ఏమి చేయలేమన్న ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ నవంబర్ 17న ఇందిరా పార్కులో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చారు. అన్ని జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు మహా ధర్నాకు హాజరు కానున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల బకాయిలను విడుదల చేయడంతో పాటు హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

**అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాం : లక్ష్మి సుజాత**

41 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించాను. ప్రధానోపాధ్యాయురాలిగా 2024 సెప్టెంబర్‌లో ఉద్యోగ విరమణ పొందాను. నా చేతిలో రూపాయి లేదు. నేను నిర్వర్తించాల్సిన బాధ్యతలు చాలా ఉన్నాయి. పింఛన్ బకాయిలతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకుందామనుకున్నాం. 14 మాసాలు గడిచినా రూపాయి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పెన్షనర్ల బకాయిలను చెల్లించాలని కోరుతున్నాను.

**ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదు : మేరీ ఏసుపాదం**

పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం తెలిపారు. తాను 34 ఏళ్ల పాటు విద్యా రంగంలో వివిధ హోదాలలో సేవలందించానని పలుమార్లు ఉత్తమ అవార్డులు అందుకున్నానని కానీ ఉద్యోగ విరమణ అనంతరం పెన్ష న్ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ బకాయిలు రాక పింఛన్‌దారుల కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపజేసే రీతిలో పెన్షనర్లు ఆందోళనకు సిద్ధం కావాలని ఆమె తెలిపారు.

**ధర్నాను జయప్రదం చేయండి : పరిశ పుల్లయ్య**

రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం (ఎస్‌జిపిఏటి) ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు. 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. అనేక ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వారి పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైనది కాదని పెన్షనర్ల ఇబ్బందులను చూసైనా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఆందోళనలతోనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందని పుల్లయ్య కోరారు.

## 'ఐ బొమ్మ' రవి అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పైరసీ సినిమాలను విచ్చలవిడిగా తన వెబ్‌సైట్‌లో పెడుతూ సినీ పరిశ్రమను అతలాకుతలం చేసి పోలీసులకే సవాలు విసిరి సంచలనం రేపిన 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం ఎట్టకేలకు అరెస్టు చేశారు. నిందితుడు రవిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించింది. దీంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. విదేశాల్లో ఉంటూ కొత్త సినిమాలను పైరసీ చేసి తన వెబ్‌సైట్‌లో బహిరంగంగా అందరికి చూపిస్తు సినీ రంగాన్ని ఆర్థికంగా దివాలా తీయిస్తున్న రవిపై సినీ నిర్మాతలు గతంలో అనేక ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకున్న సైబరాబాద్, హైదరాబాద్ పోలీసులు అతని కోసం ఆరా తీశారు. 2019 నుండి ఐ బొమ్మ వెబ్‌సైట్‌కు పైరసీ చేసి వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. ఆరు సంవత్సరాల కాలంలో వేలాది పైరసీ సినిమాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. థియేటర్లో విడుదలైన సినిమాలను గంటల వ్యవధిలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో సినీ పరిశ్రమ నిర్మాతలు తలలు పట్టుకున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్‌కి వేలాది కోట్లు సినీ నిర్మాతలకు నష్టం కలిగింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు ఐ బొమ్మతోపాటు, 65 పైరసీ వెబ్‌సైట్‌లపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో గతంలో ఐదుగురు కీలక నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎట్టకేలకు రవిని అరెస్టు చేయడంతో పాటు పోలీసులు రవి ఏజెంట్ల నెట్వర్క్ తో పాటు హ్యాండ్లర్ల నెట్‌వర్క్‌పై కూపీ లాగుతున్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్‌లోని ఏ కార్యకర్తకు ఏం జరిగినా, కంటికి రెప్పలాగా కాపాడుకునే బాధ్యత తనదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు భరోసానిచ్చారు. రెహమత్‌నగర్ డివిజన్‌లోని బిఆర్‌ఎస్ కార్యకర్త రాకేష్ క్రిస్టోఫర్ నివాసానికి వెళ్లిఆయనను కెటిఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన 24 గంటలు కాకముందే కాంగ్రెస్ పార్టీ గూండాయిజానికి, రౌడీయిజానికి పాల్పడుతోందని ఆరోపించారు.'పదేళ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నారని, తాము ఎప్పుడైనా తమ కార్యకర్తలు హద్దులు దాటి ప్రవర్తించారా? అని ప్రశ్నించారు. ఒక ఉప ఎన్నికల్లో గెలిచిన వెంటనే, తమ పార్టీ గుర్తు అయిన కారును ఊరేగింపు తీస్తూ, అవహేళనగా చిల్లరగా ప్రవర్తించారని మండిపడ్డారు. పరామర్శించిన వారిలో బిఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మాగంటి సునీత, ఎంఎల్‌ఎలు కౌశిక్ రెడ్డి, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

## 20 నుంచి 'ఇండియన్ ఫోటో ఫెస్టివల్ '

**ప్రజాపక్షం/హైదరాబాద్:**భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఫోటో ఫెస్టివల్ (ఐపిఎఫ్) 11వ ఎడిషన్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. ఈ ఐపిఎఫ్ ఫెస్టివల్ ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగనున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఫోటో జర్నలిజం నుండి లలిత కళ వరకు, డాక్యుమెంటరీ నుండి ల్యాండ్‌స్కేప్ వరకు కేవలం ఒక్క భారతదేశం నుండే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అద్భుత ఫోటో, డాక్యుమెంటరీ, దృశ్యాలను ఈ ఇండియన్ ఫోటో ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఐపిఎఫ్ ఎడిషన్‌లో సోలో ఎగ్జిబిషన్‌లు, గ్రూప్ షోకేస్‌లు, ఆర్టిస్ట్ టాక్స్, వర్క్‌షాప్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ స్క్రీనింగ్‌లు ఉంటాయని, ఫోటో ఫెస్టివల్ ఎడిషన్ కోసం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుండి 820 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిని నిష్ణాతులైన జ్యూరీ సభ్యులు ఫైనలిస్టులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జెన్నిఫర్ ఆల్ఫోన్స్ దర్శకత్వం వహించిన నాగోబా జాతరతో పాటు అనేక అంశాలపై డాక్యుమెంటరీలు ప్రదర్శన ఉంటుందని, ఇండియన్ ఫోటో ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు వెబ్ సైట్ www.indian photo fest.comను సందర్శించాలని జయేష్ రంజన్ పేర్కొన్నారు.

## ఎసిబి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ పత్రాలను సీజ్ చేశారు. ఈ కార్యాలయాల్లో దాదాపు 19 మంది ప్రైవేట్ వ్యక్తులతో పాటు 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కూడా ఎటువంటి అనుమతి లేకుండా ఎస్ఆర్ఒ కార్యాలయాల్లో రిజిస్టర్ పత్రాలు తరలిస్తున్నట్లు గుర్తించారు. కార్యాలయాల్లో సిసిటివి కెమెరాలు పనిచేయడం లేదు. సంబంధిత అధికారులపై ఎసిబి అధికారులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. కార్యాలయాలతో పాటు సబ్‌రిజిస్ట్రార్ అధికారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించి వారి ఇండ్ల నుండి నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి రమేశ్ ఆధ్వర్యంలో సిఐ శేఖర్ డాక్యుమెంట్ రైటర్ల గదులను పరిశీలించి పలువురి సెల్‌ఫోన్లను, అనుమానాస్పద నగదును స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు, రికార్డులను పరిశీలించారు. డాక్యుమెంట్ రైటర్లను సైతం విచారించారు. వనపర్తిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు సోదాలు చేశారు. జడ్చర్లలో వనపర్తి సబ్‌రిజిస్ట్రార్ చంద్రశేఖర్ ఇంట్లో సిఐ జిలానీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రెండుచోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి జగదీశ్‌చంద్ర ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ బలరాంయాదవ్ ఇంట్లో నూ సోదాలు నిర్వహించారు. రికార్డులు, దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. అనధికారిక అసిస్టెంట్ వద్ద గల రూ.60,160 నగదును సీజ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోని రంజోల్ గ్రామ సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై మెదక్ జిల్లా డిఎస్‌పి సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆఫీసులోని 10 మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.42,300లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి శేఖర్‌గౌడ్ అధ్వర్యంలోని అధికారులు గేట్లు మూసివేసి తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ల దస్త్రాలు పరిశీలించారు. కాంప్లెక్స్‌లోని డాక్యుమెంట్ రైటర్స్ తమ షాపులకు తాళాలు వేసి పరుగులు పెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి సాంబయ్య ఆధ్వర్యంలో సిఐలు ఎస్ రాజు, ఎల్ రాజు, సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లు ఆఫీస్‌లోనే తిష్ట వేయడాన్ని గుర్తించారు. 42 డాక్యుమెంట్లను దస్తావేజు రైటర్లు సంతకం లేకుండానే నేరుగా తీసుకున్నట్టు తెలిపారు.

## భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఒక అధికారి, బృందంతో సంబంధం ఉన్న ఒక దర్జీ దురదృష్టకర పేలుడులో మరణించారని ప్రభాత్ చెప్పారు. 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ప్రక్కనే ఉన్న ప్రాంతాల నుండి వచ్చిన ముగ్గురు పౌరులు గాయపడ్డారని, వారిని వెంటనే చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించామని ఆయన అన్నారు. ఎఫ్ఎస్ఎల్ బృందాలు స్వాధీనం చేసుకున్న భారీ పేలుడు పదార్థాల నుండి ఫోరెన్సిక్, రసాయన పరీక్షల కోసం నమూనాలను తీసుకునే నిర్దేశిత విధానాన్ని నిర్వహిస్తున్నప్పుడు పేలుడు సంభవించిందని ప్రభాత్, లోఖండే స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలు అస్థిరంగా, సున్నితమైన స్వభావం కలిగి ఉన్నందున ఎఫ్ఎస్ఎల్ బృంద అత్యంత జాగ్రత్తగా నామూనా సేకరిస్తుందని ప్రభాత్ చెప్పారు. అయితే, దురదృష్టవశాత్తు శుక్రవారం రాత్రి 11.20 గంటల ప్రాంతంలో సంభవించిందన్నారు. సున్నితమైన స్వభావం కారణంగా నమూనా ప్రక్రియ రెండు రోజులుగా కొనసాగుతోందని ఆయన అన్నారు. భారీ పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనం తీవ్రంగా దెబ్బతిన్నదని, పక్కనే ఉన్న నిర్మాణాలపై కూడా ప్రభావం పడిందన్నారు. చిన్న చిన్న పేలుళ్లు మొదట్లో సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి.

**దర్యాప్తునకు ఆదేశించాం : ఎల్‌జి**

ఘటనపై జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందిస్తూ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై దర్యాప్తుకు ఆదేశించామన్నారు. ప్రమాదవశాత్తు పేలుడుకు కారణాన్ని నిర్ధారించడానికి దర్యాప్తుకు ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. నమూనాగా సేకరించిన పదార్థాలలో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి దాదాపు 360 కిలోల పేలుడు పదార్థాలు, రసాయనాలు, కారకాలు ఉన్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ నుండి టాటా 407 పికప్ ట్రక్కు లో చిన్న సంచులలో పేలుడు పదార్థాల భారీ నిల్వను తీసుకువచ్చారని ఒక ఉన్నతాధికారి తెలిపారు. కశ్మీర్‌కు పేలుడు పదార్థాలను రవాణా చేయడానికి గల కారణం వివరిస్తూ అసలు కేసు నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైందని, పేలుడు పదార్థాలు ఆ పోలీస్ స్టేషన్ కేసు ఆస్తి అని అధికారి తెలిపారు. అందువల్ల, ఇప్పటివరకు పేలుడు పదార్థాలను రవాణా చేయాల్సిన అవసరం ఉంద ని అధికారి తెలిపారు. పేలుడు పదార్థాలను సేకరించిన 'వైట్‌కాలర్' టెర్రర్ మాడ్యూల్ లక్ష్యాల గురించి ప్రశ్నించగా, దర్యాప్తుదారులు ఇంకా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారని అధికారి తెలిపారు. ఈ నిల్వను జమ్ముకశ్మీర్ పోలీసులు 9, 10 తేదీలలో ఫరీదాబాద్‌లోని అరెస్టయిన నిందితుడు డాక్టర్ ముజ్జామిల్ గనై అద్దెకు తీసుకున్న నివాసం నుండి స్వాధీనం చేసుకున్నారు. 360 కిలోల పేలుడు పదార్థాలలో ఎక్కువ భాగాన్ని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లోని బహిరంగ ప్రదేశంలో సురక్షితంగా నిల్వ చేశారు. అక్టోబర్ మధ్యలో నౌగామ్‌లోని బున్‌పోరాలో గోడలపై పోలీసులు, భద్రతా దళాలను బెదిరించే పోస్టర్లు వెలిసిన తర్వాత దర్యాప్తు ప్రారంభమైంది.

**పలువురు నాయకులు విచారం**

పేలుడు పట్ల జమ్ముకశ్మీర్‌లోని పలువురు రాజకీయ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తుకు ఆదేశించిన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ప్రాణనష్టం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. జమ్ములో ఉదయం జరగాల్సిన భద్రతా సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన సిన్హా, ఈ సంఘటన దృష్ట్యా సమావేశాన్ని రద్దు చేసుకున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్‌లో ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. 'విలువైన ప్రాణాలను బలిగొంది, అనేక మంది సిబ్బందిని గాయపరిచింది. మృతుల కుటుంబాలకు అబ్దుల్లా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తూ. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని' ప్రార్థిస్తున్నా అని అన్నారు. ఈ విషాదం తనను తీవ్రంగా బాధపెట్టిందని మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజాద్ లోన్ ఈ సంఘటనను హృదయ విదారకంగా అభివర్ణించారు. డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఎపి) అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ కూడా మరణాలకు సంతాపం తెలిపారు.

**కేంద్రం మేల్కోవాలని కాంగ్రెస్ హితవు**

శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి నిఘా, ఉగ్రవాద నిరోధక యంత్రాంగాలను బలోపేతం చేయడానికి ఒక మేల్కొలుపు అని, జవాబుదారీతనం నుండి తప్పించుకోవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బయటి శక్తుల మద్దతు ద్వారా పెరుగుతున్న ఉగ్ర ముప్పుపై చర్చించడానికి అత్యవసరంగా అఖిలపక్ష సమావేశం ఏర్పా టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేలుడుపై ఆందోళన వ్యక్తం చేశారు. మృతులకు నివాళులు అర్పించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిచారు. పేలుడులో ప్రాణా లు కోల్పోవడం పట్ల ఖర్గే తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారికి తక్షణ వైద్య సహాయం, మృతుల బంధువులకు పరిహారం అందించాలని కోరారు. 'తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులకు తక్షణ వైద్య పర్యవేక్షణతో చికిత్స అందించాలి. బాధితులకు తగిన పరిహారం అందించాలని ఖర్గే పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఉగ్రవాద దాడి తర్వాత కొన్ని రోజులకే ఈ పరిణామాలు వచ్చాయని, కేంద్రప్రభుత్వం నిఘా, ఉగ్రవాద వ్యతిరేక యంత్రాంగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జవాబుదారీగా ఉండలన్నారు. ఉగ్రవాద మహమ్మారికి వ్యతిరేకంగా దేశానికి కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు. ఇటీవల ఎర్రకోట ఉగ్రవాద దాడి దృష్ట్యా, బాహ్య శక్తుల నుండి మద్దతుతో పెరుగుతున్న ఉగ్రవాద ముప్పుపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## మీడియా అకాడమీలో నేడు జాతీయ పత్రికా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ పాల్గొంటున్నారు. ప్రముఖ సంపాదకులు దేవులపల్లి అమర్, అదే విధంగా పుర ప్రముఖులు, వర్కింగ్ జర్నలిస్టులు హాజరవుతారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పనిచేయడం ప్రారంభించిన రోజునే నేషనల్ ప్రెస్ డేగా జరుపుకుంటాము. 1956లో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటును చేస్తూ, జర్నలిజంలో వృత్తిపరమైన నీతిని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గంగా పరిగణించబడింది. ఈ కార్యక్రమానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నందున అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మీడియా అకాడమీ కార్యదర్శి ఒక ప్రకటనలో కోరారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సే) శాఖ
ఫారం-VI
(సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 19- సెక్షన్ 11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)

ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: 2279/2025 తేదీ: 13.11.2025
RDO ఫైలు సంఖ్య. సి/1958/2025 తేదీ: 12.11.2025
గెజిట్ సంఖ్య: 59/2025 తేదీ: 13.11.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్-I, సూర్యాపేట, గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు లో ఉన్న భూమిలోని సర్వే నెం. 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255 & 259లో మొత్తం భూమి **ఎ.9.34 1/4 గుంటల** భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట నిర్మాణము కొరకు, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందేహక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.
కావున మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు పరిధిలో ఉన్న సర్వే నెం 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255& 259 లో మొత్తం భూమి **ఎ.9.34 1/4 గుంటల** భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage -II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట. నిర్మాణము కొరకు అవసరమైనదిగా ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము : బుర్కచర్ల మండలం : మోతే జిల్లా : సూర్యాపేట

షెడ్యూల్

| క్ర.సం. | సర్వే నెంబర్ | యాజమాన్య రకము | భూమి రకము | సేకరించబడు భూమి విస్తీర్ణం ఎ/గుం | పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 142 | పట్టా | మెట్ట | 0.01 | రోడ్డు | 114 | 114 | గ్రామ సరిహద్దు | 132 | |
| | | | | 0.02 1/2 | భూక్యా సురేందర్ తండ్రి దరియాబ్ (ప & అ) | | | | | |
| 2 | 122 | పట్టా | మెట్ట | 0.23 | గార్లపాటి సునిత భర్త వెంకటరెడ్డి (ప & అ) | 122 | 122 | 128 | 193 | |
| | | | | 0.05 | బానోతు మంగత్య @ మంగ్యా తండ్రి వెంకటరాం (ప & అ) | | | | | |
| 3 | 128 | పట్టా | మెట్ట | 0.11 1/2 | గార్లపాటి సునీత భర్త వెంకటరెడ్డి (అ)<br>బానోత్ మంగ్యా తండ్రి వెంకట్ రాం (ప)<br>సలికంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (ప)<br>ములుకూరి సురేందర్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప)<br>గార్లపాటి వెంకట రెడ్డి తండ్రి లచ్చిరెడ్డి (ప) | 128 | 128 | 129 | 122 | |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.03 1/2 | ములుకూరి ఉష భర్త సురేందర్ రెడ్డి (అ)<br>సలిగంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (అ) | 129 | 129 | 131 | 128 | |
| | | | | 0.13 | ములుకూరి మధుసూదన్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప) | | | | | |
| 5 | 131 | పట్టా | మెట్ట | 0.01 1/2 | డొంక | 131 | 131 | 132 | 129 | |
| | | | | 0.11 | భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ) | | | | | |
| | | | | 0.12 1/2 | భూక్యా మహేందర్ తండ్రి వాల్య (ప& అ) | | | | | |
| | | | | 0.12 1/2 | భూక్యా సురేష్ తండ్రి బాలు (ప & అ) | | | | | |
| | | | | 0.07 1/2 | భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ) | | | | | |
| 6 | 132 | పట్టా | మెట్ట | 0.09 1/2 | ధారవత్ లింగా తండ్రి బాన్య (ప & అ) | 132 | 132 | 114 | 131 | |
| | | | | 0.02 1/2 | భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.00 1/2 | భూక్య మహేందర్ తండ్రి వాల్య(ప & అ) | | | | | |
| | | | | 0.09 1/2 | ధారవత్ చాంప్లా తండ్రి బాన్య(అ)<br>భూక్య కవిత తండ్రి మహేందర్ (ప)<br>భూక్య స్వామి తండ్రి వుమ్లా (ప)<br>ధరవత్ నగేష్ తండ్రి బిక్షం (ప)<br>భూక్య చిరంజీవి తండ్రి స్వామి (ప)<br>భూక్య లింగా తండ్రి స్వామి (ప)<br>భూక్య రాంజీ తండ్రి స్వామి(ప) | | | | | |
| 7 | 142 | పట్టా | ప్రభుత్వ భూమి | 0.02 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ)<br>నిమ్మరబోయిన మల్లయ్య తండ్రి రాములు (ప)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి రాములు (ప)<br>బానోత్ రఘు తండ్రి లింగా (ప)<br>మేకరబోయిన శివమ్మ భర్తవెంకన్న (ప)<br>నిమ్మరబోయిన సతీష్ తండ్రి కనకయ్య(ప)<br>నిమ్మరబోయిన పిచ్చయ్య తండ్రి ముత్తయ్య (ప)<br>బానోతు రాము తండ్రి లింగా (ప)<br>భూక్య బాలు తండ్రి సూర్య (ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి సత్యం (ప)<br>నిమ్మరబోయినమల్లికాంబ భర్తవెంకన్న (ప)<br>షేక్ ఖాశిం తండ్రి పీరుసాబ్ (ప)<br>జెట్టి లక్ష్మ య్య తండ్రి వీరాస్వామి (ప)<br>షేక్ జానీ బాబు తండ్రి షర్పద్దీన్(ప)<br>భూక్య రమేశ్ తండ్రి గోల్య (ప)<br>నిమ్మరబోయిన గురవయ్య తండ్రిరామయ్య (ప)<br>భూక్య పొట్టి తండ్రి శంకర్ (ప)<br>భూక్యా మహేందర్ తండ్రి వాల్య(ప)<br>భూక్య హము తండ్రి సకు రాం (ప)<br>షేక్ యాకూబ్ పాషా తండ్రి మౌలానా (ప)<br>షేక్ ష బ్బీర్ తండ్రి మౌలనా(ప)<br>నిమ్మరబోయిన ఉప్పలయ్య తండ్రి లచ్చయ్య (ప)<br>నాగిరెడ్డి కోటమ్మ భర్త నారాయణ రెడ్డి(ప)<br>నాగిరెడ్డి హేమలత భర్త వెంకట రెడ్డి(ప)<br>నిమ్మరబోయిన సీతమ్మ భర్త గురవయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>భూక్యా నాగు తండ్రి ధర్మ (ప)<br>భూక్యా రాంజా తండ్రి గోల్య (ప)<br>గూగులోతు పందు తండ్రి బిచ్యా(ప)<br>నిమ్మరబోయిన లక్ష్మమ్మ భర్త రామయ్య (ప) | 142 | 142 | 159 | కెనాల్ | |
| 8 | 157 | పట్టా | మెట్ట | 0.05 | నిమ్మరబోయిన గంగయ్య తండ్రి యల్లయ్య (ప&అ) | 157 | 157 | 176 | 161 | |
| | | | | 0.05 | నిమ్మరబోయిన బిక్షం తండ్రి వీరయ్య (అ&ప) | | | | | |
| | | | | 0.01 | నిమ్మరబోయిన కరుణాకర్ తండ్రి వెంకన్న (అ &ప) | | | | | |
| 9 | 159 | పట్టా | మెట్ట | 0.11 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ &ప) | 159 | 159 | 160 | 142 | బోరు |
| | | | | 0.02 | చెరుకు భారతమ్మతండ్రి రోషయ్య(ప & అ) | | | | | |
| 10 | 160 | పట్టా | మెట్ట | 0.05 | చెరుకు మల్సూర్ తండ్రిజానయ్య (ప&అ) | 160 | 160 | 161 | 159 | బోరు |
| 11 | 161 | పట్టా | మెట్ట | 0.16 1/2<br>0.07 1/4<br>0.02 | కొత్తపల్లి నాగలక్ష్మి భర్త వెంకన్న (అ)<br>జెట్టి లింగయ్య తండ్రి నాగయ్య (అ)<br>చెరుకు సైదులు తండ్రి జానయ్య (అ)<br>అర్వ పల్లి చంద్రయ్య తండ్రి కాశయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>చెరుకు మల్సూర్ తండ్రి జానయ్య(ప)<br>చెరుకు వీరాస్వామి తండ్రి జానయ్య (ప)<br>కొత్తపల్లి రమేశ్ తండ్రి నరసయ్య (ప)<br>నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు (ప) | 157 | 160 | 161 | 161 | బోరు<br>బోరు |
| | | | | 0.03 1/4 | నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు(ప & అ) | | | | | |
| 12 | 176 | పట్టా | మెట్ట | 0.09 1/4 | కొండ గంగమ్మ భర్త పాపయ్య (అ)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి యల్లయ్య(ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి బిక్షం (ప) | 176 | 176 | 177 | 157 | 5 - తాటి చెట్లు |
| 13 | 177 | పట్టా | మెట్ట | 0.03 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ&ప) | 177 | 176 | 180 | 176 | |
| 14 | 178 | పట్టా | మెట్ట | 0.05 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (ప & అ) | 178 | 178 | 179 | 180 | |
| 15 | 179 | పట్టా | మెట్ట | 0.06 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ) | 179 | 179 | 187 | 178 | |
| | | | | 0.02 | కొండ మాధవి భర్త అనిల్ (అ) | | | | | |
| | | | | 0.01 1/2 | బండ | | | | | |
| | | | | 0.01 1/2 | భూక్యా నాగు తండ్రి ధర్మ (అ) | | | | | |
| 16 | 180 | పట్టా | మెట్ట | 0.02 | కొండ ప్రకాష్ తండ్రి పెన్నయ్య (అ) | 180 | 180 | 179 | 177 | |
| | | | | 0.02 1/2 | కొండ లింగమ్మ భర్త వీరయ్య (అ) | | | | | |
| | | | | 0.04 | కొండ సాలమ్మ తండ్రి గోపయ్య(అ) | | | | | |
| 17 | 187 | పట్టా | మెట్ట | 0.02 | భూక్య నాగు తండ్రి ధర్మ (అ) | 187 | 179 | 188 | 179 | |
| 18 | 188 | | మెట్ట | 0.02 | ధారవత్ నాన్కు తండ్రి బాల్య(అ)<br>దర్శాసోత్తు తండ్రి భీముడు (ప) | 188 | 188 | 189 | 179 | |
| | | | | 0.12 1/2 | షేక్ యాకూబ్ తండ్రి మౌలానా (ప & అ)<br>షేక్ షబ్బీర్ తండ్రి మౌలానా (ప & అ) | | | | | బోరు |
| 19 | 189 | పట్టా | మెట్ట | 0.07 | భూక్యా మంగత్య @ మంగ్యా తండ్రి కృష్ణ (ప& అ) | 189 | 189 | 191 | 188 | |
| 20 | 191 | పట్టా | మెట్ట | 0.06 | భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (అ)<br>దేకహరాజు లక్ష్మీ వరప్రసాద్ తండ్రి వెంకటేశ్వర రావు (ప)<br>బానోత్ సురేష్ తండ్రి మంగత్య (ప) | 191 | 191 | 193 | 189 | |
| 21 | 193 | పట్టా | మెట్ట | 0.01 1/2 | వాగు | 193 | 193 | 122 | 191 | వాగు |
| | | | | 0.01 1/2 | భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.05 | భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.00 1/2 | రామసాయి నీరజ భర్త బిక్షం రెడ్డి (అ)<br>భూక్య మోతీరం తండ్రి లక్ష్మ ణ్ (ప)<br>మహమ్మద్ అబ్దుల్ హకీం కురేషీ తండ్రి రావుఫ్ కూరేషీ(ప) | | | | | |
| 22 | 245 | పట్టా | మెట్ట | 0.01 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య (ప & అ) | 245 | 245 | గ్రామ సరిహద్దు | 246 | |
| | | | | 0.07 | బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య (అ)<br>బొమ్మగాని సత్తెమ్మ భర్త వెంకటయ్య(ప)<br>బొమ్మగాని వెంకటయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని రాంమూర్తి తండ్రి ఎల్లయ్ (ప)<br>బొమ్మగాని కొండయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని కాశయ్య తండ్రి ఎల్లయ్య (ప)<br>మండవ ఎల్లయ్య తండ్రి బుచ్చయ్య (ప)<br>బొమ్మగాని శ్రీను తండ్రి వెంకటయ్య (ప)<br>సూరబోయిన శైలజ భర్త నాగరాజు (ప)<br>జెట్టి లింగరాజు తండ్రి శ్రీను (ప)<br>బొమ్మగాని కటంరాజు తండ్రి రాంమూర్తి (ప)<br>బొమ్మగాని వెంకన్నతండ్రి రాంమూర్తి (ప) | | | | | |
| | | | | 0.07 | జెట్టి గంగయ్య తండ్రి చింతలు (అ &ప) | | | | | |
| | | | | 0.06 1/2 | పంతగి పరమేశ్ తండ్రి నర్సయ్య (అ) | | | | | |
| 23 | 246 | పట్టా | మెట్ట | 0.03 | జెట్టి ఉప్పమ్మ భర్త శ్రీను (ప& అ) | 246 | 246 | 245 | 255 | |
| | | | | 0.01 | జెట్టి వీరయ్య తండ్రి చింతలు (ప & అ) | | | | | |
| | | | | 0.02 1/2 | పంతగి పరమేశ్ తండ్రి నర్సయ్య (అ)<br>పంతంగి నర్సయ్య తండ్రి సాయిలు (ప) | | | | | |
| | | | | 0.00 1/2 | జెట్టి గంగయ్య తండ్రి చింతలు (ప & అ) | | | | | |
| | | | | 0.06 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య(ప & అ) | | | | | |
| | | | | 0.05 1/2 | బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య(ప & అ) | | | | | |
| | | | | 0.18 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి యల్లయ్య (ప & అ)<br>బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య (ప & అ) | | | | | |
| 24 | 252 | పట్టా | మెట్ట | 0.10 1/2 | ధరవత వీరన్న తండ్రి వాల్య (అ)<br>బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి (ప )<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప )<br>బండారు శ్రీనివాస్ రెడ్డి తండ్రి సామీ రెడ్డి (ప )<br>బండారు వెంకట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి (ప ) | 252 | 252 | 259 | 252 | |
| 25 | 253 | పట్టా | మెట్ట | 0.07 1/2 | వాగు | 253 | 254 | 251 | 259 | వాగు |
| 26 | 254 | పట్టా | మెట్ట | 0.13 1/2 | వాగు | 253 | 254 | 255 | 259 | వాగు |
| 27 | 255 | పట్టా | మెట్ట | 0.18 | వాగు | 255 | 255 | 246 | 254<br>253 | వాగు |
| 28 | 259 | పట్టా | మెట్ట | 0.10 1/2 | బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి / బాస్కర్ రెడ్డి (ప & అ) | 259 | 259 | 253 | 252 | |
| | | | | 0.05<br>0.01<br>0.002<br>0.05 | ధరావ ధరావత్ వీరన్న తండ్రి వాల్య(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప)<br>బండారు శ్రీనివా్రెడ్డి తండ్రి సామీ రెడ్డి(ప)<br>బండారు వెంక ట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి(ప) | | | | | |
| 29 | డొంక | | | | హద్దీ రాస్తా | | | | | |
| | మొత్తం : 9.34 1/4 | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (నెం. 30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు, సూర్యాపేట గార్లు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.
భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలయును.

సం/- రాజస్వ మండలాధికారి, సూర్యాపేట | సం/- అదనపు కలెక్టరు, సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టరు, సూర్యాపేట

DIPR RO NO. 828/LA/PP/Advt/Pub/2025-26

# ప్రజల హక్కుల పరిరక్షణలో సిపిఐదే కీలకపాత్ర

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/ముధోల్/నిజామాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సిపిఐ పార్టీ శత వార్షికోత్సవ బస్సు యాత్రను ముధోల్ నియోజకవర్గంలోని బాసర మండలం నుండి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ప్రజల హక్కుల సాధనలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించిందని పశ్య పద్మ స్పష్టం చేశారు. స్వతంత్ర భారతదేశం ఏర్పడటంలో సిపిఐ నాయకులు చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఆమె కొనియాడారు. ఈ బస్సు యాత్ర ద్వారా పార్టీ సిద్ధాంతాలను, ప్రజల కోసం చేసిన పోరాటాలను ప్రజలోకి తీసుకెళ్లామని ఆమె తెలిపారు. నేడు దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసే ఏకైక పార్టీ సిపిఐ అని పశ్య పద్మ గట్టిగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆమె విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి, కార్మికులు రోజుకు 8 గంటలే పని చేసే విధంగా సిపిఐ సాధించిన విజయాన్ని నేటి ప్రభుత్వం కార్మిక చట్టాలకు మార్చడం ద్వారా కాలరాసే ప్రయత్నం చేస్తోందని, కార్మికులపై మరింత పని భారం మోపుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేసి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని పశ్య పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతూ, కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు పన్నులు మినహాయింపులు వర్తింపజేసి, ప్రజాధనాన్ని వారి చేతిలో పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. సామాన్య ప్రజలకు సిపిఐ నిరంతరం అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని పశ్య పద్మ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి విలాస్, నాయకులు, పార్టీకి సంబంధించిన అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సిపిఐ త్యాగం వెలకట్టలేనిది**
**మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా**

సిపిఐ కార్మికవర్గం కష్టజీవుల పార్టీ అని వందేళ్ల సభను విజయవంతం చేద్దామని మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల పండగ సందర్భంగా బస్సు ప్రచార జాత బాసర నుంచి ప్రారంభమై శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్సపల్లి నుంచి గాంధీ గంజ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ గంజ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. కళాజాత కళాకారులు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ ఎంపీ అజీజ్‌పాషా, పశ్య పద్మ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, డీజీ నరేంద్ర ప్రసాద్, ఉప్పలయ్య, నగర కార్యదర్శి ఓమయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తర్వాత వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది సిపిఐ మాత్రమేనన్నారు. దేశంలో ఎన్నో పార్టీలు పురుడు పోసుకున్నాయి అంతరించిపోయాయని ప్రజల సమస్యల మీద ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా పోరాటాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందినదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిపిఐ త్యాగం వెల కట్టలేనిదన్నారు. కమ్యూనిస్టు పార్టీ పుణ్యం వల్ల 10 లక్షల ఎకరాలు భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సభకు మూడు నుంచి ఐదు లక్షల వరకు కామ్రేడ్లు హాజరు కానున్నారని, ఇతర దేశాల నుంచి 40 మంది ప్రతినిధులు రానున్నారన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ దేశాల ఆర్థిక స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని, ఎగుమతులు దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరి కాదన్నారు. డిసెంబర్ 26న చరిత్రలో నిలిచిపోయే సిపిఐ శత జయంతి ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేద్దామన్నారు. మెక్ అమెరికా బిగ్ అగైన్ అని అతిపెద్ద సంపద గల దేశంగా మార్చుకోవడంలో భాగంగా ఎగుమతులు దిగుమతులను పెంచుతూ ట్రంప్ కుట్ర చేస్తున్నారన్నారు. దేశంలో రాష్ట్రంలో కార్మిక కర్షకులు ఇబ్బందుల పాలువుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచే సిపిఐకి మద్దతు తెలుపాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేశ్వర్, రాజన్న, స్వరూప, రాణి, రఘురాం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు

### మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరా గాంధీ జయంతి రోజున (నవంబర్ 19న) మహిళా శక్తి బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలను చేపడతామని, మహిళా సమాఖ్య సభ్యులకు ప్రత్యేక యూనిఫాముల చీరలు త్వరలో అందజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. 'స్వయం సహాయక బృందాల రూపంలో సగటు స్త్రీ అస్తిత్వం మరింత శక్తివంతమవుతుందని, ఎస్‌హెచ్‌జిల భాగస్వామ్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ, వారిని ప్రపంచ మార్కెట్ వైపు తీసుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షుల రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరవ్వగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలడిఆర్‌డిఒలు, అదనపు డిఆర్‌డిఒలు, అన్ని మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు హాజరయ్యారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు జరిపించాలని, ప్రతి ఆడపిల్లను చదివించడం, మహిళలపై జరిగే ఏ రకమైన హింసనైనా ఎదిరించడం, కులమత భేదాలను వదిలివేయడం, అంటరానితనాన్ని నిర్మూలించడంలో ముందుండడం లాంటి అంశాలపై మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సీతక్క ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు విస్తరిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వ సంకల్పంపై కొంతమంది ఎద్దేవా చేసినప్పటికీ, ఇప్పటికే అనేక మండల సమాఖ్యల్లో కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని, గ్రామీణ మహిళలు వ్యాపారాలను నెలకొల్పారని వివరించారు. ఆదిలాబాద్ ఆదివాసీ మహిళలు తయారు చేస్తున్న ఇప్ప పువ్వు లడ్డూలు విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందుతున్నాయని, స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలతో మహిళల్లో ధైర్యం పెరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలే సాధారణ స్త్రీకి అస్తిత్వాన్ని ఇచ్చే వేదికలన్నారు. సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమ, ఇందిరా గాంధీలా మహిళలు ధైర్యంగా నిలబడితే కొత్త చరిత్ర లికించ వచ్చన్నారు. అనంతరం డిఆర్‌డిఒ, అదనపు డిఆర్‌డిఒలతో మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్మాణాలు

### సచివాలయంలో భక్తుల క్యూలైన్ల బ్రాస్ గ్రిల్స్ నమూన పరిశీలించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమ్మక్క-సారక్క మేడారం జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్ఘాటించారు. యావత్ ప్రపంచం ఈ జాతర కోసం ఎదురు చూస్తుందని పేర్కొన్నారు. ఈ జాతర వేదిక... ప్రపంచం నలుమూలలూ చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మేడారం విలసిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క-సారలమ్మ పోరాట గాథ, చరిత్ర విశ్వవ్యాప్తమవుతున్నదని చెప్పారు. సమ్మక్క సారక్క మేడారం జాతరలో అమ్మవారి గద్దెల చుట్టూ భక్తులు క్యూలైన్లలో సాఫీగా వెళ్ళేందుకు తయారు అవుతున్న బ్రాస్ గ్రిల్స్ నమూనాను తెలంగాణ సెక్రటేరియట్‌లో శనివారం కొండా సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులతో స్వయంగా మాట్లాడారు. గిరిపుత్రుల ఆరాధ్య దేవతల ఆశీస్సులు తీసుకునేందుకు... మొక్కులు చెల్లించుకునేందుకు... ఆ ప్రాంతాన్ని సందర్శించి తన్మయత్వం చెంది పునీతులయ్యేందుకు కోట్లలో భక్తులు, ప్రజలు జాతరకు వస్తారని, అందుకు తగిన విధంగా బ్రాస్ గ్రిల్స్ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని సూచన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మేడారంలో పెద్ద ఎత్తున శాశ్వత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణ సంబంధిత నిర్వాహకులు మంత్రి సురేఖకి గ్రిల్స్ చూపించేందుకు బ్రాస్ గ్రిల్స్‌ను స్వయంగా సచివాలయానికి తీసుకొచ్చామని అక్కడే ఎదురైన మీడియా ప్రతినిధులకు చెప్పారు. దాదాపు రెండు వందల ఏండ్ల పాటు మన్నికగా ఉండే ఉద్దేశంతో ఈ గ్రిల్స్‌ను పటిష్టంగా తయారు చేయించినట్టు చెప్పారు. వీటిని సమ్మక్క సారక్క, జంపన్న గద్దెల చుట్టూ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వెళుతుందని, ఈ నేపథ్యంలో మేడారం జాతరలో భక్తుల రద్దీ నిర్వహణను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు మూడు నెలల ముందు నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారిని అభినందించారు.



# పార్టీని భ్రష్టు పట్టించింది హరీష్, కెటిఆర్‌లే




### తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు

**ప్రజాపక్షం/మెదక్ :** కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్‌ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటిఆర్ అధోగతి పాలు చేస్తూ భ్రష్టు పట్టించారని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా వజ్రాయుధంలా జాగృతి సంస్థ పనిచేస్తుందని అన్నారు. మెదక్ జిల్లా కోసం విన్నది వేరని ఇక్కడ చూస్తే వేరేలా ఉందని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని అన్నారు. కెటిఆర్ సోషల్ మీడియాలోనే పోరాటం చేస్తున్నారని సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రజల్లోకి రావాలని ఎమ్మెల్సీ కవిత సలహా ఇచ్చారు. మెదక్ జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కవిత పర్యటన రెండవ రోజు శనివారం సాగింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్‌ను అధోగతి పాలు చేశారన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలు రాష్ట్రంలో ప్రతిపక్షం బలంగా లేదన్న విషయాన్ని గుర్తు చేసిందన్నారు. అన్న కెటిఆర్ సోషల్ మీడియాలోనే ప్రజల సమస్యలు తీసుకు వస్తున్నాడని, సోషల్ మీడియాను వీడి ప్రజల్లోకి వచ్చి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. హరీష్‌రావు పార్టీని మోసం చేయడం మానుకోవాలన్నారు. ఒక సభ సక్సెస్ అయితే కేసీఆర్‌ని మోసినట్లు ఫీల్ అవుతున్నారని, ఆయన ముందు వీరంతా బచ్చాలు అని పేర్కొన్నారు. హరీష్ రావు అవినీతిని బయటపెట్టిన సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెడ్డిపల్లి, చిప్పలదుర్తి, తునికి గ్రామాల మధ్య హరీష్ రావుకు 400 ఎకరాల భూమి ఉందన్నారు. ఆయన భూమి కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారని విమర్శించారు. ఆ ప్రాంతంలో రిసార్ట్ నిర్మాణం చేసి ప్రజలను రానివ్వడం లేదన్నారు. చిన్న చింతకుంటలో గంగుల కమలాకర్‌కు 15 ఎకరాలు, నవీన్‌రావుకు 18 ఎకరాలు భూమి ఉండడం అలైన్‌మెంట్ మార్చారని రైతులు చెబుతున్నారని, నిజామా కాదా నేతలే చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి హాస్టల్ అద్దె రూ.లక్షా 6 వేలు తీసుకుంటున్నాడని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటివి కేసీఆర్‌కు తెలిసి ఉండవని, తెలిస్తే ఆయన ఒప్పుకునే వారు కాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం పరిధిలోని, అశ్వారావుపేట మున్సిపాలిటీ, అశ్వారావుపేట (గ్రామం & మండలం), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గల **దొంతి కుంట చెరువును మిని ట్యాంక్ బండ్** చేయు పనులకు సంబంధించిన టెండర్ నోటీస్ నెంబర్: 11/2025-26, తేదీ: 11.11.2025లో అంచనా మొత్తం **రూ.3,76,21,677/-** టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు **17.11.2025, 3.00PM నుండి 01.12.2025, 3.00PM** వరకు లభించును. **గమనిక:** మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం
DIPR R.O. No. : 10746-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

HYDERABAD
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
చందానగర్ సర్కిల్-21, శేరిలింగంపల్లి జోన్.
**క్ర.సం.1, NIT No.** 21/SLPZ/GHMC/2025-26, తేదీ: 13.11.2025. **పని పేరు:** ఎఫ్ఒబిల నిర్వహణ, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 14.11.2025న మ.2.00గం.ల నుండి 17.11.2025న మ.2.00గం.ల వరకు, **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీమతి ఆర్.ఇందిరాబాయి, ఇఇ, డివిజన్-21, ఎస్ఎల్‌పి జోన్. **ఫోన్ నం.** 040-23033163. మరిన్ని టెండర్ వివరాలకు వెబ్‌సైట్ www.ghmc.gov.in ను చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10762-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
ఇ-టెండర్ నోటీసు
2025-26 సంవత్సరానికి (1) పని కోసం సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్‌లో గుమ్మడిదల సెక్షన్‌లోని బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. అనగా టెండర్ ఐడి: 643539 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఫైల్ నెం. 861976/S6/2025, తేదీ.14.11.2025తో ప్రచురించబడినది. పని వివరాలను @www.tender.telangana.gov.in కు లాగిన్ అయి చూడవచ్చు.

| క్ర.సం. | పని పేరు | అంచనా వేసిన మొత్తం రూ. |
|---|---|---|
| 1. | సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల సెక్షన్, బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. | రూ. 7,90,000/- |
| 2. | టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ సమర్పణ | 17.11.2025 @ 10:30 AM నుండి 03.12.2025 @ 3:00 PM |
| 3. | సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 3.50 PM |
| 4. | ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 4.30 PM |

**కార్యాలయ చిరునామా:** జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి, మల్కాపూర్ X రోడ్ దగ్గర, రాంచంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి - 502001 (సంప్రదింపు నంబర్ 9440810118).
సం/- జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి.
DIPR R.O. No. : 10702-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

## బాలికలు ఆత్మస్థైర్యంతో చదవాలి



**ప్రజాపక్షం/ హాలియా:** బాలికలు ఆత్మస్థైర్యంతో చదువుకుంటూ జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్, విద్యే ధన్ ఫౌండేషన్ సెక్రటరీ బూర్ల హరిత అన్నారు. శనివారం హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఏకే ఫౌండేషన్, విద్యే ధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థినీలకు కంప్యూటర్ మానిటర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజయ్ రామ్ సాఫ్ట్వేర్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు ఈ కంప్యూటర్ మానిటర్లు అందజేసినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ హైమావతి,విద్యే దన్ ఫౌండేషన్ సభ్యులు ఆశిష్,వాగ్దేవి,తనిష్క,మన్యం కోటి,రాము యాదవ్,గంగుల అంజి,బొమ్మిశెట్టి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయం



**ప్రజాపక్షం/నల్గొండ టౌన్ :** సీఎం ఆర్ ఎఫ్ పథకం నిరుపేదలకు చాలా ఉపయోగకరమైన పథకమని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 40 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన చెక్ లను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి నేతృత్వంలో అమలు అవుతున్నాయని ఆయన చెప్పారు.ఈ పథకం ద్వారా పేదప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందని అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




## తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే అని వారిని జాగ్రత్తగా చూసుకోవాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గాంధీపార్కు నుండి మిని ట్యాంక్ బండ్ వరకు వయోవృద్ధుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. ట్యాంక్‌బండ్ వద్ద వయోవృద్ధుల అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల కమిటి మెంబర్స్, వయో వృద్ధుల అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు ఎస్‌డి హామీద్‌ఖాన్, కృష్ణారెడ్డి, రామకృష్ణరెడ్డి, మల్లారెడ్డి, సిడిపిఓలు సుబ్బలక్ష్మి , కిరణ్మయి, శ్రీజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందలేదు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** జిల్లాలో వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ కోరారు. శనివారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. రైతులకు మద్ధతు ధర అందించడంతోపాటు బోనస్ కూడా అందించాలన్నారు. సహకార సంఘాలు ఐకెపి సెంటర్ల ద్వారా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలన్నారు. తుఫాన్ వర్షాల వల్ల జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని, ఆ రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి పరిహారం అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, వెంకటేశ్వర్లు, రమణ, యాదగిరి పాల్గొన్నారు.

## ప్రతి పుస్తకం విలువైంది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రంథాలయంలో ఉన్న ప్రతి పుస్తకం విలువైనదని వాటిని అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్ అన్నారు.58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా కలిగే ప్రత్యక్ష అనుభవం ఎంతో అనుభూతిని ఇస్తుందని పాఠకులకు ఏ విధమైన పుస్తకాలు కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. గ్రంథాలయానికి ఇంటర్ నెట్, వైఫై సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు.జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎన్.పద్మ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మన జ్ఞానం పెంపొందుతుందన్నారు.ప్రపంచ చరిత్ర,సాహిత్యం తెలుసుకునేందుకు పుస్తకాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ,సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, సంస్థ రాష్ట్ర నాయకుడు ఎస్.వేణుగోపాలాచార్యులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి ఫీజు బకాయిలు విడుదల చేయాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల వెంకటేష్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం జిల్లా అధ్యక్షులు వస్తుపూల అభిలాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజులు నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఫైర్, ల్యాబ్, క్వాలిఫైడ్ లెక్చరర్స్, కనీస మౌలిక సదుపాయాలు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు, బెస్ట్ అవలేబుల్, బకాయిలు, స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. ఆ ప్రభావ యాజమాన్యాల కంటే విద్యార్థులపై ఎక్కువ పడుతుందని ప్రభుత్వం ఆలోచించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు పెరిగిన కాస్మత్ చార్జీలు తక్షణమే చెల్లించాలని న్నారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లు స్వెటర్లు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మారపాక లోకేష్, జానీ, చందు, సాయికుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం

### పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద తుపాన్‌తో దెబ్బతిన్న కాలువలను, రహదారులను కట్ట పరిస్థితి పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షలతో పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద దెబ్బతిన్న పనుల పునరుద్ధరణకు అన్ని చర్యలు తీసుకుంటామని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టర్ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. కాలినడకన నడిచి రిజర్వాయర్ కింద దెబ్బ తిన్న కాలువలను, రహదారులను కట్ట పరిస్థితిని పరిశీలించారు. ఎఫ్‌డిఆర్ కింద పనుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రిజర్వాయర్ ఎత్తు పెంచితే ముంపునకు ఏఏ ప్రాంతాలు గురవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కట్ట సామర్థ్యాన్ని పెంచితే హిర్యతండా, గుడితండా, పత్య తండాలు ముంపుకు గురవుతాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు రూ. 1204 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని అన్నారు. రిజర్వాయర్‌కు 2771 ఎకరాలు అవసరం అవుతాయని, ఇప్పటి వరకు 1917 ఎకరాలు సేకరించామని అధికారులు తెలిపారు. 854 ఎకరాలకు అవార్డు పాస్ అయినప్పటికి చెల్లింపులు చేయవలసి ఉందని తెలిపారు. ఈ రిజర్వాయర్ పూర్తి అయితే గ్రావిటి ద్వారా నల్గొండ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.



కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బద్రు, ఈఈ నెహ్రునాయక్, డిఈ రాములు, ఏఈఈ భాస్కర్‌రావు, తహశీల్దార్లు నరేందర్, శ్రవణ్, సతీష్, తదితర శాఖల అధికారులు, గ్రామస్థలు తదితరులు పాల్గొన్నారు.

### నక్కలగండి తండా ఆర్‌అండ్‌ఆర్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు, నక్కలగండి తండా ఆర్‌అండ్‌ఆర్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరిశీలించారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన నక్కలగండి తండా, రిజర్వాయర్ కట్టను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినందున మిగిలిన 5 శాతం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. డిండి ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి ఊట నీటికారణంగా తమకు ఇబ్బంది కలుగుతుందని, తమకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ భద్రు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, డిఈ చక్రపాణి, పవన్ పాల్గొన్నారు.

# పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** పదో తరగతి చదివే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతం పెంచాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయన శనివారం మోటకొండూరు మండలం లోని ముత్తి రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజు స్కూల్ వచ్చేలా చూడాలని, స్కూల్ కి రాని విద్యార్థుల తల్లి దండ్రులకు ఫోన్ చేసి పిల్లలను పిలిపించాలని సూచించారు. పదవ తరగతి చెప్పే టీచర్స్ కి వార్షిక పరీక్షల వరకు అత్యవసరమైతే తప్ప సెలవులు ఇవ్వొద్దని హెడ్మాస్టర్ ను ఆదేశించారు. విద్యార్థులకు పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం మేణు ప్రకారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. విద్యార్థులకి ఇచ్చే ఆహారంలో సరిపడా పప్పు లేదు,కూరగాయలు కూడా ఎక్కువగా లేవు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతిరోజు విద్యార్థులకి మెనూ ప్రకారం ఇవ్వాల్సిన ఆహారాన్ని ఇవ్వాలనిఆదేశించారు. స్కూల్లో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆట ఆడారు. జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో బాలురు, బాలికల టీమ్ లు 1,2 పతకాలు సాధించిన విషయం తెలుసుకుని వారినిఅభినందించారు. క్రీడలలో మాదిరిగా చదువులో కూడా సత్తా చాటాలని సూచించారు.




**మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు సార్...** మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు అని కలెక్టర్‌ని ధైర్యంగా కీర్తి కుమార్ అనే విద్యార్థి అడుగగా కలెక్టర్ వెంటనే ఎంపీడీఓతో మాట్లాడి విచారించగా వాళ్లకు స్థలం లేదని ఎల్2 లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని కలెక్టర్‌కు తెలిపారు. అయితే విద్యార్థి ధైర్యాన్ని మెచ్చుకొని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గపార్, ఉపాధ్యాయ బృందం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ గెలుపు బిఆర్ఎస్, బిజెపిలకు చెంపపెట్టు

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుతో బిఆర్ఎస్, బిజెపిలకు చెంపపెట్టు అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన గాదంగి సుజాత, శ్రావణి, ఉమారాణి, మామిడి విజయ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలంలో వీరి కుటుంబాలు నీట మునిగిన పరిస్థితిని తాను స్వయంగా చూసి చలించిపోయానన్నారు. పత్రికల ద్వారా వచ్చిన సమాచారాన్ని చూసి వెంటనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేషుకమార్, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగటి రవి, రేగటి వెంకటేష్, దాసరి శ్రీను పాల్గొన్నారు.



## అప్పులు తీర్చే మార్గం లేక.. పురుగుల మందు తాగి పత్తి రైతుఆత్మహత్య



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** పత్తి సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్కట్ పల్లిలో చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం చండూర్ మండలం పుల్లెంలకు చెందిన మందడి సుఖేందర్ రెడ్డి బతుకు దెరువు కోసం కొన్నేళ్ల క్రితం నార్కట్ పల్లికి గ్రామీణ వైద్యం చేస్తూ పుల్లెంలలో తనకున్న ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేశాడు.ఇటీవల అకాల వర్షాలతో పంట మొత్తం నష్ట పోయింది. దీంతో వరుస రెండేళ్లుగా పత్తి పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక గురువారం క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. మృతుడుకి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. వీరిలో ఓ కొడుకు అంగ వైకల్యంతో ఇబ్బంది పడుతున్నాడు.లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర సెకరణ చేశారు.ఈ సందర్భంగా క్లబ్ మెంబర్స్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన జీవితం గడిపి న వీరి మరణానంతరం వీరి నేత్రం దానం చేసి కర్నియ అందత్వంతో బాధపడుతున్న ఇద్దరి నుండి నాల్గురి కి కంటి చూపు ను ప్రసాదించి ఆదర్శముగా నిలిచారాని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులు కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నేత్ర దానం సర్టిఫికెట్ ను అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల వైఫల్యం



**ప్రజాపక్షం/చండూర్/గట్టుప్పల :** సిపిఐ శాతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ నవంబర్ 15 నుండి21 వరకు గద్వాల నుండి ప్రారంభమై కొత్తగూడెం వరకు నిర్వహించే సిపిఐ ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం గట్టుప్పల మండల సిపిఐకౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ స్వాతంత్ర అనంతరం తెలంగాణలో నిజాం నిరంకుశ పాలన అంతం అందించడంలో సిపిఐ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిందని గుర్తు చేశారు. దేశంలో ప్రజల హక్కుల కోసం ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐ దని కొనియాడారు. పాలకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రతి రైతు ఎకరాకి 50వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,కార్యవర్గ సభ్యులు రాపోలు, సత్తయ్య,ధనంజయ, లక్ష్మయ్య ,కారింగు శ్రీను, ముత్యం ధర్మయ్య ,యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాలు నూతన సృష్టికర్తకు కార్యరూపం దాల్చాలి


### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఉన్నత లక్ష్యాలతో స్పష్టమైన కార్యాచరణతో అందుకునే అక్షర యజ్ఞంగా విశ్వవిద్యాలయాలు వేదికగా మారాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మండలం పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎంజీయూలో నెలకొన్న విద్యార్థుల సమస్యలు, సదుపాయాలు,ఉన్నత విద్య స్థితిగతులపై విద్యార్థులతో మాట్లాడారు.విద్యార్థులు ప్రస్తావించిన హాస్టల్ సదుపాయాలు లైబ్రరీ,సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు విధానం వంటి అంశాలపై చర్చించి అనంతరం విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ముందుగా విద్యార్థులతో హాస్టల్ మెస్‌లో భోజనం చేసిన అనంతరం, విశ్వవిద్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులతో ముచ్చటించారు. విశ్వవిద్యాలయ కేంద్రంగా ఫలవంతమైన కొత్త తరం రూపొందాలని,విద్యార్థులు జ్ఞానం,సమగ్రత తో మెరుగైన సమాజంపై కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్,మత్తు పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉంటూ సామాజిక అంశాలపై జనావళికి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి,ఎం జి యు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రూట్ మార్చిన రియల్టర్లు...!

**ప్లాట్లు అమ్ముడుపోక లక్కీ డ్రాకు తెర...**
**ఆకర్షణీయమైన ఆఫర్లతో సామాన్యులకు ఎర...**
**వీరు చేసే వ్యాపారమంతా చట్టానికి లోబడేనా...?**




**ప్రజాపక్షం/సూర్యాపేట :** రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుదేల్ కావడంతో రియాల్టర్లు తమ రూట్‌ను మార్చారు. తమ ప్లాట్లు అమ్ముడు పోకపోవడంతో బంపర్ ఆఫర్ లక్కీ డ్రాలను తెరమీదికి తెచ్చారు. 'రూ.1,000 కొట్టు ప్లాట్ పట్టు'... అంటూ మరికొన్ని ఆకర్షణీయమైన ఆఫర్లను పొందుపర్చి రంగు రంగుల బ్రోచర్లను ప్రింట్ చేసి సోషల్ మీడియా వేదిక ద్వారా జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. దీంతో గజం జాగను కొనుగోలు చేసే స్తోమత లేని అనేక మంది నిరుపేదలు వారి ఆఫర్లకు ఆకర్షితులై తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు. ఈ రియాల్టర్లు చేసే వ్యాపారం అంతా చట్టబద్ధతేనా, మోసాలు ఏమైనా ఉన్నాయా అని కూడా చూడకుండా వారికి డబ్బులు చెల్లిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఈ నయా దందాపై దృష్టిసారించిన దాఖలాలు లేవు.

నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతంలో ఇటీవల ఓ వ్యక్తి తన ఇల్లు అమ్మకానికి పెట్టగా అది ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో తన అవసరాలరిత్యా దానిని అమ్ముకునేందుకు లక్కీ డ్రాను ఎంచుకున్నాడు. రూ.1,000 కొట్టు ప్లాట్ పట్టు అంటూ రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి అందులో మరికొన్ని ఆకర్షణీయమైన ఆఫర్లను కూడా పొందుపర్చాడు. దీంతో పెద్దఎత్తున స్పందన వచ్చింది. తాను అమ్మాలనుకున్న ధర కన్నా రెట్టింపు వచ్చింది. ఇదే తరహాలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలువురు రియల్ఎస్టేట్ వ్యాపారులు తమ ప్లాట్ల అమ్మకానికి "బంపర్ ఆఫర్ లక్కీ డ్రా" అంటూ రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి సోషల్‌మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం కొంతమంది 200 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ లక్కీ డ్రా ద్వారా అమ్మకానికి పెట్టారు. వారు ముద్రించిన రంగుల బ్రోచర్‌లో ప్లాట్ కొలతలు, ఏరియాను పొందుపర్చడంతో పాటు మొదటి బహుమతి ఓపెన్ ప్లాట్, రెండవ బహుమతి ఐదు తులాల బంగారం, మూడవ బహుమతి 2.5గ్రాముల బంగారం, నాల్గవ బహుమతి 100 గ్రాముల వెండి డ్రాలో గెలుపొందిన వారికి ఇస్తామంటూ ప్రకటించారు. వివరాల కోసం వారి ఫోన్ నంబర్లు, డబ్బులు చెల్లించాల్సిన ఫోన్ పే, గూగల్ పేల నంబర్లను, లక్కీ డ్రా తేదీలను కూడా అందులో పొందుపర్చారు. ఈ రంగుల బ్రోచర్‌ను చూసిన అనేక మంది పేదలు లక్కీ డ్రాకు చెల్లించేది రూ.1,000లు కదా! వస్తే ప్లాట్ వస్తది... పోతే రూ. 1,000 పోతాయంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎగబడుతున్నారు. అసలు ఆ ప్లాటు ఉందా లేదా.. ఉంటే అది దానికి సంబంధించిన పత్రాలన్ని సరిగ్గా ఉన్నాయా...? మార్కెట్ విలువ ఎంత ఉంటుంది అనేది కూడా చూడకుండా గుడ్డిగా వారికి డబ్బులు చెల్లిస్తున్న పరిస్థితి. రియాల్టర్లు లక్కీ డ్రాల ద్వారా చేస్తున్న ప్లాట్ల వ్యాపారమంతా చట్టానికి లోబడే ఉందా... లేక చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారా అన్నదానిపై కూడా ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది. లక్కీ డ్రాలో ఎంతమంది పాల్గొంటారు... వారికి ఎంత ఆదాయం వస్తుంది అనే దానిలో స్పష్టత లేకపోవడంపై పలు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు రియాల్టర్లు ఈ లక్కీ డ్రాలకు తెరలేపి వివిధ కారణాల చేత అమ్ముడు పోని ప్లాట్లను వారికి అంటకట్టి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇదే తరహాలో నిజామాబాద్ జిల్లాలో భీంగల్‌లో లక్కీ డ్రా ద్వారా ప్లాట్లు అమ్మకాలకు పెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనితో అక్కడి పోలీసు అధికారులు ఇలాంటి లక్కీ డ్రా ప్లాట్ల అమ్మకాలపై దృష్టి సారించి ఈ తరహా వ్యాపారాలకు ప్రజలు మోసపోవద్దని, అవి చట్టబద్ధత కాదని అవగాహన కల్పించారు. సూర్యాపేట పోలీసులు కూడా ఈ లక్కీ డ్రాల వ్యవహారాలపై దృష్టి సారించి నిరుపేద ప్రజలు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం...

**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** మండలంలోని నుండి ఖమ్మం వెళ్లే జాతీయ రహదారిపై పిల్లలమర్రి శివారులో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. అటుగా వెళ్తున్న వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్‌లతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం యొక్క సమాచారాన్ని తెలుసుకోవడానికి స్పెషల్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలను సేకరించారు. వ్యక్తిని హత్య చేసిన తరువాత ఒంటిపై యాసిడ్ పోసి కాల్చినట్లుగా ఉంది. ప్లాస్టిక్ బస్తాలో మృతదేహాన్ని తీసుకవచ్చి అక్కడ వదిలినట్లు స్పష్టమవుతుంది. మృతుని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని రూరల్ సిఐ రాజశేఖర్ తెలిపారు. ఈ వ్యక్తి సమాచారం తెలిసిన వారు సెల్ నంబర్ 8712686006 కు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## మీడియా అకాడమీలో నేడు జాతీయ పత్రికా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ పాల్గొంటున్నారు. ప్రముఖ సంపాదకులు దేవులపల్లి అమర్, అదే విధంగా పుర ప్రముఖులు, వర్కింగ్ జర్నలిస్టులు హాజరవుతారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పనిచేయడం ప్రారంభించిన రోజునే నేషనల్ ప్రెస్ డేగా జరుపుకుంటాము. 1956లో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటును చేస్తూ, జర్నలిజంలో వృత్తిపరమైన నీతిని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గంగా పరిగణించబడింది. ఈ కార్యక్రమానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నందున అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మీడియా అకాడమీ కార్యదర్శి ఒక ప్రకటనలో కోరారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సే) శాఖ
ఫారం-VI
(సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 19- సెక్షన్ 11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)
ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: 2279/2025 తేదీ: 13.11.2025
RDO ఫైలు సంఖ్య. సి/1958/2025 తేదీ: 12.11.2025
గెజిట్ సంఖ్య: 59/2025 తేదీ: 13.11.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్-I, సూర్యాపేట, గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు లో ఉన్న భూమిలోని సర్వే నెం. 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255 & 259లో మొత్తం భూమి **ఎ.9.34 ¼ గుంటల** భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట నిర్మాణము కొరకు, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందేహక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.
కావున మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు పరిధిలో ఉన్న సర్వే నెం 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255& 259 లో మొత్తం భూమి **ఎ.9.34 ¼ గుంటల** భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage -II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట. నిర్మాణము కొరకు అవసరమైనదిగా ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము : బుర్కచర్ల మండలం : మోతే జిల్లా : సూర్యాపేట

షెడ్యూల్

| క్ర.సం. | సర్వే నెంబర్ | యాజమాన్యపు రకము | భూమి రకము | సేకరించబడు భూమి విస్తీర్ణం ఎ/గుం | పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 142 | పట్టా | మెట్ట | 0.01 | రోడ్డు | 114 | 114 | గ్రామ సరిహద్దు | 132 | |
| | | | | 0.02 1/2 | భూక్యా సురేందర్ తండ్రి దరియాబ్ (ప & అ) | | | | | |
| 2 | 122 | పట్టా | మెట్ట | 0.23 | గార్లపాటి సునిత భర్త వెంకటరెడ్డి (ప & అ) | 122 | 122 | 128 | 193 | |
| | | | | 0.05 | బానోతు మంగత్య @ మంగ్యా తండ్రి వెంకటరాం (ప & అ) | | | | | |
| 3 | 128 | పట్టా | మెట్ట | 0.11 1/2 | గార్లపాటి సునీత భర్త వెంకటరెడ్డి (అ)<br>బానోత్ మంగ్యా తండ్రి వెంకట్ రాం (ప)<br>సలికంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (ప)<br>ములుకూరి సురేందర్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప)<br>గార్లపాటి వెంకట రెడ్డి తండ్రి లచ్చిరెడ్డి (ప) | 128 | 128 | 129 | 122 | |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.03 1/2 | ములుకూరి ఉష భర్త సురేందర్ రెడ్డి (అ)<br>సలిగంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (అ) | 129 | 129 | 131 | 128 | |
| | | | | 0.13 | ములుకూరి మధుసూదన్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప) | | | | | |
| 5 | 131 | పట్టా | మెట్ట | 0.01 1/2 | డొంక | 131 | 131 | 132 | 129 | |
| | | | | 0.11 | భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ) | | | | | |
| | | | | 0.12 1/2 | భూక్యా మహేందర్ తండ్రి వాల్య (ప& అ) | | | | | |
| | | | | 0.12 1/2 | భూక్యా సురేష్ తండ్రి బాలు (ప & అ) | | | | | |
| | | | | 0.07 1/2 | భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ) | | | | | |
| 6 | 132 | పట్టా | మెట్ట | 0.09 1/2 | ధారవత్ లింగా తండ్రి బాన్య (ప & అ) | 132 | 132 | 114 | 131 | |
| | | | | 0.02 1/2 | భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.00 1/2 | భూక్య మహేందర్ తండ్రి వాల్య(ప & అ) | | | | | |
| | | | | 0.09 1/2 | ధారవత్ చాంప్లా తండ్రి బాన్య(అ)<br>భూక్య కవిత తండ్రి మహేందర్ (ప)<br>భూక్య స్వామి తండ్రి వుమ్లా (ప)<br>ధరవత్ నగేష్ తండ్రి బిక్షం (ప)<br>భూక్య చిరంజీవి తండ్రి స్వామి (ప)<br>భూక్య లింగా తండ్రి స్వామి (ప)<br>భూక్య రాంజీ తండ్రి స్వామి(ప) | | | | | |
| 7 | 142 | పట్టా | ప్రభుత్వ భూమి | 0.02 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ)<br>నిమ్మరబోయిన మల్లయ్య తండ్రి రాములు (ప)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి రాములు (ప)<br>బానోత్ రఘు తండ్రి లింగా (ప)<br>మేకరబోయిన శివమ్మ భర్తవెంకన్న (ప)<br>నిమ్మరబోయిన సతీష్ తండ్రి కనకయ్య(ప)<br>నిమ్మరబోయిన పిచ్చయ్య తండ్రి ముత్తయ్య (ప)<br>బానోతు రాము తండ్రి లింగా (ప)<br>భూక్య బాలు తండ్రి సూర్య (ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి సత్యం (ప)<br>నిమ్మరబోయినమల్లికాంబ భర్తవెంకన్న (ప)<br>షేక్ ఖాశిం తండ్రి పీరుసాబ్ (ప)<br>జెట్టి లక్ష్మ య్య తండ్రి వీరాస్వామి (ప)<br>షేక్ జానీ బాబు తండ్రి షర్ఫుద్దీన్(ప)<br>భూక్య రమేశ్ తండ్రి గోల్య (ప)<br>నిమ్మరబోయిన గురవయ్య తండ్రిరామయ్య (ప)<br>భూక్య పొట్టి తండ్రి శంకర్ (ప)<br>భూక్య మహేందర్ తండ్రి వాల్య(ప)<br>భూక్య హము తండ్రి సకు రాం (ప)<br>షేక్ యాకూబ్ పాషా తండ్రి మౌలనా (ప)<br>షేక్ ష బ్బీర్ తండ్రి మౌలనా(ప)<br>నిమ్మరబోయిన ఉప్పలయ్య తండ్రి లచ్చయ్య (ప)<br>నాగిరెడ్డి కోటమ్మ భర్త నారాయణ రెడ్డి(ప)<br>నాగిరెడ్డి హేమలత భర్త వెంకట రెడ్డి(ప)<br>నిమ్మరబోయిన సీతమ్మ భర్త గురవయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>భూక్యా నాగు తండ్రి ధర్మ (ప)<br>భూక్యా రాంజా తండ్రి గోల్య (ప)<br>గూగులోతు పండు తండ్రి బిచ్చా(ప)<br>నిమ్మరబోయిన లక్ష్మమ్మ భర్త రామయ్య (ప) | 142 | 142 | 159 | కెనాల్ | |
| 8 | 157 | పట్టా | మెట్ట | 0.05 | నిమ్మరబోయిన గంగయ్య తండ్రి యల్లయ్య (ప&అ) | 157 | 157 | 176 | 161 | |
| | | | | 0.05 | నిమ్మరబోయిన బిక్షం తండ్రి వీరయ్య (అ&ప) | | | | | |
| | | | | 0.01 | నిమ్మరబోయిన కరుణాకర్ తండ్రి వెంకన్న (అ &ప) | | | | | |
| 9 | 159 | పట్టా | మెట్ట | 0.11 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ &ప) | 159 | 159 | 160 | 142 | బోరు |
| | | | | 0.02 | చెరుకు భారతమ్మతండ్రి రోషయ్య(ప & అ) | | | | | |
| 10 | 160 | పట్టా | మెట్ట | 0.05 | చెరుకు మల్సూర్ తండ్రిజానయ్య (ప&అ) | 160 | 160 | 161 | 159 | బోరు |
| 11 | 161 | పట్టా | మెట్ట | 0.16 1/2<br>0.07 1/4<br>0.02 | కొత్తపల్లి నాగలక్ష్మి భర్త వెంకన్న (అ)<br>జెట్టి లింగయ్య తండ్రి నాగయ్య (అ)<br>చెరుకు సైదులు తండ్రి జానయ్య (అ)<br>అర్వ పల్లి చంద్రయ్య తండ్రి కాశయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>చెరుకు మల్సూర్ తండ్రి జానయ్య(ప)<br>చెరుకు వీరాస్వామి తండ్రి జానయ్య (ప)<br>కొత్తపల్లి రమేష్ తండ్రి నరసయ్య (ప)<br>నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు (ప) | 157 | 160 | 161 | 161 | బోరు<br>బోరు |
| | | | | 0.03 1/4 | నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు(ప & అ) | | | | | |
| 12 | 176 | పట్టా | మెట్ట | 0.09 1/4 | కొండ గంగమ్మ భర్త పాపయ్య (అ)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి యల్లయ్య(ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి బిక్షం (ప) | 176 | 176 | 177 | 157 | 5 - తాటి చెట్లు |
| 13 | 177 | పట్టా | మెట్ట | 0.03 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ&ప) | 177 | 176 | 180 | 176 | |
| 14 | 178 | పట్టా | మెట్ట | 0.05 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (ప & అ) | 178 | 178 | 179 | 180 | |
| 15 | 179 | పట్టా | మెట్ట | 0.06 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ) | 179 | 179 | 187 | 178 | |
| | | | | 0.02 | కొండ మాధవి భర్త అనిల్ (అ) | | | | | |
| | | | | 0.01 1/2 | బండ | | | | | |
| | | | | 0.01 1/2 | భూక్యా నాగు తండ్రి ధర్మ (అ) | | | | | |
| 16 | 180 | పట్టా | మెట్ట | 0.02 | కొండ ప్రకాష్ తండ్రి పెన్నయ్య (అ) | 180 | 180 | 179 | 177 | |
| | | | | 0.02 1/2 | కొండ లింగమ్మ భర్త వీరయ్య (అ) | | | | | |
| | | | | 0.04 | కొండ సాలమ్మ తండ్రి గోపయ్య(అ) | | | | | |
| 17 | 187 | పట్టా | మెట్ట | 0.02 | భూక్య నాగు తండ్రి ధర్మ (అ) | 187 | 179 | 188 | 179 | |
| 18 | 188 | | మెట్ట | 0.02 | ధారవత్ నాన్కు తండ్రి బాల్య(అ)<br>దర్మాసొత్తు తండ్రి భీముడు (ప) | 188 | 188 | 189 | 179 | |
| | | | | 0.12 1/2 | షేక్ యాకూబ్ తండ్రి మౌలానా (ప & అ)<br>షేక్ షబ్బీర్ తండ్రి మౌలానా (ప & అ) | | | | | బోరు |
| 19 | 189 | పట్టా | మెట్ట | 0.07 | భూక్యా మంగత్య @ మంగ్యా తండ్రి కృష్ణ (ప& అ) | 189 | 189 | 191 | 188 | |
| 20 | 191 | పట్టా | మెట్ట | 0.06 | భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (అ)<br>దేకహారాజు లక్ష్మీ వరప్రసాద్ తండ్రి వెంకటేశ్వర రావు (ప)<br>బానోత్ సురేష్ తండ్రి మంగత్య (ప) | 191 | 191 | 193 | 189 | |
| 21 | 193 | పట్టా | మెట్ట | 0.01 1/2 | వాగు | 193 | 193 | 122 | 191 | వాగు |
| | | | | 0.01 1/2 | భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.05 | భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ) | | | | | |
| | | | | 0.00 1/2 | రామసాయి నీరజ భర్త బిక్షం రెడ్డి (అ)<br>భూక్య మోతీరం తండ్రి లక్ష్మ ణ్ (ప)<br>మహమ్మద్ అబ్దుల్ హకీం కురేషీ తండ్రి రావుఫ్ కూరేషీ(ప) | | | | | |
| 22 | 245 | పట్టా | మెట్ట | 0.01 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య (ప & అ) | 245 | 245 | గ్రామ సరిహద్దు | 246 | |
| | | | | 0.07 | బొమ్మగాని రమేష్ తండ్రి సూరయ్య (అ)<br>బొమ్మగాని సత్తెమ్మ భర్త వెంకటయ్య(ప)<br>బొమ్మగాని వెంకటయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని రాంమూర్తి తండ్రి ఎల్లయ్ (ప)<br>బొమ్మగాని కొండయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని కాశయ్య తండ్రి ఎల్లయ్య (ప)<br>మండవ ఎల్లయ్య తండ్రి బుచ్చయ్య (ప)<br>బొమ్మగాని శ్రీను తండ్రి వెంకటయ్య (ప)<br>సూరబోయిన శైలజ భర్త నాగరాజు (ప)<br>జెట్టి లింగరాజు తండ్రి శ్రీను (ప)<br>బొమ్మగాని కటంరాజు తండ్రి రాంమూర్తి (ప)<br>బొమ్మగాని వెంకన్నతండ్రి రాంమూర్తి (ప) | | | | | |
| | | | | 0.07 | జెట్టి గంగయ్య తండ్రి చింతలు (అ &ప) | | | | | |
| | | | | 0.06 1/2 | పంతగి పరమేష్ తండ్రి నర్సయ్య (అ) | | | | | |
| 23 | 246 | పట్టా | మెట్ట | 0.03 | జెట్టి ఉప్పమ్మ భర్త శ్రీను (ప& అ) | 246 | 246 | 245 | 255 | |
| | | | | 0.01 | జెట్టి వీరయ్య తండ్రి చింతలు (ప & అ) | | | | | |
| | | | | 0.02 1/2 | పంతగి పరమేష్ తండ్రి నర్సయ్య (అ)<br>పంతంగి నర్సయ్య తండ్రి సాయిలు (ప) | | | | | |
| | | | | 0.00 1/2 | జెట్టి గంగయ్య తండ్రి చింతలు (ప & అ) | | | | | |
| | | | | 0.06 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య(ప & అ) | | | | | |
| | | | | 0.05 1/2 | బొమ్మగాని రమేష్ తండ్రి సూరయ్య(ప & అ) | | | | | |
| | | | | 0.18 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి యల్లయ్య (ప & అ)<br>బొమ్మగాని రమేష్ తండ్రి సూరయ్య (ప & అ) | | | | | |
| 24 | 252 | పట్టా | మెట్ట | 0.10 1/2 | ధరవత వీరన్న తండ్రి వాల్య (అ)<br>బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి (ప )<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప )<br>బండారు శ్రీనివాస్ రెడ్డి తండ్రి సామీ రెడ్డి (ప )<br>బండారు వెంకట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి (ప ) | 252 | 252 | 259 | 252 | |
| 25 | 253 | పట్టా | మెట్ట | 0.07 1/2 | వాగు | 253 | 254 | 251 | 259 | వాగు |
| 26 | 254 | పట్టా | మెట్ట | 0.13 1/2 | వాగు | 253 | 254 | 255 | 259 | వాగు |
| 27 | 255 | పట్టా | మెట్ట | 0.18 | వాగు | 255 | 255 | 246 | 254 253 | వాగు |
| 28 | 259 | పట్టా | మెట్ట | 0.10 1/2 | బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి / బాస్కర్ రెడ్డి (ప & అ) | 259 | 259 | 253 | 252 | |
| | | | | 0.05<br>0.01<br>0.002<br>0.05 | ధరావ ధరావత్ వీరన్న తండ్రి వాల్య(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప)<br>బండారు శ్రీనివాౖరెడ్డి తండ్రి సామీ రెడ్డి(ప)<br>బండారు వెంక ట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి(ప) | | | | | |
| 29 | డొంక | | | | హదీ రాస్తా | | | | | |
| | **మొత్తం : 9.34 ¼** | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (నెం. 30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు, సూర్యాపేట గార్లు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.
భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలయును.

సం/- రాజస్వ మండలాధికారి, సూర్యాపేట
సం/- అదనపు కలెక్టరు, సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టరు, సూర్యాపేట

DIPR RO NO. 828/LA/PP/Advt/Pub/2025-26


# ప్రజల హక్కుల పరిరక్షణలో సిపిఐదే కీలకపాత్ర

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/ముధోల్/నిజామాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సిపిఐ పార్టీ శత వార్షికోత్సవ బస్సు యాత్రను ముధోల్ నియోజకవర్గంలోని బాసర మండలం నుండి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ప్రజల హక్కుల సాధనలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించిందని పశ్య పద్మ స్పష్టం చేశారు. స్వతంత్ర భారతదేశం ఏర్పడటంలో సిపిఐ నాయకులు చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఆమె కొనియాడారు. ఈ బస్సు యాత్ర ద్వారా పార్టీ సిద్ధాంతాలను, ప్రజల కోసం చేసిన పోరాటాలను ప్రజలోకి తీసుకెళ్లామని ఆమె తెలిపారు. నేడు దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసే ఏకైక పార్టీ సిపిఐ అని పశ్య పద్మ గట్టిగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆమె విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి, కార్మికులు రోజుకు 8 గంటలే పని చేసే విధంగా సిపిఐ సాధించిన విజయాన్ని నేటి ప్రభుత్వం కార్మిక చట్టాలకు మార్చడం ద్వారా కాలరాసే ప్రయత్నం చేస్తోందని, కార్మికులపై మరింత పని భారం మోపుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేసి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని పశ్య పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతూ, కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు పన్నులు మినహాయింపులు వర్తింపజేసి, ప్రజాధనాన్ని వారి చేతిలో పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. సామాన్య ప్రజలకు సిపిఐ నిరంతరం అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని పశ్య పద్మ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి విలాస్, నాయకులు, పార్టీకి సంబంధించిన అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సిపిఐ త్యాగం వెలకట్టలేనిది**
**మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా**



సభలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

సిపిఐ కార్మికవర్గం కష్టజీవుల పార్టీ అని వందేళ్ల సభను విజయవంతం చేద్దామని మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల పండగ సందర్భంగా బస్సు ప్రచార జాత బాసర నుంచి ప్రారంభమై శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్సపల్లి నుంచి గాంధీ గంజ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ గంజ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. కళాజాత కళాకారులు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ ఎంపీ అజీజ్‌పాషా, పశ్య పద్మ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, డీజీ నరేంద్ర ప్రసాద్, ఉప్పలయ్య, నగర కార్యదర్శి ఓమయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తర్వాత వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది సిపిఐ మాత్రమేనన్నారు. దేశంలో ఎన్నో పార్టీలు పురుడు పోసుకున్నాయి అంతరించిపోయాయని ప్రజల సమస్యల మీద ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా పోరాటాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందినదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిపిఐ త్యాగం వెల కట్టలేనిదన్నారు. కమ్యూనిస్టు పార్టీ పుణ్యాం వల్ల 10 లక్షల ఎకరాలు భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సభకు మూడు నుంచి ఐదు లక్షల వరకు కామ్రేడ్లు హాజరు కానున్నారని, ఇతర దేశాల నుంచి 40 మంది ప్రతినిధులు రానున్నారన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ దేశాల ఆర్థిక స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని, ఎగుమతులు దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరి కాదన్నారు. డిసెంబర్ 26న చరిత్రలో నిలిచిపోయే సిపిఐ శత జయంతి ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేద్దామన్నారు. మెక్ అమెరికా బిగ్ అగైన్ అని అతిపెద్ద సంపద గల దేశంగా మార్చుకోవడంలో భాగంగా ఎగుమతులు దిగుమతులను పెంచుతూ ట్రంప్ కుట్ర చేస్తున్నారన్నారు. దేశంలో రాష్ట్రంలో కార్మిక కర్షకులు ఇబ్బందుల పాలవుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచే సిపిఐకి మద్దతు తెలుపాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేశ్వర్, రాజన్న, స్వరూప, రాణి, రఘురాం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు




### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరా గాంధీ జయంతి రోజున (నవంబర్ 19న) మహిళా శక్తి బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలను చేపడతామని, మహిళా సమాఖ్య సభ్యులకు ప్రత్యేక యూనిఫాముల చీరలు త్వరలో అందజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. 'స్వయం సహాయక బృందాల రూపంలో సగటు స్త్రీ అస్తిత్వం మరింత శక్తివంతమవుతుందని, ఎస్‌హెచ్‌జిల భాగస్వామ్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ, వారిని ప్రపంచ మార్కెట్ వైపు తీసుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షుల రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరవ్వగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలడిఆర్‌డిఒలు, అదనపు డిఆర్‌డిఒలు, అన్ని మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు హాజరయ్యారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు జరిపించాలని, ప్రతి ఆడపిల్లను చదివించడం, మహిళలపై జరిగే ఏ రకమైన హింసనైనా ఎదిరించడం, కులమత భేదాలను వదిలివేయడం, అంటరానితనాన్ని నిర్మూలించడంలో ముందుండడం లాంటి అంశాలపై మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సీతక్క ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు విస్తరిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వ సంకల్పంపై కొంతమంది ఎద్దేవా చేసినప్పటికీ, ఇప్పటికే అనేక మండల సమాఖ్యల్లో కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని, గ్రామీణ మహిళలు వ్యాపారాలను నెలకొల్పారని వివరించారు. ఆదిలాబాద్ ఆదివాసీ మహిళలు తయారు చేస్తున్న ఇప్ప పువ్వు లడ్డూలు విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందుతున్నాయని, స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలతో మహిళల్లో ధైర్యం పెరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలే సాధారణ స్త్రీకి అస్తిత్వాన్ని ఇచ్చే వేదికలన్నారు. సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమ, ఇందిరా గాంధీలా మహిళలు ధైర్యంగా నిలబడితే కొత్త చరిత్ర లికించ వచ్చన్నారు. అనంతరం డిఆర్‌డిఒ, అదనపు డిఆర్‌డిఒలతో మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్మాణాలు

### సచివాలయంలో భక్తుల క్యూలైన్ల బ్రాస్ గ్రిల్స్ నమూన పరిశీలించిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమ్మక్క–సారక్క మేడారం జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్ఘాటించారు. యావత్ ప్రపంచం ఈ జాతర కోసం ఎదురు చూస్తుందని పేర్కొన్నారు. ఈ జాతర వేదిక... ప్రపంచం నలుమూలలూ చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మేడారం విలసిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క–సారలమ్మ పోరాట గాథ, చరిత్ర విశ్వవ్యాప్తమవుతున్నదని చెప్పారు. సమ్మక్క సారక్క మేడారం జాతరలో అమ్మవారి గద్దెల చుట్టూ భక్తులు క్యూలైన్లలో సాఫీగా వెళ్ళేందుకు తయారు అవుతున్న బ్రాస్ గ్రిల్స్ నమూనాను తెలంగాణ సెక్రటేరియట్‌లో శనివారం కొండా సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులతో స్వయంగా మాట్లాడారు. గిరిపుత్రుల ఆరాధ్య దేవతల ఆశీస్సులు తీసుకునేందుకు... మొక్కులు చెల్లించుకునేందుకు... ఆ ప్రాంతాన్ని సందర్శించి తన్మయత్వం చెంది పునీతులయ్యేందుకు కోట్లలో భక్తులు, ప్రజలు జాతరకు వస్తారని, అందుకు తగిన విధంగా బ్రాస్ గ్రిల్స్ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని సూచన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మేడారంలో పెద్ద ఎత్తున శాశ్వత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణ సంబంధిత నిర్వాహకులు మంత్రి సురేఖకి గ్రిల్స్ చూపించేందుకు బ్రాస్ గ్రిల్స్‌ను స్వయంగా సచివాలయానికి తీసుకొచ్చామని అక్కడే ఎదురైన మీడియా ప్రతినిధులకు చెప్పారు. దాదాపు రెండు వందల ఏండ్ల పాటు మన్నికగా ఉండే ఉద్దేశంతో ఈ గ్రిల్స్‌ను పటిష్టంగా తయారు చేయించినట్టు చెప్పారు. వీటిని సమ్మక్క సారక్క, జంపన్న గద్దెల చుట్టూ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వెళుతుందని, ఈ నేపథ్యంలో మేడారం జాతరలో భక్తుల రద్దీ నిర్వహణను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు మూడు నెలల ముందు నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారిని అభినందించారు.

# పార్టీని భ్రష్టు పట్టించింది హరీష్, కెటిఆర్‌లే




### తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు

**ప్రజాపక్షం/మెదక్ :** కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్‌ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటిఆర్ అధోగతి పాలు చేస్తూ భ్రష్టు పట్టించారని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా వజ్రాయుధంలా జాగృతి సంస్థ పనిచేస్తుందని అన్నారు. మెదక్ జిల్లా కోసం విన్నది వేరని ఇక్కడ చూస్తే వేరేలా ఉందని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని అన్నారు. కెటిఆర్ సోషల్ మీడియాలోనే పోరాటం చేస్తున్నారని సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రజల్లోకి రావాలని ఎమ్మెల్సీ కవిత సలహా ఇచ్చారు. మెదక్ జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కవిత పర్యటన రెండవ రోజు శనివారం సాగింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్‌ను అధోగతి పాలు చేశారన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలు రాష్ట్రంలో ప్రతిపక్షం బలంగా లేదన్న విషయాన్ని గుర్తు చేసిందన్నారు. అన్న కెటిఆర్ సోషల్ మీడియాలోనే ప్రజల సమస్యలు తీసుకు వస్తున్నాడని, సోషల్ మీడియాను వీడి ప్రజల్లోకి వచ్చి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. హరీష్‌రావు పార్టీని మోసం చేయడం మానుకోవాలన్నారు. ఒక సభ సక్సెస్ అయితే కేసీఆర్‌ని మోసినట్లు ఫీల్ అవుతున్నారని, ఆయన ముందు వీరంతా బచ్చాలు అని పేర్కొన్నారు. హరీష్ రావు అవినీతిని బయటపెట్టిన సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెడ్డిపల్లి, చిప్పలదుర్తి, తునికి గ్రామాల మధ్య హరీష్ రావుకు 400 ఎకరాల భూమి ఉందన్నారు. ఆయన భూమి కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారని విమర్శించారు. ఆ ప్రాంతంలో రిసార్ట్ నిర్మాణం చేసి ప్రజలను రానివ్వడం లేదన్నారు. చిన్న చింతకుంటలో గంగుల కమలాకర్‌కు 15 ఎకరాలు, నవీన్‌రావుకు 18 ఎకరాలు భూమి ఉండడం అలైన్‌మెంట్ మార్చారని రైతులు చెబుతున్నారని, నిజామా కాదా నేతలే చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి హాస్టల్ అద్దె రూ.లక్షా 6 వేలు తీసుకుంటున్నాడని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటివి కేసీఆర్‌కు తెలిసి ఉండవని, తెలిస్తే ఆయన ఒప్పుకునే వారు కాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం పరిధిలోని, అశ్వారావుపేట మున్సిపాలిటీ, అశ్వారావుపేట (గ్రామం & మండలం), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గల **దొంతి కుంట చెరువును మిని ట్యాంక్ బండ్** చేయు పనులకు సంబంధించిన టెండర్ నోటీస్ నెంబర్: 11/2025-26, తేదీ: 11.11.2025లో అంచనా మొత్తం **రూ.3,76,21,677/-** టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు **17.11.2025, 3.00PM నుండి 01.12.2025, 3.00PM** వరకు లభించును. **గమనిక:** మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం
DIPR R.O. No. : 10746-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
చందానగర్ సర్కిల్-21, శేరిలింగంపల్లి జోన్.
క్ర.సం.1, **NIT No.** 21/SLPZ/GHMC/2025-26, తేది: 13.11.2025. **పని పేరు:** ఎఫ్ఒబిల నిర్వహణ, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 14.11.2025న మ.2.00గం.ల నుండి 17.11.2025న మ.2.00గం.ల వరకు, **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీమతి ఆర్.ఇందిరాబాయి, ఇఇ, డివిజన్-21, ఎస్ఎల్‌పి జోన్. **ఫోన్ నం.** 040-23033163. మరిన్ని టెండర్ వివరాలకు వెబ్‌సైట్ www.ghmc.gov.in ను చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10762-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025


తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
ఇ-టెండర్ నోటీసు
2025-26 సంవత్సరానికి (1) పని కోసం సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్‌లో గుమ్మడిదల సెక్షన్‌లోని బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. అనగా టెండర్ ఐడి: 643539 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఫైల్ నెం. 861976/S6/2025, తేదీ.14.11.2025తో ప్రచురించబడినది. పని వివరాలను @www.tender.telangana.gov.in కు లాగిన్ అయి చూడవచ్చు.

| క్ర.సం. | పని పేరు | అంచనా వేసిన మొత్తం రూ. |
|---|---|---|
| 1. | సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల సెక్షన్, బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. | రూ. 7,90,000/- |
| 2. | టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ సమర్పణ | 17.11.2025 @ 10:30 AM నుండి 03.12.2025 @ 3:00 PM |
| 3. | సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 3.50 PM |
| 4. | ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 4.30 PM |

**కార్యాలయ చిరునామా:** జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి, మల్కాపూర్ X రోడ్ దగ్గర, రాంచంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి - 502001 (సంప్రదింపు నంబర్ 9440810118).
సం/- జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి.
DIPR R.O. No. : 10702-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025




## శక్తివంతమైన సౌర విస్ఫోటనం



సూర్యుడు గతంలో ఎన్నడూ లేని రీతిలో విడుదల చేసిన అత్యంత శక్తివంతమైన సౌర విస్ఫోటనం ఈనెల 11న జరిగింది. దీని ప్రభావంతో, ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఆకాశంలో అద్భుత కాంతి పుంజాలు కనిపించాయి. సూర్యునిపై ఉన్న ఎఆర్4274 అనే సన్‌స్పాట్ నుంచి భారీ స్థాయిలో ఎక్స్ 5.1 తరగతి సౌర ఫ్లేర్ విస్ఫోటనం సంభవించింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' సోలార్ అబ్జర్వేటరీ, ఎన్ఒఎఎ నిర్వహిస్తున్న స్పేస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వంటి పరిశీలనా కేంద్రాలు ఈ సౌర విస్ఫోటనాన్ని గుర్తించాయి. ఇది భారీ స్థాయిలో ఎక్స్ కిరణాలను, అల్ట్రావయొలెట్ కాంతి వికిరణాలను విడుదల చేసింది. ఈ అధిక శక్తి గల కణాలు యూరప్, ఆఫ్రికా ప్రాంతాల్లో ఆర్3 స్థాయి రేడియో బ్లాక్‌అవుట్లకు కారణమయ్యాయి. దీని ఫలితంగా సూర్యుని వైపు ఉన్న భూమి భాగంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. అక్కడితో ఆగకుండా, ఈ విస్ఫోటనం తర్వాత వరుసగా మూడు శక్తివంతమైన కరోనా మాస్ ఎజెక్షన్లు (సిఎంఇ) సూర్యుని నుండి భూమివైపు దూసుకువచ్చాయి. ఎన్ఒఎఎ అంచనా ప్రకారం, వీటిలో మూడవ సిఎంఇ అత్యంత వేగవంతమైనది. అమితమైన శక్తివంతమైనది. ఈ సంఘటన ప్రత్యేకత దాని పరిమాణంలోనే కాదు, సమయానికీ ఉంది. ఇది సౌర చక్రం తన అత్యుత్తమ దశ అయిన 'సోలార్ మాక్సిమమ్'కు చేరడాన్ని సూచిస్తున్నది. కాగా, సూర్యుడు విడుదల చేసే ఇలాంటి శక్తి ఏ విధంగా భూగోళాన్ని ప్రభావితం చేస్తుందనే విషయంపై శాస్త్రవేత్తలు పరిశోధలు చేస్తున్నారు.

## ఆదర్శ దంపతులు..



విడాకుల కేసులు విపరీతంగా పెరుగుతున్న నేటి కాలంలో ఫ్లోరిడాలోని మియామీ (అమెరికా)కి చెందిన లైల్, ఎలెనార్ గిట్టెన్స్‌లను ఆదర్శ దంపతులుగా పేర్కోవాలి. లైల్ వయసు 108 సంవత్సరాలుకాగా, భార్య ఎలెనార్ అతని కంటే ఒక ఏడాది చిన్నది. ఈ ఏడాది జూన్‌లో వీరిద్దరూ తమ 83వ



వివాహ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ జంటగా గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించారు. సుదీర్ఘమైన వారి దాంపత్య జీవితంలో ఆటుపోట్లు ఎదురుకాలేదనిగానీ, వాగ్వాదాలు జరగలేదనిగానీ, మనస్ఫర్థలు రాలేదనిగానీ చెప్పలేం. కానీ, సరైన అవగాహన, పరస్పరం ప్రేమానురాగాలు ఉంటే, సమస్యలను అధిగమించడం కష్టం కాదని ఈ దంపతులు నిరూపిస్తున్నారు. విడాకుల కేసులు అధికంగా నమోదయ్యే అమెరికాలో 83 సంవత్సరాల వైవాహిక సంబంధం ఒక అద్భుతం. అందుకే, లైల్, ఎలెనార్ ఆదర్శదంపతులయ్యారు.

## ఇథియోపియాలో 'హైనా మ్యాన్'



ఒక ఆలోచన సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడమేకాదు... సంప్రదాయంగా కూడా మారుతుంది. ఇథియోపియాకు చెందిన యూసుఫ్ ముమే సల్లే అనే వ్యక్తిని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'హైనా మ్యాన్'గా ప్రసిద్ధి చెందిన యూసుఫ్ 1960 దశకాల్లో తన ఊరు హరార్‌లోని పశువులపై హైనాలు దాడి చేయడాన్ని గమనించాడు. వాటిని ఎదుర్కోవడం అసాధ్యమని గ్రహించాడు. పశువులను నష్టపోకుండా ఉండాలంటే, హైనాలను మచ్చిక చేసుకోవడం ఒకటే మార్గమని నమ్మాడు. అప్పటినుంచి హైనాలకు ఆహారం పెట్టడం మొదలు పెట్టాడు. తర్వాతి కాలంలో ఇది ఒక సంప్రదాయంగా మారింది. అతని కుమారుడు అబ్బాస్ యూసుఫ్ కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నాడు. హైనా దాడుల నుండి పశువులను కాపాడేందుకు, ఊరి పొలిమేరల్లో మిగులు మాంసాన్ని, చర్మాన్ని ఉంచుతారు. దీనితో హైనాలు ఊరులోకి రాకుండా ఆ ప్రాంతానికి దూరంగా ఉంటాయి. హైనాలకు ఆహారం సమర్పించడం అక్కడ ఒక నమ్మకంగా మారింది. హైనాలు కూడా ఊరిమీద పడకుండా, ఆహారం కోసం ఓర్పుతో వేచి చూస్తాయి. హైనాలతో మనుషులకు సఖ్యత ఉండేదని జానపద కథల్లో మాత్రమే ఉంటుందనుకునే వారికి యూసుఫ్ ప్రవేశపెట్టిన విధానమే సమాధానమిస్తుంది. హైనాలు అతనితో చాలా సన్నిహితంగా ఉండేవి.

## మంచు ఫలకాల కింద అగ్నిపర్వతాలు!



అంటార్కిటికా మంచు ఫలకాల కింద అగ్నిపర్వతాలు ఉన్నాయి. అవి కూడా రెండో, మూడో కాదు. 138కి పైగా అగ్నిపర్వతాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అంటార్కిటికా ఆగ్నేయ ప్రాంతంలోని 'వెస్ట్ ఆంటార్కిటిక్ ఐస్ షీట్' కింద పలు అగ్ని పర్వతాలను ఎడన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మంచు పరిశోధక రాడార్లు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా, మంచి ఫలకాల కింద సుమారు నాలుగు కిలోమీటర్ల మందమైన మంచు కింద 91 అగ్ని పర్వతాలను గుర్తించారు. ఈ పర్వతాలు 3,800 మీటర్లకు పైగా ఉన్నవిగా ఉన్నట్లు తెలుసుకున్నారు. అంటే ఇవి యూరప్ లోని ఆల్ప్స్ పర్వతాలకు పోటీ ఇచ్చే స్థాయిలో ఉన్నాయి. కాగా, వెస్ట్ ఆంటార్కిటిక్ రిఫ్ట్ సిస్టంమ్‌లోని టెక్టానిక్ బెల్ట్‌లోనూ ఈ అగ్నిపర్వతాలు వ్యాపించి ఉన్నాయి. ప్రస్తుతానికి అవి నిశ్చలంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ తదితర కారణాల వల్ల అంటార్కిటికాలో మంచు వేగంగా కరుగుతున్నది. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే, మంచు ఫలకాల కింద ఉన్న మంచు పర్వతాలు విస్ఫోటనం చెందే ప్రమాదం లేకపోలేదు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మహాగట్బంధన్‌కు గుణపాఠాలు

శుక్రవారం వెలువడిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎన్‌డిఎ అభిమానుల ఊహలను, ఎగ్జిట్ పోల్స్ జోస్యాలను తలదన్నుతూ చేస్తూ పాలక ఎన్‌డిఎకి ఏకపక్షంగా ఉండటం ఆశ్చర్యకరం. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో (ఎస్ఐఆర్) ఎస్‌సి, ఎస్‌టి, దళిత, మైనారిటీ ఓట్ల తొలగింపుకు బిజెపికి సహకరించిందని ఎన్నికల కమిషన్ తీవ్రమైన ఆరోపణలకు గురైన నేపథ్యంలో పాలక ఎన్‌డిఎ కూటమి 202 సీట్లతో ఘన విజయం సాధించటం ప్రతిపక్షాల సంశయాలకు బలం చేకూర్చుతుంది. ఎన్నికల కమిషన్ తొలుత 65లక్షల ఓట్లు తొలగించింది. ఒకవైపు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం, రాహుల్‌గాంధి 'ఓట్ అధికార్ యాత్ర' నేపథ్యంలో ప్రచురించిన ముసాయిదా జాబితాలో ఆ తొలగింపు 47లక్షలకు తగ్గింది. ఇలాంటి గందరగోళాలు చివరిదాకా ఉన్నాయి. ఓటర్ల జాబితాలు పూర్తిగా సవ్యంగా ఉండటం, ఎన్నికల కమిషన్ లేదా స్థానిక ఎన్నికల అధికారులు పాలక పార్టీకి ఎంతో కొంత అనుకూలంగా వ్యవహరించటం మన ఎన్నికల వ్యవస్థలో కొత్తేమీకాదు. ఎన్నికల కమిషన్ సహకారంవల్లనే ఎన్‌డిఎకి ఈ అనూహ్య ఫలితాలు లభించాయని నిందించలేనంతగా ప్రజలు దిగ్భ్రాంతిగొలిపే తీర్పు ఇచ్చారు. మహాగట్బంధన్‌కు మరీ దారుణమైన ఫలితాలు వచ్చాయి. అధికారంకోసం పోరాటం చేసిన కూటమి 35సీట్లకు పరిమితంకావటం ఊహించని దెబ్బ. కాబట్టి నామినేషన్‌ల సమయందాకా సీట్ల పంపిణీపై అంగీకారానికి రాలేకపోవటం, కొన్ని స్నేహ పోటీలు ఉండటం, ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనవసరపు జగడంతో కాలహరణం, ప్రచారంలో సమన్వయలోపం ఇత్యాది లోపాలపై కూటమి భాగస్వాముల్లో ఆత్మవిమర్శ అవసరం. ఎన్నికల కమిషన్ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తదుపరి, తొలగింపులు, మినహాయింపులు సరిగ్గా జరిగాయో లేదో ఇంటింటి వెరిఫికేషన్ చేసి అర్హుల దరఖాస్తులు సమర్పించని బలహీనత గట్బంధన్ సంస్థాగత నిర్మాణ రాహిత్యానికి అద్దం పడుతున్నది. కేవలం కుల పొందికల కూర్పు, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం, తమ అనుకూల గాలి సృష్టించటం ద్వారానే బలమైన ప్రత్యర్థిని ఓడించగలమని భావించినట్లున్నారు. అది బెడిసికొట్టింది. మొత్తం మీద పోలైన ఓట్ల శాతం సరికొత్త శిఖరాన్ని చేరింది. మహిళల ఓట్ల పోలింగ్ పురుషులను అధిగమించి 70శాతం దాటింది. కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. అంతిమంగా ఇరు పక్షాల మధ్య ఓటింగ్ వ్యత్యాసం గత ఎన్నికల్లోని అతి తక్కువ స్థాయినుంచి గరిష్టంగా 9.2శాతానికి చేరింది. ఎందుకిలా జరిగిందో ఆత్మవిమర్శనా పూర్వక విశ్లేషణ అవసరం.

ప్రజాపక్షం 16-11-2025, ఆదివారం

మహిళలు, యువత ఎన్‌డిఎ తిరుగులేని విజయానికి కారణంగా స్పష్టమైంది. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ 20ఏళ్లపాలన సహజమైన ప్రభుత్వ వ్యతిరేకతకు బదులు సానుకూలత సృష్టించింది. దానికి ప్రధాని నరేంద్రమోదీ హిందుత్వ ఇమేజి, అభివృద్ధి ఎజండా, గతంలోని లాలు ప్రసాద్ పదేళ్ల పాలనను 'ఆటవిక రాజ్యం'గా ఆరోపిస్తూ ప్రజలను భయపెట్టటం, ముస్లిం వ్యతిరేకిగా అమిత్‌షా దృఢవైఖరి, కులాల కూర్పు (సామాజిక ఇంజినీరింగ్) ఇవన్నీ కుదురుకున్నాయి. ముందే సీట్లు పంచుకుని అరమరికలు లేని, ఐక్యత నిండిన కూటమిగా ఎన్‌డిఎ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

నితీశ్‌కుమార్ మహిళా అనుకూల కార్యక్రమాలు, పథకాలు, ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్‌తోపాటు ప్రధాని మోదీ రెండు నెలల ముదునుంచే పలు అభివృద్ధి పథకాలు ప్రకటించటం మహిళలు, యువకుల్లో భరోసా కల్పించింది. హిందీ బెల్టులో తమ చేతికి చిక్కని బిహార్‌పై కాషాయ జండా ఎగురవేసేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎంతో వ్యూహాత్మకంగా పనిచేశాయి. ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ, నితీశ్‌కుమార్‌ను కాదనలేని స్థితిలోనే ఉండిపోయింది. 10వ పర్యాయం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకారం ఖాయమైనట్లే. వయస్సు, ఆరోగ్యంరీత్యా నితీశ్ కాషాయ జండాకు ముఖ్యమంత్రి పదవి అప్పగించాలన్న వాదన ఇప్పటికి వాయిదా పడినట్లే.

అత్యంత వెనుకబడిన తరగతులకు ఆశాజ్యోతిగా నిస్వార్థమైన పరిపాలన అందిస్తున్న నితీశ్ కుమార్ కొన్నేళ్లుగా ప్రత్యేకించి మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మద్యపాన నిషేధం విధించారు. అమలులో ఎన్ని లోపాలున్నా నిస్సంశయంగా మహిళలు స్వాగతించారు. అలాగే పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు 25 శాతం రిజర్వేషన్ ప్రవేశపెట్టారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించారు. స్కూలు బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. అన్నిటికీ మించి ఈ ఎన్నికల ప్రకటనకు కొద్దిరోజుల ముందు 'మహిళా రోజ్‌గార్ యోజన' ప్రకటించి కోటి పాతిక లక్షల మంది మహిళలకు రూ.10వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. వ్యాపారానికి ముందుకొచ్చే వారికి రూ.2లక్షలు ఇస్తామన్నారు. మహిళా గ్రూపుల సభ్యులు (జీవికలు) అలవెన్స్ పెంచారు. ఆ గ్రూపులు నితీశ్ కోసం పనిచేశాయి. మొత్తంమీద రాష్ట్రంలో పేదరికం తగ్గింది, శాంతి—భద్రతల్లో మెరుగుదల ఉంది. వీటికితోడుగా ప్రధాని మోదీ అనేక రహదారులు, రైలు, వంతెనలు ప్రారంభించారు, ప్రకటించారు. నిరుద్యోగం ప్రధాన సమస్యగా గుర్తించి 5లక్షలమంది పట్టభద్రులకు రెండేళ్లపాటు నెలకు రూ.1000 చొప్పున అలయెన్స్ పథకం ప్రకటించారు. యువతకోసం రూ.62 వేలకోట్ల పథకాలు ప్రకటించటంతోపాటు వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు వాగ్దానం చేశారు. మహిళలు—యువత కాంబినేషన్‌ను ఆకర్షించటంవల్ల ఓట్ల పోలింగ్‌లో కొత్త రికార్డు నమోదైంది. మహాగట్బంధన్ కూడా అనేక ఆకర్షణీయ పథకాలు ప్రకటించినా విశ్వసనీయత నితీశ్—మోదీ పైనే ఉండటం వల్ల ఎన్‌డిఓఎకు ఘనవిజయం చేకూరింది. ప్రతిపక్ష కూటమి వీటన్నిటినీ కూలంకషంగా చర్చించి గుణపాఠాలు తీసుకోవాలి. వచ్చే సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అప్రమత్తతతో ఉండటం, ఐక్యతతో పనిచేయటంపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

# ప్రజల ఆశాజ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ



(కీ.శే.)నల్లమల గిరిప్రసాద్

సిపిఐ శతవార్షికోత్సవం ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో పెద్ద ర్యాలీకి రాష్ట్రంలో ప్రచారం ప్రారంభమైన సందర్భంగా పార్టీ చరిత్రను సూక్ష్మంగా తెలిపే కామ్రేడ్ గిరిప్రసాద్ ఒక నాటి వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాం. ॥సం॥

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1848లో కమ్యూనిస్టు ప్రణాళికను ప్రకటించడంతో ప్రపంచంలో కమ్యూనిస్టు ఉద్యమ శకం ప్రారంభమైంది. బూర్జువా వర్గ దోపిడీ వ్యవస్థను తుదముట్టించాలని దాని స్థానంలో కార్మిక వర్గ రాజ్యం స్థాపించాలని అందుకోసం ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని రానున్న యుగం కార్మిక, కర్షక, మధ్యతరగతి, రైతు, కూలీ, పేద, దళిత, అణగారిన మహిళా వర్గానిదేనని వెన్నుతట్టి లేపారు. 1917 వరకు అనేక దేశాలలో ముఖ్యంగా యూరప్ ఖండంలో ఉద్యమాలు పెల్లుబికినప్పటికీ అవి విజయవంతం కాలేకపోయాయి. చరిత్ర ప్రసిద్ధికెక్కిన 'పారిస్ కమ్యూన్' అది దోపిడీ వర్గ ఎదురు దాడుల నుంచి రక్షించుకోలేకపోయింది. సరిగ్గా ఆ దశలో 1917 సంవత్సరంలో వి.ఐ.లెనిన్ అత్యంత విశాలమైన రష్యా దేశంలో కమ్యూనిస్టు జెండాను ఎగురవేశాడు. ఆ కాలానికి పెట్టుబడిదారి వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకుందని, అదే దాని చరమ దశ అని, సామ్రాజ్యవాద వ్యవస్థ గొలుసులో అత్యంత బలహీనమైన దేశంలో లేక దేశాలలో కార్మిక వర్గ విప్లవాలు జయప్రదమై తీరుతాయని పరిశోధించి, పరిశీలించి సిద్ధాంతపరంగా మార్క్సిజానికి నూతన వన్నె తెచ్చాడు. మార్క్స్ ఏంగెల్స్ కాలంనాటి మార్క్సిజం, మార్క్సిజం—లెనినిజంగా రూపాంతరం చెందింది. జార్ చక్రవర్తి అంతమై బూర్జువా వర్గ రాజ్యాధికారం తొలగించబడింది. సోవియట్ రిప్లబిక్‌లతో సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. 14 సామ్రాజ్యవాద దేశాలు సోవియట్‌పై నాలుగేళ్ల పాటు అంతర్యుద్ధ జ్వాలలు లేపాయి. ఇవన్నీ ఓడింపబడినాయి. తర్వాత 20 సంవత్సరాలకు ప్రపంచ ఆధిపత్యం కోసం బయలుదేరిన హిట్లర్ ఫాసిస్టు మూకలు సోవియట్‌పై దాడి చేశాయి. ఈ రెండవ ప్రపంచ యుద్ధంలో ఎర్ర సైన్యం రెండు కోట్ల మంది రక్తతర్పణలతో ఫాసిస్టు మూకలను నిలువరించాయి. 1945 మే నెలలో బెర్లిన్ కోటపై అరుణ పతాకాన్ని ఎగుర వేశాయి. ఉత్తర కొరియా సోషలిస్టు రాజ్యంగా ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధ అనంతరం భారతదేశంతో సహా 70 దేశాలు సామ్రాజ్యవాద వలస పాలన నుండి స్వాతంత్ర్యవాయువులు పీల్చుకున్నాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం గతి నేడేమైందో మనందరికి తెలుసు.

స్వాతంత్ర్య అనంతరం అనేక దేశాలు సోషలిస్టు దేశాలుగా ఇంకా ఆ భావాలు గల దేశాలుగా ప్రయాణం చేశాయి. ఆ గమనంలో ప్రపంచంలో రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఆవిర్భవించాయి. ఒకటి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ, రెండు పెట్టుబడిదారి వ్యవస్థ. దీనిని పెట్టుబడిదారి వర్గం నుండి సోషలిస్టు దశకు మార్పు చెందే దశగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అభిప్రాయపడింది. సోషలిస్టు వ్యవస్థలో నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత కనిపించేవి కావు. శ్రమ కొలది శక్తి, అవసరం కొలది భుక్తి అనే సూత్రంతో తన కోసం, సమాజం కోసం స్వచ్ఛందంగా శ్రమించి వస్తువుల కొరత తీర్చాలని ఆ వైపు ప్రయాణం చేసింది. అయితే ఇందుకు భిన్నంగా అమెరికన్ సామ్రాజ్యవాదం కమ్యూనిజాన్ని నాశనం చేయాలని అణుబాంబులతో, నక్షత్రయుద్ధ పథకాలతో నవ నాగరికతతో విరాజిల్లుతున్న ప్రపంచాన్ని బూడిద గుట్టగా మార్చాలని ప్రయత్నం చేసింది. అయితే సోవియట్ యూనియన్ అమెరికన్ సామ్రాజ్యవాద అణుయుద్ధ నివారణకు, ప్రపంచ శాంతి పరిరక్షణకు నడుంబిగించింది. సర్వ మానవులకు సౌభాగ్యాలు చేకూర్చగల సామాజిక వ్యవస్థ కోసం అణ్వాయుధ యుద్ధ నివారణకు కమ్యూనిస్టు ఉద్యమమే శ్రీరామ రక్షగా నిలబడింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలోనే రష్యా విప్లవ విజయాలకు ప్రభావితులైన అనేక మంది విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. అలా ఏర్పడ్డ కమ్యూనిస్టు గ్రూపులపై బ్రిటిష్ వారు తీవ్ర నిర్బంధ చర్యలకు పూనుకున్నారు. వారిపై 1922 –24 సంవత్సరాలలో పెషావర్, కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు బనాయించారు. ఈ నిర్బంధ కాండను ధిక్కరించి అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై కాన్పూర్‌లో డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పార్టీ తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర కలిగినది సిపిఐ. ఈలోగా భారత రాజకీయ రంగంలో లేక స్థానికంగా అనేక



రాజకీయ పార్టీలు పుట్టినవి, గిట్టినవి ఉన్నాయి. ఇందులో కొన్ని పార్టీలకు చరిత్ర లేకపోగా భవిష్యత్తు కూడా సామాజిక, పురోగమి లక్ష్యాలు లేకుండా వ్యక్తుల ప్రయోజనాలకు సంకుచిత ఆశయాలకు ఏర్పడ్డాయి. అవి ఎంత తళుక్కున ఎగురుతాయో అంత త్వరితంగానే ముగుస్తాయి. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 సంవత్సరంలోనే సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం చేసిన తొలి రాజకీయ పార్టీ. 1927 మద్రాస్ సభలో గాని కాంగ్రెస్ ఈ తీర్మానం చేయలేదు. కాంగ్రెస్ రాజకీయాల్లో అతివాద మార్పులు తెస్తున్న కమ్యూనిస్టులను దెబ్బకొట్టాలని బ్రిటిష్ పాలకులు మీరట్ కేసు, భగత్‌సింగ్ వంటి వారిపై లాహోర్ కుట్ర కేసులు విధించారు. ఇర్విన్‌తో 1931 రౌండ్ టేండ్ సమావేశంలో భగత్‌సింగ్ ఆయన సహచరులని విడుదల చేయాలని గాంధి కోరలేదు. వారిని కనీసం ఉరి తీయవద్దని అడుగలేదు. అంతకు ముందు బ్రిటిష్ పాలకులు జలియన్‌వాలాబాగ్‌లో అనేక మంది ప్రజలను ఊచకోత కోశారు. బ్రిటిష్ పాలకుల గుండెలపై గురిచూసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆయన సహచరులను నిలువునా కాల్చిచంపారు. అందుకే గదర్ వీరులు, భగత్‌సింగ్ సహచరులు, చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి చేసిన వీరులు ఒకరేమిటి జాతీయ విప్లవకారులందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఆది నుంచి అంతం వరకు అకుంఠిత దీక్షతో మహోజ్వల పాత్ర నిర్వహించారు.

**కమ్యూనిస్టు పార్టీ అద్వితీయ స్థానం :**

కమ్యూనిస్టు పార్టీకి ఈ రాష్ట్రంలో అద్వితీయ స్థానం ఉంది. తెలుగు జాతిని ఏకం చేయడానికి, ఆంధ్ర భాషా సాంస్కృతిక పునరుజ్జీవనానికి, వికాసానికి బాటలు వేసింది. గురజాడ, కందుకూరి, చిలకమర్తి వంటి వారి రచనలు వెలుగులోకి తెచ్చింది. మద్రాస్ రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ముందుండి పోరాడింది. నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల వెన్నుతట్టి నిలబెట్టి సాయుధ పోరాటం నిర్వహించింది. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు వీర మరణం చెందారు. ఈ పోరాటంలో మూడువేల గ్రామాలు విముక్తి చేసి గ్రామ రాజ్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. 10లక్షల ఎకరాల దొరల భూమి ప్రజల పరం చేయబడింది. జమీందారి, జాగీర్దారి వ్యవస్థకు గోరీ కట్టింది. తెలుగు, మరాఠి, కన్నడ భాషా ప్రజలకు వేర్వేరుగా, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతమైంది.

**ప్రజల ఆశాజ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ :**

నందికొండ శ్రీశైలంలో ఉన్న సిద్దేశ్వరం ప్రాజెక్టుకు దాని ద్వారా రాయలసీమకు నీళ్లివ్వాలంది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, భూ గరిష్ట పరిమితి చట్టం కోసం పోరాడింది. మిగులు భూములు పేదలకు పంచాలని కోరింది. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి, కృష్ణాజిల్లా నూజివీడు విస్సన్నలపేటల నుంచి ఆదిలాబాద్, బెల్లంపల్లి వరకు బినామి, బంజర భూములు పేద ప్రజలు ఆక్రమిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో అసంఘటితంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, చేనేత, గీత, బీడి కార్మికులను చైతన్యపరుస్తూ వారి దైనందిన సమస్యల కోసం పోరాడింది. సిపిఐ బొగ్గుగని కార్మికులు, ఆర్టిసి, జౌళి, జూట్, సిమెంట్ , చక్కెర ఫ్యాక్టరీ, అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సంస్థల్లో ఇంకా అనేక వాటిల్లో పనిచేసే లక్షలాది కార్మికుల తరుపున పోరాడుతుంది. ధాన్యం, పత్తి, పొగాకు, వేరుశనగ వగైర పంటలకు గిట్టుబాటు ధర కావాలని, విద్యార్థి, యువజన, మహిళ, దళితుల, గిరిజన అభ్యున్నతికి నిత్యం పోరాటాలు నిర్వహిస్తుంది. పదరికుప్పం, కారంచేడు సంఘటనలను ఖండించింది. వ్యవసాయ కార్మికులు, రైతులు, శ్రమజీవులు తమ వర్గ విభేదాలు మరిచి సంఘటితమై పోరాడినప్పుడే సాంఘిక దౌర్జన్యాలు సమాధి అవుతాయి. పీడిత ప్రజల ఆశాజ్యోతిగా వెలుగొందే సిపిఐని మార్క్సిజం, లెనినిజంలకు వ్యతిరేకంగా మావోవాద పిడివాద సిద్ధాంతాలతో బద్ధలుగా చీల్చారు. ఫలితంగా కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనంకు ఆటంకం కలిగింది. సిపిఐ నుంచి సిపిఎంగా చీలినవారు చీలికను నేటికి శ్లాఘిస్తున్నారు. విప్లవోద్యమం ముందుకుపోయిందని నమ్మజూపడం దురదృష్టకరం. భారతదేశంలో సూత్రబద్ధంగా కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత సాధించడానికి కమ్యూనిస్టు పార్టీ శక్తివంచన లేకుండా పాటుపడుతుంది. దేశ కళ్యాణం కోసం, శ్రామిక ప్రజల హక్కుల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడింది. అదే కష్టజీవుల ఆశాజ్యోతి. ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీ అత్యంత పాశవికమైన నిర్బంధాలను, జైళ్లను, లాఠీలను, తుపాకీ గుండ్లను ఎదిరించి మేరుపర్వతంలా నిలబడింది. ఇంతటి త్యాగాలు, ఇంతటి రక్తతర్పణం చేసిన రాజకీయ పార్టీ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే మరొకటి లేదని కమ్యూనిస్టు పార్టీ సగర్వంగా చెప్పగలదు.

('విశాలాంధ్ర' స్వర్ణోత్సవం— ఖమ్మం జిల్లా ప్రత్యేక సంచిక (2002) నుంచి)

# మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం

కీ.శే.సురవరం సుధాకర్‌రెడ్డి స్నేహశీలి. సున్నితంగా విమర్శించే స్వభావం. అందుకే విభిన్న సిద్ధాంతాలు కలిగిన కరుడుగట్టిన మితవాదులు సైతం ఆయనకు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. పౌరహక్కుల మానవ హక్కుల నాయకులు సైతం ఆయనకు నివాళులర్పించారు. ఆయనలో మానవత్వం మూర్తీభవించింది. ప్రజానీకాన్ని, అలాగే కార్యకర్తలను ఉత్తేజపరచగలిగిన వాగ్ధాటి. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్నారు.

ప్రస్తుత అఖిలభారత విద్యార్థి సమాఖ్య శాఖ



సురవరంతో నా జ్ఞాపకాలు
వి.రాంనర్సింహారావు
సిపిఐ సీనియర్ నాయకుడు

హైదరాబాద్‌లో హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్‌గా ఉండేది. కోఠి మహిళా కళాశాల దర్బార్ హాల్‌లో జరిగిన మహాసభలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య హైదరాబాద్ శాఖగా పేరు మార్చారు. దానికి సదానంద్ అధ్యక్షులు. నేను ప్రధాన కార్యదర్శిని. అయితే అజీజ్‌పాషా రాష్ట్రం నుండి హైదరాబాద్ శాఖకు బాధ్యులుగా విద్యార్థులను సమీకరిస్తుంటే రాష్ట్ర, జాతీయ నాయకులుగా సుధాకర్‌రెడ్డి తన ఉత్తేజకరమైన ప్రసంగాల ద్వారా విద్యార్థులలో చైతన్యాన్ని కలిగించేవారు. హైదరాబాద్‌లో విద్యార్థి పార్టీ శాఖలో 80 మంది సభ్యులు. నేను దానికి కార్యదర్శిని, కామ్రేడ్ విజయలక్ష్మి సహాయ కార్యదర్శి, తదనంతరం అంచెలంచెలుగా ఎఐటియుసి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే అనేకమంది హోల్ టైమర్లుగా తయారయ్యారు.

అనేక మంది సుధాకర్‌రెడ్డి ప్రసంగాలకు ఆకర్షితులైనారు. అజీజ్‌పాషా డా.కె.నారాయణ విద్యార్థులతో నిత్య సంబంధాలు పెంచుకోవడంలో అత్యంత ఃసమర్థులు. వీరి త్రయం వల్ల అనేక మంది వివిధ రంగాలలో ఆరితేరారు. తమ్మారెడ్డి భరద్వాజ ఎఐఎస్‌ఎఫ్ నగర ఉపాధ్యక్షులు. వారు సినీదర్శక, నిర్మాత బాధ్యతలు నిర్వహించారు. డా.కిలారు పూర్ణచంద్రరావు వ్యవసాయ శాస్త్రవేత్త విధులు నిర్వహించారు. బొమ్మగాని ప్రభాకర్ మాస్కో రాజకీయ పాఠశాలలో ఏడాది కాలం సురవరంతో సహ విద్యార్థిగా ఉండి తదనంతరం న్యాయవాదిగా న్యాయమూర్తి కావడానికి అవకాశాలున్నప్పటికీ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజెయు) సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పల్లావెంకట్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. ఉజ్జిని యాదగిరి రావు శాసనసభ్యునిగా విధులు నిర్వహించారు. అజీజ్‌పాషా సిపిఐ జాతీయ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. ప్రేంపావని, మహిళా సమాఖ్య, ఎఐటియుసి రాష్ట్ర బాధ్యతలు, వనశ్రీ, జ్యోత్స్న, కల్పన, సిఆర్ ఫౌండేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జి.సీతారాములు, విద్యుత్ ఉద్యోగుల సంఘ నిర్మాణంలో పాల్గొన్నారు. వీరంతా ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ శాఖ నాయకులే. సురవరం ప్రసంగాల ప్రభావం, అలాగే అజీజ్‌పాషా, తదనంతరం డా.కె.నారాయణ నిత్య సంబంధాలు పెట్టుకోవడంతో అనేకమంది పూర్తి కాలం పార్టీ కార్యకర్తలుగా తయారయ్యారు.



ఈ సమయంలోనే నేను సిటీ కాలేజీ విద్యార్థి యూనియన్‌కు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యాను. ఆ ఎన్నికలలో నాకు పూర్తి సహకారం అందించిన వారు బొమ్మగాని ప్రభాకర్, అలాగే పరుచూరి గోపాలకృష్ణ (సినీ మాటల రచయిత). గోపాలకృష్ణ మరియు నేను కాలేజీలో కలిసి నాటకాలు కూడా వేశాం. ఆ రోజుల్లో నేను సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బోర్డర్‌ను. అందులో 90% బి.సి, ఎస్.సి, ఎస్.టి విద్యార్థులే. ప్రభుత్వం వారికి కేవలం రూ.20/— గ్రాంటుతో పరిమితమైన భోజనం అందించేవారు. అజీజ్‌పాషా నేను కలిసి రాష్ట్రవ్యాపిత సంఘాన్ని ఏర్పాటు చేసి భోజన చార్జీలు పెంచాలని ఉద్యమం నిర్మించాం. 20,000 మంది నిరాహార దీక్షలతో రాష్ట్ర వ్యాపితంగా 1968 డిసెంబర్‌లో పాల్గొన్నారు. డా.విజయలక్ష్మి నాయకత్వంలో ఆబిడ్స్ మహిళా విద్యార్థినులతో రాస్తారోకో నిర్వహించారు. ఫలితంగా చార్జీలు పెంచారు. అందరికీ అపరిమిత భోజనంతోపాటు సౌకర్యాలు మెరుగుపర్చారు. కాని నన్ను మాత్రం హాస్టల్ నుండి తొలగించారు.

వెంటనే సుధాకర్‌రెడ్డి స్పందించి నన్ను హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ ఆఫీస్‌లో వసతి ఏర్పాటు చేసి కార్యాలయం ఎదుట ఉన్న హోటల్‌లో భోజనం ఏర్పాటు చేశాను. మాది పెద్ద కుటుంబం. భువనగిరిలో మా ఇల్లు అవతారం చూసి సుధాకర్‌రెడ్డి చలించిపోయారు. నేను ఎంఎస్‌సి మ్యాథ్స్ చదువుతున్నా యూనివర్శిటీకి ప్యాంట్లు లేక నిక్కర్‌తో వెళ్లేవాణ్ని. క్యాంపస్ మొత్తంలో నేనొక్కడినే నిక్కర్ వేసుకొనేవాడిని. సుధాకర్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లినపుడల్లా నాకు బట్టలు కొనుక్కొచ్చేవారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినా ఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఒక బెంచి మీద పడుకునేవారు. ఆయన వివాహం విజయలక్ష్మి తో జరిగిన తదనంతరం సైతం నా వివాహం అయ్యేంత వరకూ సుధాకర్‌రెడ్డి విజయలక్ష్మి గార్ల ఇంటిలోనే నా భోజన వసతి సౌకర్యాలు. ఇంత ఆదరంగా నన్ను చూసినా, ఆయనను ఏకంగా రాష్ట్ర పార్టీ మహాసభలోనే మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లి క్రిందిస్థాయిలో పనిచేయాలని విమర్శ పెట్టినా ఆయన నన్ను ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. తాను తయారు చేసిన కార్యకర్త తననే విమర్శించే స్థాయికి ఎదిగాడని మరింత ఆదరాభిమానాలు పెంచుకోవడం కమ్యూనిస్టుకు ఉండాల్సిన సద్గుణం.

ఆయనపై కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ప్రభావం బాగా ఉండేది. ఆయనది జమీందార్ కుటుంబమైన వ్యవసాయ కార్మిక సంఘంలో పని

(మిగతా 9వ పేజీలో)

## నేడు కమ్మ వన సమారాధనకు భారీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో ఆదివారం జరగనున్న కార్తీక మాస కమ్మ వన సమారాధనకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కార్యక్రమం మరింత ఘనంగా నిర్వహించేందుకు కమ్మ మహాజన సంఘం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం కొత్తగూడెం రోడ్డులో ఉన్న చెరుకూరి వారి మామిడి తోటలో వన సమారాధనకు ఏర్పాట్లు చేశారు. సుమారు 16 ఎకరాల్లో పూజా స్థలం, శివాలయం సెట్టింగ్, సభా వేదిక, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు, భోజనశాలలు, ఎన్‌టిఆర్ ఫోటో గ్యాలరీ, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక పోటీ ప్రాంగణాలు, కబడ్డీతో సహా పలు క్రీడల కోసం ప్రత్యేక మైదానాలు సిద్ధం చేశారు. వాహనాల రద్దీ దృష్ట్యా 45 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూట్ మ్యాపులను ఏర్పాటు చేశారు. ఈ వన సమారాధనలో భక్తి కార్యక్రమాలు, దేవతరాధనలు, పిల్లలకు గేమ్స్, మహిళలకు పోటీలు, వంటల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్, సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగు సంప్రదాయ కళలను ప్రతిభింభించే వినోద కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

## సింగరేణి కుటుంబాల్లో నేడు కారుణ్య నియామకపత్రాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కుటుంబాల్లో ఆనందోత్సాలు నెలకొన్నాయి.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క నేడు కారుణ్య నియామకాలకు చెందిన పత్రాలను అందించనున్నారు. సింగరేణి ఉద్యోగంలో ఉంటూ అనారోగ్య కారణాలతో అన్‌ఫిట్ చేసి పదవీవిరమణకి రెండేళ్ల ముందే ఉద్యోగం దిగిపోయి కుటుంబలో కుమారుడు,కూతురు, అల్లుడు, కోడలు కు ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ సింగరేణిలో ఉంది. ఇందులో భాగంగా ఉద్యోగాలకు అన్‌ఫిట్ చేసిన 374 మంది కార్మిక వారసులకు నేడు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సి అండ్ ఎండి బలరామ్ నాయక్, డైరెక్టర్ పా సమక్ష్యంలో కారుణ్య నియామక పత్రాలు అందిస్తున్నారు. కొత్తగూడెం క్లబ్ వేధికగా జరిగే ఈ కార్యక్రమానికి సింగరేణి సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మిక కుటుంబాలు పాల్గొననున్నాయి.

## నేడు అభ్యుదయ రచయితల సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా అభ్యుదయ రచయితల సమావేశం ఈనెల 16న ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ పాత్ర, సాధించిన విజయాలు, చారిత్రాత్మక పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు పాటలు, కవితలు, ప్రత్యేక కథనాలను రూపొందించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సంచికను విడుదల చేసినట్లు తెలిపారు. అభ్యుదయ కవులు, రచయితలు, వామపక్ష అభిమానులు ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా తెలిపారు.

## పుస్తక పఠనం మేధోశక్తిని పెంచుతుంది

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కరుణ కుమారి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పుస్తక పఠనం మేధోశక్తిని ఎంతగానో పెంచుతుందని, చిరిగిన చొక్కా అయినా తొడుక్కో గానీ ఓ మంచి పుస్తకాన్ని కొనుక్కోని చదువుకు అని పెద్దలు అన్నారని జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి కె.కరుణకుమారి అన్నారు. జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు ఈ పుస్తక ప్రదర్శనలో పాల్గొని వివిధ పుస్తకాలు గురించి తెలుసుకున్నారు. పుస్తక పఠనంతోనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని, ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని ఇక్కడ అందుబాటులో ఉన్న పలు రకాల పుస్తకాలను చదువుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పుస్తకాల విలువను చాటి చెప్పేందుకు పోస్టాఫీస్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ఇవి దేవాలయాలతో సమానం అని అన్నారు.రామచంద్ర కళాశాల అధ్యాపకురాలు పద్మ, గ్రంథపాలకురాలు మణి మృధుల, మధుబాబు, రుక్మిణి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 250 కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ



**ప్రజాపక్షం/చర్ల :** మావోయిస్టు ప్రభావిత ప్రాంత ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి జిల్లా పోలీసులు ప్రధాన లక్ష్యమని అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్ అన్నారు.చత్తీస్‌గడ్ సరిహద్దు గిరిజన గ్రామాలైన బక్క చింతలపాడు, కిష్టాపురం, వీరాపురం, రాళ్లపురం, తిమ్మిరిగూడెం, కమలాపురం గ్రామాల ప్రజలకు తిమ్మిరిగూడెంలో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రజలకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఇందు లో భాగంగా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించరాదని కోరారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరైనా పోలీసులకు సహకరిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మారుమూల ఏజెన్సీ ప్రజలకు నిత్యవసరాలు వస్తువులు అందించేందుకు ముందుకొచ్చిన నెస్ట్‌లీ కంపెనీ వారిని ఈ సందర్భంగా అభినందించారు.

## రమేష్‌కి సిపిఐ ఘన నివాళి

నివాళులర్పించిన బాగం, జమ్ముల



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మినేని హన్మంతరావు తనయులు సిపిఐ సానుభూతిపరుడు బొమ్మినేని రమేష్(44) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి, సమితి సభ్యులు బత్తినేని నీరజ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాగ ప్రసాదరావు, కిలారి సురేష్, కాంగ్రెస్ మండల నాయకులు కళ్యాణపు నాగేశ్వరరావు, చావా నాగేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు జంగా రవికుమార్, వల్లబోయిన కొండలరావు, టిడిపి బరకయ్య, తూము పుల్లయ్య, సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు వల్లబోయిన జానయ్య, వల్లబోయిన వీరభద్రం, తోటపల్లి ఆనందరావు, మరీదు వెంకటేశ్వర్లు, ఏదుళ్ల సత్యం, మరీదు హన్మంతరావు తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

టిజిఇజెఎసి రాష్ట్ర కార్యదర్శి ఏలూరి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధి సాధ్యమని తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసి రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో శనివారం ఏలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలిపారు. గ్రంథాలయాల్లో చదువుతకున్న ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి జైపాల్, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్ రాజు, సెక్రటరీ ఇమామ్, గ్రంథాలయ ఉద్యోగులు భాస్కర్‌రావు, లలితకుమారి, సిహెచ్ శ్రీనివాస్, భూక్యా బాబు, కె. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

లకారంలో చేప పిల్లలను

విడుదల చేసిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం బాగుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని లకారం ట్యాంక్ బండ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ లతో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో అంతర్గతంగా పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలన్నారు. గోళ్లపాడు ఛానెల్, లకారం చెరువు, డంప్ యార్డ్, కలెక్టరేట్, బస్టాండ్ పరిస్థితులను అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించి బాగు చేయడం జరిగిందన్నారు. రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలన్నారు. రహదారుల విస్తరణతో అభివృద్ధి వేగంగా జరుగుతుందని వ్యాపారాలు బాగుంటాయన్నారు. లకారం చెరువు బాగు చేస్తే నగర ప్రజలు సాయంత్ర సమయంలో ఆహ్లాదంగా గడిపేందుకు ఒక వేదిక దొరికిందన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును సైతం అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్,చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల దోమలు వ్యాప్తి చెందిన డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వస్తాయని మనం సంపాదించినదంతా ఆసుపత్రుల పాలవుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. ఖమ్మంలో మంచి రెసిడెన్షియల్ పాఠశాలలు, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. ధంసలాపురంకు మురుగు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం చేప పిల్లలను రాయితీపై అందిస్తుందని మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 3.5 కోట్ల చేప పిల్లలను నీటి వనరులలో 224 మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో విడుదల చేస్తున్నామన్నారు. లకారం ట్యాంక్ బండ్‌లో 82,500 చేప పిల్లలను విడుదల చేసిన ట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలో 17 లక్షల చేప పిల్లలను ఉచితంగా విడుదల చేస్తున్నామన్నారు. ప్రమాదాల్లో మృతిచెందిన మత్స్య కార్మికులు కొత్తగూడెం ధంసలాపురంకు చెందిన కనకయ్య, రఘునాథపాలెంకు చెందిన మంగయ్య కుటుంబాలకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ క్రింద ఐదు లక్షల చొప్పున బీమా చెక్కులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. అదనపు కలెక్టర్, ఇంచార్జ్ కార్పోరేషన్ కమిషనర్ డా॥ పి.శ్రీజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మత్స్యశాఖాధికారి శివప్రసాద్, జిల్లా నీటి పారుదల అధికారి వెంకట్రామ్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ అనన్య, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు పాల్గొన్నారు.

**మంచుకొండలో పర్యటించిన మంత్రి తుమ్మల :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం మంచుకొండలో పర్యటించారు. మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన అదనపు గదులను తుమ్మల ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసి రైతు బజార్‌ను ప్రారంభించారు.

## అద్దె బస్సులు ఆపేస్తారట !

అధిక బరువుతో

ఆగమవుతున్నబస్సులు

అద్దె బస్సు యజమానుల హెచ్చరిక

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన ఉచిత బస్సుతో కోట్లాది మంది ప్రయాణికులు లబ్ది పొందుతున్నప్పటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని ఇబ్బందులు తప్పటం లేదు. ఉచిత బస్సు తర్వాత ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికులు బస్సులో ప్రయాణిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరగడమే గాక బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి.

**సిబ్బంది ఇబ్బందులు :** మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేసిన తర్వాత ఆర్టిసి సిబ్బంది బాధలు వర్ణణాతీతం. డ్రైవర్లు ఒక రకమైన ఇబ్బందులు పడుతుండగా కండక్టర్లది మరో రకమైన ఇబ్బంది. తరచూ టైర్లు పగిలిపోవడం, ఇంజన్లు మరమ్మతులకు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. కండక్టర్లు కిక్కిరిసిన ప్రయాణికులతో ఇక్కట్లు పడుతున్నారు. గడిచిన 20 మాసాల కాలంలో పెరిగిన ప్రయాణికుల సంఖ్యతో సిబ్బంది అవస్థలు పడుతున్న యాజమాన్యం మాత్రం దానిని గురించి ఆలోచించే పరిస్థితిలో లేదు.

**అద్దె బస్సు యజమానుల హెచ్చరిక :** ప్రయాణికుల సంఖ్య పెరిగి బస్సులు నడపలేని పరిస్థితి ఏర్పడుతుందని బస్సు నిర్వహణకు ఆదాయానికి మించి ఖర్చు చేయాల్సి వస్తుందని ఈ పరిస్థితుల్లో బస్సుల సంఖ్యను పెంచితే తప్ప ఆర్టిసిలో అద్దె బస్సులను నడపడం సాధ్యం కాదని బస్సు యజమానులు అధికార యంత్రాంగానికి ఇప్పటికే తెలియజేశారు.



24వ తేదీ నుండి అన్ని డిపోల్లోనూ అద్దె బస్సులను నిలిపివేస్తామని అద్దె బస్సు యజమానుల అసోసియేషన్ తెలిపింది. ఖమ్మం రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా వాటి పరిధిలో 109 పల్లె వెలుగు, 112 ఎక్స్‌ప్రెస్ అద్దె బస్సులు ఉన్నాయి. ఖమ్మం డిపోలో 33 పల్లె వెలుగు, 28 ఎక్స్‌ప్రెస్‌తో కలిపి మొత్తం 61 అద్దె బస్సులు ఉండగా మధిర డిపో పరిధిలో 23 బస్సులు ఉండగా అందులో ఎనిమిది పల్లెవెలుగు, 15 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. సత్తుపల్లి డిపోలో 28 పల్లెవెలుగు, 26 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఏడు పల్లెవెలుగు, 15 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. కొత్తగూడెం డిపో పరిధిలో 20 పల్లె వెలుగు, తొమ్మిది ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, మణుగూరు డిపో పరిధిలో 13 పల్లెవెలుగు, 19 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. ఆర్టిసి యాజమాన్యం ఇప్పటికైనా అద్దె బస్సు యజమానులతో చర్చించడంతో పాటు కొత్త బస్సులను ఏర్పాటు చేయడం, సిబ్బంది నియామకం జరిపితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.

## బిర్సా ముండా ఆదివాసీ స్వేచ్ఛా హక్కుల సింహగర్జన

మంత్రి అల్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజనుల కోసం చిన్న తనంలోనే గళం విప్పి ఐఖ్యతే శక్తి అని ఆంగ్లేయులతో పోరాడిన మహోన్నత వ్యక్తి బిర్స ముండా అని రాష్ట్ర షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి, గిరిజన, మైనార్టీ సంక్షేమ వికలాంగులు, వయోవృద్ధులు, లింగమార్పిడి సాధికారిత శాఖా మాత్యులు అల్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. శనివారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్లో రాష్ట్ర స్థాయి జెన్‌జాతీయ గౌరవ దివస్,. 150 జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యాతిధిగా పాల్గొన్నారు. చిరత్రను బాహ్య ప్రపంచానికి మరింతగా తెలిసేందుకు కేంద్రప్రభుత్వం జన జాతీయ గౌరవదివస్‌గా ప్రకటించారని చెప్పారు.గిరిజన విద్యార్థుల విదేశీ చదవులకు తో డ్పాటు అందుతుందని, కళ్యాణలక్ష్మీ పథకంతో కుటుంబాలకు భరోసా తగ్గుతుందని, గిరిజన మారుమూల గ్రామాల్లో మౌళిక సదుపాయాలు, రోడ్లు,విద్యుత్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపి బలరామ్ నాయక్, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, గి.సం.శా అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, టిసిఆర్‌టిఐ డైరెక్టర్ సమజ్వాల, అసిస్టెంట్ డైరెక్టర్ పివి పద్మ, జిఎం శంకర్ రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, ఏపిఓ డేవిడ్ రాజ్, ఐటిడిఏ యూనిట్ అధికారులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. శనివారం ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ హాజరై మాట్లాడారు. కక్షిదారులు లీగల్ పెషంట్లుగా అనుకోవాలని వారు ఏదో ఒక అన్యాయంతో బాధపడటం వల్ల కోర్టుకు వస్తారన్నారు. రోగి ఆలస్యంగా వచ్చాడని చికిత్స చేయకుండా పంపించకూడదని అలాగే వాళ్ల అన్యాయాల గాయాలకు న్యాయమనే చికిత్స చేసి పంపాలని అప్పుడే కోర్టులకు గౌరవం పెరుగుతుందన్నారు. సత్వరం ఉచిత న్యాయం చేయాలని అందుకోసం లోక్ అదాలత్‌కు రావాలని కోరారు. జడ్జిలు, న్యాయవాదులు అందరూ ఇందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వి. అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.




## నవభారత నిర్మాణానికి వల్లభాయ్ పటేల్ కృషి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నవభారత నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయన అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ పయణించాలని. అదే విధంగా శనివారం జన్జాతీయ గౌరవ దివస్, బిర్సా ముండా జయంతిని జరుపుకోవడం కూడా ఎంతో గప్ప విషయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వశాఖ, మేరా యువ భారత్ ఖమ్మం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్, భరతమాత చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించి ఐక్యత పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఏ ర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో స్వేచ్ఛా కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమంతా ఒక్కటే అని చాటి చెప్పారని వివరించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటిగా చేయడంలో సర్దార్ వల్లభాయ్ కృషి చేశారని చెప్పారు. దేశ ప్రజలను చైత్య పరిచి ఒక్కతాటిపైకి నడిపించిన మహనీయుడు అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజలు ఆయన ఆశయాల సాధన కోసం పనిచేయాలన్నారు. భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి ప్రతీ పౌరుడు దేశీయ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని, దేసానికి సహకరించాలని ప్రతీ ఒక్కరితీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేరా యువభారత్ ఖమ్మం జిల్లా అకౌంట్స్ అధికారి కే భాను చందర్ మాట్లాడుతూ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో యూనిటీ మార్చే 2025 సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరిచుకుని జరిపే కార్యక్రమం అన్నారు. ఈమార్చ్, ఏక్ భారత్‌శ్రేష్ట భారత్



స్ఫూర్తిని జరుపుకుంటూ దేశ ఐఖ్యతను చాటి చెబుతుందని తెలిపారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు.డిఎస్‌పి షేక్ అబ్దుల్ రెహ్మాన్, డివైఎస్ ఓ పరందామిరెడ్డి, ఎన్‌సిసి న యూబ్ జుబేదార్ లక్ష్మ ణ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డా. వేముల కామేశ్వరరావు, ఇడి కాలేజీ ప్రి న్సిపల్ పద్మ, మేరా యువభారత్ ఖమ్మం జిల్లా క న్వీనర్ బి గోపీ కృష్ణ, బి ప్రభాకర్ రెడ్డి, జాగృతి యూత్ అసోసియేషన్ సయ్యద్ షారూక్ ఇమ్రాన్, మహిళా సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కొత్తగూడెం క్లబ్‌లో మెగాజాబ్ మేళా

తరలివస్తున్న 65కి పైగా కంపెనీలు

మూడు వేల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

మెగాజాబ్ మేళాకు

ఎమ్మెల్యే కూనంనేని సారథ్యం

హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి

భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థ సౌజన్యం, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో కొత్తగూడెం క్లబ్ వేదికగా నేడు జరిగే మెగా జాబ్ మేళా నిరుద్యోగుల వర వేదిక కానుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. జాబ్ మైళాకు రిజిష్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈ ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ కోసం క్యూర్ కోడ్ కూడా రూపొందించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రిజిష్ట్రేషన్ పామ్ ఓపెన్ అవుతుంది. తద్వారా నిరుద్యోగులు పూర్తి వివరాలతో నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ సౌకర్యమే కాకుండా ఆఫ్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకునేందుకు కొత్తగూడెం క్లబ్ వద్ద వేర్వేరుగా రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. అప్పటికప్పుడు తమ పేర్లను నమోదు చేసుకున్న వారు కూడా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ జాబ్‌మేళాకు దిగ్గజ సాఫ్ట్‌వార్, మోటార్ రంగ సంస్థలతో పాటు సుమారు 65కి పైగా కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తరలివస్తున్నాయి. ఒక్కొక్క అభ్యర్థి ఐదు కంపెనీల్లో ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు ప్రాంగణంలో పాస్ సౌకర్యం కల్పించారు. రిజిష్ట్రేన్ చేసుకున్న ప్రతీ ఒక్కరికీ పాస్ ఇవ్వనున్నారు. ఉద్యోగాలకు ఎంపికైనా వారికి అక్కడక్కడి జాయినింగ్ లెటర్లు ఇచ్చే ఏర్పాట్లు కూడా చేశారు. కొత్తగూడెంలో నిర్వహించే జాబ్ మేళా నిరుద్యోకులకు వరంగా మారనుంది. సుమారు మూడు వేల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశిరావు నేతృత్వంలో కార్యచరణ రూపొందించారు. ఇప్పటికే జాబ్ మేళా కోసం సుమారు 5 వేల మందికి పైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆదివారం నాటికి ఆ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాబ్‌మేళాకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరై ప్రారంభిస్తారు.అదే విధంగా సింగరేణి సి అండ్ ఎంపి బలరామ్ నాయక్, డైరెక్టర్ పా గౌతం ప్రోట్రు హాజరవుతున్నారు. జాబ్‌మేళాపై విస్తృత ప్రచారంలో భాగంగా ఆటోల తతతద్వారా ప్రచారం చేస్తున్నారు. మరో ప్రక్క సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. జాబ్‌మేళా కోసం కొత్తగూడెం క్లబ్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించేందు కు సుమారు 60కి పైగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. జి ల్లా నలుమూలల నుండి వచ్చే వారి కోసం సదుపాయా లు కల్పించారు. హైదరాబాద్ వంటి మహానగరాలకు ఉద్యోగాల వేట కోసం వెళ్లి కంపెనీల చుట్టూ తిరిగి అలిసిపోయే పని లేకుండా కొత్తగూడెం కేంద్రంగా సింగరేణి సంస్థ సౌజన్యంతో కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో జరిగే ఈ మెగాజాబ్ మేళా ఓ సువర్ణ అధ్యాయంగా మిగిలిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం షాలేమ్‌రాజ్‌తో కలిసి జాబ్‌మైళా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.





సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

సింగరేణి అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలన

ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్తగూడెం మెగా జాబ్ మేళాను తీర్చి దిద్దుతున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జరిగే మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను సింగరేణి డైరెక్టర్ పిఅడ్‌పి కె వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా మేనేజర్ షాలేమ్ రాజ్ తదితర అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దాదాపు 65కి పైగా కంపెనీలు తరలివస్తున్నాయని, ఇప్పటికే సమారు 5 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు.

కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సింగరేణి యాజమాన్యం సహకారంతో జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ స్థాయిలో జరగనున్న ఈజాబ్ మేళాతో ఈ ప్రాంత ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ఇప్పటికే పలువురు రిజిష్టన్ చేసుకున్నారని, పేర్లు నమోదు చేసుకోని వారి కోసం క్లబ్ ఆవరణలో నేరుగా రిజిష్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. సింగరేణి ఎస్ఓ 2 జిఎం కోటిరెడ్డి, ఏజిఎం సివిల్ రామకృష్ణ, డిజిఎం పర్సనల్ మోహన్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ తా వుర్య, గుర్తింపు సంఘ నాయకులు వట్టికొ ఒడ మల్లిఖార్జునరావు, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, ఎండి యూసుఫ్, ధర్మరాజు, గుత్తుల శ్రీనివాస్, వంగా వెం కట్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం / నల్లబెల్లి (నర్సంపేట) :** నల్లబెల్లి మండలం గోవిందాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో, రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని తొందరగా తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలన్నారు. రైతులు తమ ధాన్యంపై టార్పాలిన్స్ కవర్స్ కప్పే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ లో రైతుల వివరాలు నమోదు చేసి వారి అకౌంట్లో తొందరగా డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఎఓ అనురాధ, డిఎం సివిల్ సప్లైస్ సంధ్యా రాణి, డి ఎస్ ఓ కిష్టయ్య, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన భాండాగారాలు.. గ్రంథాలయాలు



**ప్రజాపక్షం/ములుగు:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని నగర పురపాలక సంఘం కమిషనర్ జె సంపత్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 2వ రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ ములుగు నందు ఎగ్జిబిషన్ కార్యక్రమం జె సంపత్, నగర పురపాలక సంఘం కమిషనర్‌చే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అరుదైన పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలు, చిన్న పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, ఆధ్మాత్మికతకు సంబంధించిన పుస్తకాలు, ఇతర పుస్తకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ములుగు జిల్లా ప్రజలు 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు సమ్మక్క, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శనివారం నగర పరిధిలోని ఉనికిచర్ల మడికొండ, తరాలపల్లి, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నగర పరిధిలోని 46వ డివిజన్ ఉనికిచర్ల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డుతో పాటు శ్మశాన వాటికలో ఏర్పాటుచేసిన బర్నింగ్ ప్లాట్ ఫాం, నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోర్ ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులను 64వ డివిజన్ మడికొండ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు పనులను, తరాలపల్లిలో సిసి రోడ్డు సిద్ధార్థనగర్‌లో కమ్యూనిటీ హాల్‌తో పాటు 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మాణం కొనసాగుతున్న అర్బన్ ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డిఈ రవి కిరణ్, ఎఇ రామన్న, వర్క్ ఇన్స్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని నర్సాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు సందర్శించి సెంటర్లోని గదులను, మందులను, రిజిస్టర్లను వీక్షించి అత్యవసర చికిత్స మందులను సమకూర్చుకోవాలని, లేని యెడల జిల్లా కార్యాలయానికి ఇండెంట్ పెట్టి తీసుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకోబడతాయని సిబ్బందిని హెచ్చరించారు. విపరీతమైన చలి ఉన్నందున, ప్రజలు ఎక్కువ సమయము చలిలో గడపకూడదని, శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులను, శరీరం వెచ్చగా ఉంచే దుస్తులను వాడాలని వేడిగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని ముఖ్యంగా వృద్ధులు పిల్లలు ఈ చలికాలంలో జాగ్రత్తగా ఉండాలని, పిల్లలు జలుబు దగ్గు జ్వరం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారించే చికిత్స చేయించాలని తెలుపుతూ ఇట్టి విషయాలను గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త శారద, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామస్వామి సేవలకు దేశ విదేశాలలో విశేష గుర్తింపు



**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగపు విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎన్. రామస్వామికి అరుదైన గౌరవం లభించింది. బయోటెక్నాలజీ రంగంలో ఆయన చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా, "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్2025" ను చెన్నై, తమిళనాడులోని సైంటిఫిక్ లారియేట్స్ కమిటీ, నవంబర్ 14వ తేదీన ఆనెైన్ వేదికగా ప్రదానం చేసింది. బయో టెక్నాలజీ రంగం ల పరిశోధనలో ఆయన చేసిన సేవలు దేశవిదేశాలలో విశేష గుర్తింపు పొందాయి. గతంలో కూడా ఆచార్య రామస్వామి ఆంధ్రప్రదేశ్ సైంటిస్ట్ అవార్డు, అకాడమీ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ ఇండియా అవార్డు, స్టేట్ మైనారిటీస్ బెస్ట్ టీచర్ అవార్డు, అమెరికా సంయుక్త రాష్ట్రాల టాలెంటెడ్ సైంటిస్ట్ అవార్డు, టాలెంటెడ్ బయోటెక్నాలజిస్ట్ అవార్డు సహా అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, బోధనబోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు ఆచార్య రామస్వామికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## విద్యార్థి సంఘాల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సరికావు



**ప్రజాపక్షం/ వరంగల్:** విద్యార్థి సంఘాల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సరికావని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్య సంఘాలు విద్యార్థి సంఘాలపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ల్యాదల్ల శరత్, అర్జున్, యారా ప్రశాంత్, రోహిత్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు చేసిన వ్యాఖ్యల్ని భేషరతుగావెనక్కి తీసుకోవాలన్నారు. ఒక్కరూ చేసిన చిన్న పొరపాటును అన్ని విద్యార్థి సంఘాలకు ఆపాదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల హక్కుల కోసం, విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తున్నాయి. కాని యజమాన్యాలు విద్యార్థి సంఘాలకు మాకు ఏం సంబంధమని మాట్లాడటం చాలా సిగ్గుచేటన్నారు. విద్యార్థి సంఘాలను బిచ్చగాళ్లంటూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అంతటితోటే ఆగకుండా పరిధి దాటి విచక్షణ కోల్పోయి మాట్లాడటం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు. దీన్ని వెంటనే వెనక్కి తీసుకోకుంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు మేం బాధ్యులము కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి,రాకేష్, అంజత్, శరత్, లడ్డూ, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిసి రిజర్వేషన్‌ల రాజ్యాంగ బద్ధతకు ధర్మ యుద్ధం

బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడానికి డిసెంబర్ 1వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించాలని ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలని బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరపున పార్లమెంటు సమావేశాలను స్తంభింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు కాకతీయ యూనివర్సిటీలోని బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న బిసిల ధర్మ పోరాట దీక్షల ముగింపుకు బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బిసి దీక్షలతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి పార్లమెంటులో బిసి బిల్లుపై చర్చకు పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా బిసి రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలపాలని, లేదంటే డిసెంబర్ మొదటి వారంలో వేలాదిమందితో పార్లమెంటును దిగ్బంధం చేస్తామని బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంగా రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల పై ప్రభుత్వంలో ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పడాని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, డిసెంబరు ఒకటవ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షంతో వెళ్లాలనీ పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ కేంద్రంపై పోరాడడానికి రాజకీయ కార్యచరణ ప్రకటించాలనీ ఆయన డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచడానికి ఢిల్లీ వేదికగా పోరాడాలని రాష్ట్రానికి ఆయన సూచించారు. కేంద్రంపై పోరాడకుండా స్థానిక ఎన్నికలు వెళ్తే బిసిలకు కాంగ్రెస్ దోషిగా మిగులుతుందన్నారు. బిసిలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై బిసిల తిరుగుబాటు తప్పదన్నారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలు వెళితే బిసిలు రాష్ట్రంలో అగ్గి రాజేస్తారనీ, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్కల వలె బిసిలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దండెత్తరని హెచ్చరించారు. ఢిల్లీతో కాంగ్రెస్ పోరాడితే దేశంలోని బిసిల అండ కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని, బిసి రి జర్వేషన్ల చట్టాన్ని అమలు చేయకుండా తప్పించుకుంటున్న బిజెపిని బిసిల దోషిగా చేసే బాధ్యత బిసి సమాజం తీసుకుంటుందన్నారు. రేపు రన్ ఫర్ సోషలిసిస్ పేరుతో ర్యాలీలు తీస్తామని, డిసెంబర్‌లో గల్లీ నుండి ఢిల్లీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింప చేస్తామని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్లు సాధించడం కోసం పల్లె నుండి పట్నం దాకా బిసిలు పోరాడుతారని 42 శాతం రిజర్వేషను సాధించేవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదనీ, గల్లీలో తెలంగాణ ఉద్యమ తరహాలో, ఢిల్లీలో రైతు ఉద్యమ తరాలు బిసి ఉద్యమించి విజయం సాధించాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కెయు బిసిల ధర్మ పోరాట దీక్ష ముగింపు కార్యక్రమంలో సందర్భంగా బిసి విద్యార్థి సంఘాల జెఎసి చైర్మన్ నాగరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, బిసి జెఎసి నాయకులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, డాక్టర్ చిర్ర రాజు గౌడ్, బోనగా ని యాదగిరి గౌడ్, వరంగల్ శ్రీనివాస్, భీమగాని యాదగిరి, మాదం పద్మజ దేవి, తమ్మేలా శోభరాణి, వేముల మహేందర్, డ్యాగల శ్రీనివాస్, అ జయ్ సింగ్, అన్వేష్ , రాజశేఖర్,కాగితపు నాగరాజు, అనిల్, సుమన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతమే రైతుల అభివృద్ధికి నాంది

పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** సహకార సంఘాల బలోపేతమే రైతుల అభివృద్ధికి నాంది అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. నాలుగు నెలల 15 రోజులలో ఒక కోటి పది లక్షల నిధులతో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిన పెంచికలపేట సొసైటీ చైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, డిసిఓ సంజీవరెడ్డిని పరకాల ఎమ్మెల్యే సన్మానించారు. ఆత్మకూరు మండలం పెంచికలపేట పిఏసిఎస్ ఆధ్వర్యంలో కందిబండ వద్ద ధాన్యం సేకరణ డ్రై షెడ్‌కు పెంచికలపేటలోని బతుకమ్మ గడ్డలో ఫర్టిలైజర్ గోదాం డ్రై షెడ్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అలాగే డిసిసిబి డైరెక్టర్, పిఏసిఎస్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పెంచికలపేట గ్రామంలో, 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా పిఏసిఎస్ పెంచికల పేట నూతన భవనం ప్రారంభోత్సవం (నీరుకుళ్ళలో) టీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి పది లక్షల రూపాయల నిధులతో భవనాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. సకాలంలో రైతుల కోసం పెంచికలపేట పిఏసిఎస్ భవనాన్ని, నాలుగు నెలల 15 రోజులలో పూర్తి చేసిన చైర్మన్ కంది శ్రీనివాస్ రెడ్డి, డిసిఓ సంజీవరెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు.మనకు మనం అభివృద్ధి చేసుకునే వ్యవస్థ సహకార వ్యవస్థ అని, వ్యవసాయ రంగానికి సహకార వ్యవస్థ చాలా అవసరం అన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సహకార వ్యవస్థ ద్వారానే అభివృద్ధి సాధ్యం అని అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, బ్యాంకింగ్, తదితర సేవలు అందిస్తున్నారన్నారు. ఇదే పూర్తిగా తీసుకొని డ్వాక్రా గ్రూపులను చేయించి ప్రోత్సహించి, మహిళా బ్యాంకులు, మహిళా సాధికార లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. మహిళల ఆర్థిక వ్యవస్థ పరకాల మహిళా డైరీ ఏర్పాటుకు కృషి చేస్తుందని, రైతు కుటుంబాలు గౌరవంగా ఉండాలంటే, సహకార సంఘాలు బలోపేతం కావలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ సంజీవరెడ్డి, నాబార్డ్ డిడిఎం చంద్రశేఖర్, డిసిసిబి సిఇఓ వజీర్‌సుల్తాన్, పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విజేందర్ ఆశయాలను కొనసాగించాలి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు మధుగాని విజేందర్ అకాల మరణం సిపిఐ, ఎఐటియుసికి తీరనిలోటని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మధుగాని విజేందర్ చిత్రపటానికి ఆయన కుటుంబ సభ్యులతో పూలమాల వేసి సిపిఐ నాయకులు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, విజేందర్ మరణం తీరని లోటని భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో అనేక కార్మిక సమస్యలపై పోరాటాలు చేసిన నిబద్ధతగల నాయకుడు విజేందర్ అని కొనియాడారు. కార్మిక సమస్యలపై మైన్స్ మీద ప్రణాళిక బద్ధంగా అనేక సమస్యలను పరిష్కారం చేసిన నాయకుడు అని అన్నారు. ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన ఆశయాలను కొనసాగించడం మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి ఒక్కరు విజేందర్ ను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమించాలని రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు ఆసిఫ్ పాషా, తోట రామచందర్, జి.శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు నూకల చంద్రమౌళి, తాళ్ల పోషం, నాయకులు పి.శ్రీనివాస్, దోర్నాల తిరుపతి, ఖరీముల్లా, సిపిఐ నాయకులు సతీష్, ప్రవీణ్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్‌కు ఉప ఎన్నిక తప్పదా!

కడియంపై వేటుపడే అవకాశం

జూబ్లీహిల్స్ జోష్‌లో కాంగ్రెస్

పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేస్తున్న శ్రీహరి



**ప్రజాపక్షం /జనగామ:** స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే జరిగితే జూబ్లీహిల్స్ జోష్‌లో ఉన్న కాంగ్రెస్ మరో రెండు స్థానాల్ని సైతం అధికారికంగా తమ ఖాతాలో వేసుకునే అవకాశం ఉంది. అయితే కడియం శ్రీహరి సైతం గత రెండు మాసాలుగా పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేస్తుండడంతో స్టేషన్‌ఘనపూర్‌లో ఉప ఎన్నిక జరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా గడిచిన ఎన్నికల్లో స్టేషన్‌ఘనపూర్, జనగామలో మాత్రమే బిఆర్ఎస్ గెలుపొందింది. మిగతా పది చోట్ల కాంగ్రెస్ గెలుపొందింది. పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు బిఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ టిక్కెట్టు ప్రకటించింది. బిఆర్ఎస్ నుండి గెలవడం కష్టమని భావించిన కడియం శ్రీహరి తన కూతురు కావ్య కోరిక మేరకు కాంగ్రెస్ తీర్థం పుచుకున్నారు. కావ్యకు కాంగ్రెస్ టిక్కెట్టు దక్కడంతో భారీ మెజార్టీతో గెలుపొంది పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. దీనితో తన కూతురును రాజకీయ వారసురాలుగా చూడాలనుకున్న కడియం శ్రీహరి కళ నెరవేరింది.

### కడియంపై వేటు పడే అవకాశం

కడియం శ్రీహరి అధికారికంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. తరువాత పలు సభల్లో కూడా తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలో చేరినట్లు చెప్పారు. సుమారు వేయి కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చారు. అయితే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ కోర్టుకు ఎక్కింది. స్పీకర్ తేల్చాలని కోర్టు నిర్ణయించి గడువు విదించింది. మిగతా ఎమ్మెల్యేల సంగతి ఎలా ఉన్నా కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై స్పీకర్ అనర్హత వేటు వేస్తారన్న చర్చ జరుగుతుంది. కడియంపై అనర్హత వేటు పడితే స్టేషన్‌ఘనపూర్‌లో ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుంది.

### పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేస్తున్న కడియం

కడియం శ్రీహరి పార్టీ శ్రేణుల్ని సమాయత్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపు ఇస్తున్నప్పటికీ అసెంబ్లీ ఉప ఎన్నిక వచ్చినా సిద్ధంగా ఉండాలని చెప్పకనే చెబుతున్నారు. స్టేషన్‌ఘనపూర్‌లో బిఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా కాంగ్రెస్ పార్టీలో చేరింది. గతంలో తనతో ఉన్న టిడిపి నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఇలా స్టేషన్‌ఘనపూర్‌లో కాంగ్రెస్ బలపడింది. ఇక సంక్షేమ పథకాలు సైతం విరివిరిగా అందుతున్నాయి. ప్రతి గ్రామానికి ఇరవై నుండి ముప్పైకి పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. రోడ్లు, సాగునీరు, నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటి భవన్ ఇలా అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయి. దీనితో ఉప ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ గెలుస్తుందన్న నమ్మకంతో కడియం ఉన్నట్లు కనిపిస్తుంది.

### జూబ్లీహిల్స్ జోష్‌లో కాంగ్రెస్

కాగా ఇటీవల జూబ్లీహిల్స్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుపొందింది. నవీన్ యాదవ్‌కు అనుకున్న దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీనితో రాష్ట్ర బ్యాప్తంగా సంబురాలు జరగగా స్టేషన్‌ఘనపూర్‌లో ఊరూరా సంబురాలు జరిపారు. కడియం శ్రీహరి పార్టీ శ్రేణుల్ని పురమాయించి బాణాసంచా పేలుళ్లు, స్వీట్ల పంపకాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం వంటివి చేయించారు.

## మైనారిటీ సంక్షేమాన్ని బలోపేతం చేసేందుకు కృషి

రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారిని



**ప్రజాపక్షం/ వరంగల్ :** మైనారిటీ సంక్షేమానికి బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారిని అన్నారు. వరంగల్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారిని శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, డిసిపి అంకిత్ కుమార్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పురోగతి, ప్రయోజనాలు, అలాగే భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. మైనారిటీ విద్య, ఉపాధి సదుపాయాలు, నిధుల విడుదల, పారదర్శక అమలు వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. జిల్లాలో అమలవుతున్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్, సిఎం ఓవర్ సిస్ పథకాలు తీరు, మైనారిటీ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూట్ లలో అమలు అవుతున్న కామన్ మెనూ డైట్, ఇతర వసతులు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్ల లబ్దిదారుల ఎంపిక, గ్రాండ్ ఎయిడ్ కింద అభివృద్ధి పనులు అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయడంపై కలెక్టర్ సత్య శారదను అభినందించారు. చైర్మన్ మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. మైనారిటీల అభివృద్ధికి వారి హక్కుల పరిరక్షణల, తన శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశములో తెలంగాణా మైనారిటీ కమిషన్ సభ్యులు దర్శన్ సింగ్, జిల్లా రెవిన్యూ అధికారి విజయలక్ష్మి , జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాలనీలలో శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గండ్రను కలిసిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి 8 ఇంక్లైన్, రామప్ప సింగరేణి కాలనీలలో స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును సిపిఐ నాయకులతో కలిసి భూపాలపల్లి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రజా, కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి కి వెంటనే కార్మిక ప్రజా సమస్యలను పరిష్కరించాలని చరవాణిలో ఆదేశించారు. ఈ సందర్భంగా రాజ్ కు మార్ మాట్లాడుతూ, సింగరేణి 8 ఇంక్లైన్ కాలనీలో సింగరేణి ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మధుగాని విజేందర్ ఇటీవలే అకాల మరణం చెందగా అంత్యక్రియలు నిర్వహించడానికి సైతం స్మశాన వాటికలు లేకపోవడం దారుణం అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కు వివరించడం జరిగిందన్నారు. అట్లాగే జిల్లా కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని గతంలోనే సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేకసార్లు కమిషనర్ కు, సింగరేణి జిఎం కు వివరించడం జరిగిందని వెంటనే కోతుల సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రవీణ్, సతీష్, పి.కృష్ణ, ఎల్.శంకర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల ప్రాముఖ్యతను గుర్తించండి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** జిల్లాలోని చెరువులు, కుంటల ప్రాముఖ్యతను గుర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో తడి నేలలు (వెట్ ల్యాండ్స్ )ను సోమ, మంగళవారాల్లో గుర్తించి వాటి పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం బుధవారం నాటికి నివేదికను సాగునీటిపారుదల అధికారులు అందజేయాలన్నారు. జియో శాటిలైట్ ఇమేజెస్ ద్వారా జిల్లాలో 267 చెరువులు, కుంటలు గుర్తించబడ్డాయని అన్నారు. జాబితాలో ఉన్న మేరకు 267 చెరువులు, కుంటలను స్థానిక పంచాయతీ కార్యదర్శితో పాటు సాగునీటిపారుదల శాఖ అధికారులు సందర్శించి వివరాల నివేదికను సమర్పించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన జిల్లాలోని 11 చెరువులను సాగునీటి పారుదల శాఖ డీఈ లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, సాగునీటిపారుదల డిఈ రామ్మోహన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, పాల్గొన్నారు.

# క్రీడ

## ఐపిఎల్ 2026 వేలం..



క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపిఎల్ 2026 రిటెన్షన్ లిస్ట్ వచ్చేసింది. డిసెంబరు 15న అబుదాబిలో మినీ వేలం జరగనుంది. ఈ నేపథ్యంలో రిటైన్, రిలీజ్ చేసే ఆటగాళ్ల వివరాలను ఫ్రాంఛైజీలు ప్రకటించాయి.

ఇక, రవీంద్ర జడేజా (రూ.14 కోట్లు,) సామ్ కరన్ (రూ.2.4 కోట్లు) సీఎస్కే నుంచి రాజస్థాన్ రాయల్స్‌కు, మహ్మద్ షమీ (రూ.10 కోట్లు) సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్‌కు, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (రూ.2.6 కోట్లు) గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు, నితీశ్ రాణా (రూ.4.2 కోట్లు) రాజస్థాన్ నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కు, శార్దూల్ ఠాకూర్ (రూ.2 కోట్లు) లఖ్‌నవూ నుంచి ముంబయికి, డొనావన్ ఫెరీరా (రూ.కోటి) ఢిల్లీ నుంచి రాజస్థాన్‌కు, మయాంక్ మార్కండే (రూ.30 లక్షలు) కోల్‌కతా నుంచి ముంబయికి, అర్జున్ తెందూల్కర్ (రూ.30 లక్షలు) ముంబయి నుంచి లక్నోకు ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే.

### రిలీజ్ జాబితా ఇదే...

**సీఎస్కే:** మతిశా పతిరన, రాహుల్ త్రిపాఠి, వన్ష్ బేడి, ఆండ్రీ సిద్ధార్థ్, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేశ్ నగార్‌కోటి.

**ముంబయి:** సత్యనారాయణ రాజు, రీస్ టాప్లీ, కేఎల్ శ్రీజిత్, కర్ణ్ శర్మ, బెవాన్ జాకబ్స్, ముజీబుర్ రెహ్మాన్, లిజాడ్ విలియమ్స్, విఘ్నేశ్ పుతుర్.

**పంజాబ్:** జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, కుల్‌దీప్ సేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ప్రవీణ్ దూబె.

**ఆర్సీబీ:** స్వస్తిక్ చికారా, మయాంక్ అగర్వాల్, టిమ్ సిఫర్ట్, లియామ్ లివింగ్‌స్టన్, మనోజ్ భాడ్గే, లుంగి ఎంగిడి, ముజారబానీ, మోహిత్ రాఠీ.

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభినవ్ మనోహర్, అథర్వ తైడే, సచిన్ బేబీ, వియాన్ ముల్డర్, సిమర్‌జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా.

**ఢిల్లీ:** డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్, సెథిఖుల్లా అటల్, మన్వంత్ కుమార్, దర్శన్ నల్కండే, మోహిత్ శర్మ.

**గుజరాత్ టైటాన్స్:** మహిపాల్ లామ్రోర్, కరీమ్ జనత్, దాసున్ శనక, గెరాల్డ్ కొయెట్జీ, కుల్వంత్ కుజ్రోలియా

**లక్నో:** ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరి, రాజ్యవర్ధన్ హంగర్గేకర్, ఆకాశ్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్.

**రాజస్థాన్:** వానిందు హసరంగ, మహీశ్ తీక్షణ, ఫజల్ హక్ ఫారూఖీ, ఆకాశ్ మధ్వాల్, కుమార్ కార్తికేయ, కునాల్ రాథోడ్ అశోక్ శర్మ.

**కోల్‌కతా:** ఆండ్రీ రస్సెల్, వెంకటేశ్ అయ్యర్, క్వింటన్ డికాక్, అన్రిచ్ నోకియా, మొయిన్ అలీ, స్పెన్సర్ జాన్సన్, లువినిత్ సిసోడియా, చేతన్ సకారియా, రహ్మనుల్లా గుర్బాజ్.



## జడేజా జోరు..
## సఫారీలు డీలా..

### రెండో రోజు ముగిసిన ఆట

ఈడెన్ గార్డెన్స్‌లో జతొలి టెస్టులో భారత్ పట్టు బిగించింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(4–29) స్పిన్ మ్యాజిక్‌తో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తోకముడవగా మ్యాచ్ టీమిండియా గుప్పిట్లోకి వచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప ఆధిక్యమే వచ్చినా.. స్పిన్ ద్వయం కుల్దీప్, జడ్డూలు తిప్పేయడంతో రెండో ఇన్నిగ్స్‌లోనూ పర్యాటక జట్టు ఆలౌట్ ప్రమాదంలో పడింది. ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేయగా కెప్టెన్ తెంబ బవుమా(29 నాటౌట్) పోరాడుతున్నాడు. రెండోరోజు మ్యాచ్‌ను శాసించిన భారత్ మూడో రోజే జయభేరి మోగించడం ఖాయం.

సొంతగడ్డపై మరో టెస్టు సిరీస్‌లోనూ భారత జట్టు గెలుపు వాకిట నిలిచింది. ఈడెన్ గార్డెన్స్‌లో స్వల్ప స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో.. బౌలర్ల జోరుతో టీమిండియా పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోర్ 37/1తో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌ను.. లెగ్ స్పిన్నర్ హర్మార్(4–30) దెబ్బ కొట్టాడు. అతడి విజృంభణతో ప్రధాన ఆటగాళ్లు పెవిలియన్ చేరగా.. దక్షిణాఫ్రికాకు 30 పరుగుల ఆధిక్యం లభించింది. దాంతో.. రెండో ఇన్నింగ్స్‌లో గొప్పగా ఆడి మ్యాచ్‌లో నిలవాలనుకున్న సఫారీలకు రవీంద్ర జడేజా(4–29) దిమ్మదిరిగే షాకిచ్చాడు. అతడికి చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్(2–12) కూడా తోడవ్వగా పర్యాటక జట్టు కష్టాలు రెట్టింపయ్యాయి. మార్కో యాన్సెన్ జతగా తెంబా బవుమా(29 నాటౌట్) కాసేపు ప్రతిఘటించారు. కానీ, కుల్దీప్ ఓవర్లో పెద్ద షాట్‌కు యత్నించిన యాన్సెన్ స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. దాంతో.. ఏడో వికెట్ కోల్పోయిన సఫారీ టీమ్ ఆలౌట్ అంచున నిలిచింది. అయితే.. వెలుతురు లేమి కారణంగా మరో పది ఓవర్లకు ముందు ఆటను నిలిపివేశారు.

### తొలి వికెట్‌కు 57 రన్స్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు రియాన్ రికెల్టన్(23) ఎడెన్ మర్క్రమ్(31)లు ధనాధన్ ఆడుతూ భారత్‌పై ఒత్తిడి పెంచాలనుకున్నారు. తొలి వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని జస్ప్రీత్ బుమ్రా విడదీసి వికెట్ల వేటకు తెరతీశాడు. మొదట రికెల్టన్‌ను బౌల్డ్ చేసిన యార్కర్ కింగ్ ఆ తర్వాత.. మర్క్రమ్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ తెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు. 82కే మూడు వికెట్ల పడిన వేళ.. కుర్రాళ్లు టోనీ బ్రిట్జ్(24), ట్రిస్టన్ స్టబ్స్(15 నాటౌట్) సఫారీ టీమ్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ కీలక రన్స్ జోడించి స్కోర్ వంద దాటించారు. అయితే.. ఈ జోడీని విడదీసిన బుమ్రా.. ఆ తర్వాత మరో రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పతనాన్ని శాంసించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా టెయిలెండర్ల సాయంతో స్టబ్స్ జట్టు స్కోర్ రెండొందలు దాటించాలనుకున్నాడు. కానీ.. హర్మర్, కేశవ్ మహరాజ్(0)లను ఔట్ చేసిన బుమ్రా 159కేసఫారీల ఇన్నింగ్స్ ముగించాడు.



# ఫోకస్ బిజినెస్



### స్థిరమైన పెరుగుదల

## కోలుకున్న భారత స్టాక్ మార్కెట్లు

భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం కోలుకోవడమేగాక, స్థిరమైన పెరుగుదలను నమోదు చేశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ), జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) లాభాలతో ముగియడం మదుపరుల్లో ఆశలు పెంచింది. సంస్థాగత పెట్టుబడిదారులు కూడా సానుకూల వైఖరిని ప్రదర్శించడం, అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగల చెప్పుకోదగిన ఘటనలు ఏవీ లేకపోవడం ఈ మార్పుకు కారణం. ఈనెల 10వ తేదీ సోమవారం ప్రారంభమైన ఈవారం లావాదేవీలు 14వ తేదీ శుక్రవారంతో ముగిశాయి. బిఎస్ఇలో సెన్సెక్స్ 83,535.35 పాయింట్లతో మొదలై, 1,027.43 పాయింట్లు లాభపడి, 84,562.78 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా ఎన్ఎస్ఇలో నిఫ్టీ 25,910.05 పాయింట్ల నుంచి 25,910.05 పాయింట్లకు చేరింది. అంటే, ఈ వారం నిఫ్టీ 335.70 పాయింట్ల మేర లాభపడింది. బిహార్‌లో ఎన్‌డిఎ మరోసారి విజయం సాధించడం శుక్రవారం నాటి మార్కెట్ లావాదేవీలపై ప్రభావం చూపింది. ఇన్‌ట్రాడేలో సెన్సెక్స్ 84,175.97 పాయింట్లకు, నిఫ్టీ 25,792.05 పాయింట్లకు పడిపోయాయి. అయితే, చివరి క్షణాల్లో దేశీయ మదుపరులు కొనుగోళ్లకు ముందుకు రావడంతో పరిస్థితి మెరుగుపడింది. ఈ ప్రభావం తాత్కాలికమేనని, వచ్చే వారం మార్కెట్లు మళ్లీ స్థిరంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద ఈ వారం విదేశీ పెట్టుబడిదారులు రూ. 7,051 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా కొనుగోళ్లు చేయడంతో పరిస్థితి చక్కబడింది.

మార్కెట్ ట్రండ్స్‌ను పరిశీలించిన తర్వాత, ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వచ్చే వారం బిఇఎల్, ఎస్‌బిఐ, ఎటర్నల్ షేర్లపై దృష్టి పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బిఇఎల్ స్టాక్ విలువ 426.85 రూపాయలుకాగా, 460 రూపాయలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అదే విధంగా రూ. 967గా ఉన్న ఎస్‌బిఐ షేర్ వాల్యూ రూ. 1,040కు చేరవచ్చని అంటున్నారు. ఎటర్నల్ స్టాక్స్ రూ. 304 వద్ద ముగిశాయి. ఈ కంపెనీ వాటాలు వచ్చే వారం రూ. 324కు చేరుకోవచ్చని భావిస్తున్నారు. అయితే, ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో చెప్పలేమని స్పష్టం చేస్తున్నారు. మార్కెట్లను నిశితంగా గమనించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఆగని పసిడి పరుగులు




బంగారం ధరలు నిరాటంకంగా పెరుగుతునే ఉన్నాయి. ఈవారం కూడా బులియన్ మార్కెట్ భారీ లాభాలనే ఆర్జించింది. శనివారం శనివారం దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే, 24 క్యారట్ల గ్రాము ధర ఒక రూపాయి తగ్గి, రూ.12,703కు చేరింది. 22 క్యారట్ల గ్రాము బంగారం ధర కూడా రూ.1 తగ్గి 11,644 వద్ద ట్రేడ్ అవుతున్నది. 18 క్యారట్ల గ్రాము బంగారం ధర సైతం రూ.1 తగ్గి రూ.9,527లుగా ఉంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇంకా సద్దుమణగలేదు. దీంతో బంగారం ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో భారతదేశంలో బంగారం ధరలు గత నెలలో భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నెలలో కూడా పసిడి ధరలకు రెక్కలకు భారీగానే వచ్చాయి. ఇక అమెరికా ప్రభుత్వ షట్ డౌన్ ముగియడంతో పెట్టుబడిదారులు ఊపిరి పీల్చుకున్నారు. డాలర్ పుంజుకోవడంతో పెట్టుబడులను వేరే ఆస్తుల వైపు మళ్లించారు. దీంతో బంగారం ధరలు కాస్త తగ్గుముఖం పట్టవచ్చని అంటున్నారు. ప్రస్తుత ధరకు బంగారాన్ని కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో రేటు తగ్గడం వల్ల నష్టపోతారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. అయితే, మత విశ్వాసాలు ఒకవైపు, అంతర్జాతీయ పరిణామాలు మరోవైపు పసిడి పరుగులకు ఊతమిస్తునే ఉన్నాయి. దీనితో భవిష్యత్తు ట్రెండ్ ఎలా ఉంటుందో అంచనా వేయడం కూడా కష్టంగా మారుతున్నదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

## 'ఆపిల్' తదుపరి సిఇఒ ఎవరు?




మొబైల్ రంగ దిగ్గజం ఆపిల్ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ వచ్చే ఏడాది పదవి నుంచి వైదొలగనున్న నేపథ్యంలో, ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ జోరందుకుంది. స్టీవ్ జాబ్స్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత, 2011లో కుక్ ఈ కంపెనీ సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు. కంపెనీపై తనదైన ముద్ర వేశారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌లో ముద్రితమైన వార్తను అనుసరించి, వచ్చే ఏడాది జనవరి మాసం చివరిలో విడుదలయ్యే మూడో త్రైమాసిక ఫలితాల తర్వాతే కొత్త సిఇఒను యాపిల్ ప్రకటిస్తుంది. కాగా, హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టర్నస్‌ను కుక్ తరువాతి వారసుడిగా భావిస్తున్నట్లు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. అందుకు కొన్ని అంశాలు ప్రస్తావించింది. జాన్ టర్నస్ ప్రస్తుతం ఆపిల్‌లో హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన నేరుగా సిఇఒ టిమ్ కుక్‌కు నివేదికలు సమర్పిస్తారు. ఐఫోన్, ఐప్యాడ మాక్, ఎయిర్‌పాడ్స్ తదితర ఉత్పత్తులపై పనిచేసే అన్ని హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ బృందాలను ఆయన పర్యవేక్షిస్తారు. టర్నస్ 2001లో ఆపిల్ ప్రోడక్ట్ డిజైన్ టీంలో చేరారు. 2013 నుంచి హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్నారు. ఆపిల్‌లో ఉన్న సమయంలో, ఆయన అన్ని తరాల ఐప్యాడ్‌లు, నూతన ఐఫోన్ సిరీస్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటి అనేక ఉత్పత్తుల హార్డ్‌వేర్ అభివృద్ధిని నడిపించారు. ఆపిల్‌లో చేరక ముందు, ఆయన వర్చువల్ రీసెర్చ్ సిస్టమ్స్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేశారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. ఇలావుంటే, టిమ్ కుక్ రాజీనామా చేస్తారా? లేదా? అనే ప్రశ్న కూడా ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ ఏడాది చివరిలో ఆయనకు 65 ఏళ్లు నిండుతాయి. అందుకే, ఆయన రాజీనామాపై ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే, టిమ్ కుక్ గానీ, ఆపిల్ పాలక వర్గంగానీ అధికారికంగా ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

## కమ్యూనిస్టుల చరిత్రను కాలం చెరపలేదు : బెజవాడ



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని అలాంటి కమ్యూనిస్టుల చరిత్రను కాలం చెరపలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 15 నుండి 21 వరకు రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్వాల నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎం.బాలనరసింహలు పాల్గొంటారని, నవంబర్ 20న హుజూర్‌నగర్ చేరుకుంటుందని తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం, సమానత్వం కోసం, దోపిడి, హింస నుండి కాపాడడం కోసం కమ్యూనిస్టుల ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు జాతి ఏనాటికి మరువదన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభలో కమ్యూనిస్టుల చరిత్రను ప్రజలకు యువతకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, మామిడి వెంకయ్య, దొంతగాని సత్యనారాయణ, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## 19న భూపాలపల్లిలో సిపిఐ ప్రచార జాతా

• సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ • హాజరుకానున్న సిపిఐ జాతీయ నాయకులు చాడ • ప్రచార జాతాలో భారీ బైక్ ర్యాలీ




ప్రజాపక్షం/భూపాలపల్లి : సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా ఈనెల 19న జిల్లాలో నిర్వహించే సిపిఐ కళాజాతాను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలు నవంబర్ 15న ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు ప్రచార జాత ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ప్రచార జాతా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదిలాబాద్ మంచిర్యాల, గోదావరిఖని, హుస్నాబాద్ హనుమకొండ మీదుగా ఈనెల 19న సాయంత్రం 4:30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి కళాజాత బృందం చేరుకుంటుందని, అదే రోజు 5:30 గంటలకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అనంతరం రాత్రి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనే బస చేసి ఉదయం 10:30 గంటలకు గణపురం నుండి ములుగు జిల్లాకు కళాజాత చేరుకుంటుందని రాజకుమార్ తెలిపారు. కావున జిల్లాలో ఉన్న సిపిఐ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు, కూలీలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సిపిఐ కళాజాతాను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### భారీ బైక్ ర్యాలీ

ఈనెల 19న సిపిఐ పార్టీ ముగింపు ఉత్సవాల్లో ప్రచార జాతాలో భాగంగా మంజూరు నగర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందని కళాజాత అతిథులను మంజూరు నగర్ లో భారీ ఆహ్వానం పలికి పైకి ర్యాలీ ద్వారా భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మోటపలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్ ఎండి.అస్లాం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### 17న నాగర్‌కర్నూల్‌కు రానున్న
## సిపిఐ రాష్ట్రజాతా
### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : సిపిఐ శతాబ్ది ఉత్సవాలముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రజాత ఈనెల17న నాగర్‌కర్నూల్ జిల్లాకు రానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 10గంటలకు తిమ్మాజిపేటకు జాత చేరుకుంటుందని అక్కడినుండి బిజినేపల్లి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం తెలకపల్లి అచ్చంపేట మీదుగా సాయంత్రం డిండివద్ద నల్గొండ జిల్లాకు జాతాను అప్పజెబుతారని తెలిపారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టుపార్టీ సిపిఐ ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో ఈరాష్ట్ర జాతజిల్లాకు రావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈజాతకు సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటిసత్యం, రాష్ట్రకార్యవర్గసభ్యులు ఇతరపార్టీ నాయకులు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

## హామీలు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తాం

మధ్యాహ్న భోజన పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పూసాల రమేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి




ప్రజాపక్షం/పెద్దపల్లి : తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ధర్నా కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా చేసి కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ ధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వాలు మారిన తలరాత మారడం లేదని, సమస్యలు ఎప్పటికప్పు డు పెరుగుతున్నాయి తప్ప సమస్యల పరిష్కారానికి ఏ ప్రభుత్వం కృషి చేయడం లేదని, తద్వారా మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు అగమ్య గోచారంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మధ్యాహ్న భోజన వర్కర్లకు సరైన న్యాయం జరగలేదని, కాంగ్రెస్ ప్ర భుత్వం వచ్చిన తర్వాతనైనా మా సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతోందని అనుకున్నామని, కానీ రెండు సంవత్సరాలు గడిచిన మా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. మధ్యాహ్న భోజన కార్మికుల ప్రధాన సమస్యలు అంగన్వాడీ సెంటర్లలో నిత్యావసర సరుకు లు ఎలా ఇస్తున్నారో మాకు కూడా అలాగే నిత్యావసర సరుకులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు పదివేల రూపాయల గౌరవ వేదం చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న పాత బకాయిలు వెంటనే చెల్లించాలని డి మాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా సమస్యలపై సానుకూలంగా స్పందించి పాఠశాలలలో ని పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించేలా చ ర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం మా స మస్యలను పరిష్కరించే వరకు నేటి నుండి నిరవధి క సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల యశోద, రాధమ్మ, లావణ్య, కళావతి, జుబేదా జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా భోజన కార్మికులు పాల్గొన్నారు.

(6వ పేజీ తరువాయి)

## మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం


చేయాలని నిర్ణయించుకొన్నారు. బికెఎంయు జాతీయ ఉపాధ్యక్షులయ్యారు. సుధాకర్‌రెడ్డి తండ్రిగారైన వెంకట్రామిరెడ్డి గారు ఎఐకెఎస్‌లో బాధ్యతలు నిర్వహించారు. అందుకే సుధాకర్‌రెడ్డిగారిని ఎఐకెఎస్‌లో బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కాని వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేయడానికే నిర్ణయించుకొని బికెఎంయు (BKMU) జాతీయ ఉపాధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చెకొస్లొవేకియా, మంగోలియా, చైనా లాంటి అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల జాతీయ మహాసభలకు సౌహార్ద్ర ప్రతినిధిగా హాజరయ్యారు. సుధాకర్‌రెడ్డి లోక్‌సభకు పోటీ చేస్తున్న సందర్భంలో "సురవరం కంఠధ్వని పార్లమెంటులో ప్రతిధ్వని" అనే నినాదం నల్లగొండ జిల్లాలో వీధి వీధిన మారుమోగింది. ఆయన గారు లోక్‌సభకు ఎన్నికైన తదనంతరం పార్లమెంటు గ్రూపు నాయకునిగా పేరు ప్రతిపాదన రావటం, ఆయన ఆ పదవిని సున్నితంగా తిరస్కరించటం చకచక సాగిపోయాయి. దానికి కారణం మరికొంత మంది నాయకులు సీనియర్లు కావటమే. వారిని కాదని తన పేరును ప్రతిపాదించటం భావ్యం కాదన్నారు. అలాగే ఆయన వర్గ దృక్పథానికి న్యాయం చేకూరేవిధంగా లోక్‌సభలో కార్మికశాఖ కమిటీకి చైర్మన్ పదవి ఆయనను వరించింది. అనేక సంవత్సరాలుగా ఆయన ఆత్మకథను వ్రాయాలని, అందుకు తాను సహకరిస్తానని వివరించినా దానికి ఆయన సమయాన్ని ఎన్నడూ కేటాయించలేకపోయారు. ఎంతమంది కార్యకర్తలను తయారు చేసినా గంటల తరబడి ప్రసంగాలు చేసినా, ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని రగిలించడానికి సమయం దొరికేది కాని, బయోగ్రఫీ రాయడానికి సమయం దొరకలేదు. కార్మిక సంఘాలకు సైతం సుధాకర్‌రెడ్డి నాయకత్వం వహించారు. మింట్ ఎంప్లాయిస్ జాతీయ సంఘానికి నాయకత్వం వహించి ఆ కార్మికుల, ఉద్యోగుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. సుధాకర్‌రెడ్డి అనేక ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రతిధ్వనింపచేసారు. అందులో అతి ముఖ్యమైనవి కొన్ని భారతదేశంలో మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసి కొత్త నోట్లు ముద్రించిన దశలో ఆ సంఖ్య వివరాలు (ముద్రించిన నోట్ల సంఖ్య, బ్యాంకులకు అందజేసిన సంఖ్య పార్లమెంటుకు, కనీసం పార్లమెటరీ కమిటీకి తెలియచేయాలని తన వాణిని ప్రతిధ్వనింపచేశారు. అలాగే విదేశీ బ్యాంకుల దాచుకొన్న డబ్బును, ముఖ్యంగా స్విస్ బ్యాంకులో దాచుకొన్న నల్లధనాన్ని తెప్పించాలని, ఆ డబ్బును ప్రజలకు పంచిపెడితే ప్రతి ఒక్కరికీ రూ.15లక్షల చొప్పున చేరుతుందని లెక్కలు తీసి పార్లమెంటులో ప్రజావాణిని వినిపించారు.

సుధాకర్‌రెడ్డిగారు కేవలం ప్రసంగాలకే పరిమితం కాలేదు. విద్యార్థి – యువజన నాయకులుగా 18 సంవత్సరాలకే ఓటుహక్కు ఇవ్వాలని సమరశీల పోరాటాలు చేశారు. లాఠీ దెబ్బలకు గురయ్యారు. ఉత్తర భారతంలోని అనేక జైలు జీవితాలను సైతం అనుభవించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, దానికి వ్యతిరేకంగా తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి సమరశీల ప్రజా బాహుళ్యంతో కూడిన "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా నాయకత్వం వహించి నిర్వహించారు. ప్రత్యక్షంగా తాను ముందుండి పోలీసుల లాఠీ చార్జీని, గుర్రాల డెక్కలతో ప్రదర్శకులపై పాశవిక పోలీసులు దాడి జరిపినా లెక్కచేయకుండా ప్రదర్శనను ముందుకు సాగించారు. సిపిఐ–సిపిఐ(ఎం) ఫార్వర్డ్ బ్లాక్ ఆర్‌యస్‌పి–యంసిపిఐ(యు) – ఎస్.యుసిఐ(సి) – న్యూ డెమోక్రసి – సిపిఐ–ఎంఎల్(లిబరేషన్) తొమ్మిది కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన సాగింది. పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు ప్రదర్శకులు అమరులయ్యారు. వందలాది మంది గాయాలపాలయ్యారు. అనేక మందిని జైళ్లలోకి ఈడ్చారు. తదనంతరం బంద్ కార్యక్రమం కూడా జరిగింది. నిత్యజీవితంలో ఎంత సౌమ్యుడో, నమ్మిన సిద్ధాంతం, ఆశయాల పట్ల అంత కఠినంగా వ్యవహరించటం సుధాకర్‌రెడ్డికే చెల్లింది. నమ్మిన ఆశయాలకు వ్యతిరేకంగా రాజీపడే ప్రసక్తే లేదు. సుధాకర్‌రెడ్డి మరణించిన తదనంతరం సైతం ఆయన కోరిక మేరకు పార్థీవ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ వైద్యశాలకు అందచేయటం జరిగింది. ఆయన జాతీయ నాయకుడైనా జన్మభూమిని మరిచిపోలేదు. గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం కావాలని, స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపడాలని హాస్పిటల్ నుండి సైతం ప్రభుత్వానికి లేఖలు పంపిస్తూనే ఉన్నాడు. ఆయన అంకిత భావం అలాంటిది. పుట్టినవారు గిట్టక మానరు. అయితే జీవితకాలంలో వారి సేవలు ఎలాంటివి అనేదే ప్రశ్న. వారి స్నేహశీలతత్వం, మృదువుగా ఎదుటివారిని ఒప్పించడం, అన్యాయానికి వ్యతిరేకంగా స్పందించడం ఇవన్నీ కలగలిపి అనేకమంది హృదయాలను చూ రగలిగాడు. అందుకే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సహా ఉపరాష్ట్రపతిగా పోటీచేసిన సుభాషణ్‌రెడ్డి, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రి, అనేక మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, పౌరహక్కుల సంఘాల, మానవహక్కుల సంఘాల నాయకుడు స్వయాన ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన ఆశయాలకు అంకితమై పోరాటాలను ఉధృతం చేయడమే ఆయనకు సరియైన నివాళి. సుధాకర్‌రెడ్డిగారికి విప్లవ జోహార్లు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా శనివారం టిపిసిసిఅధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవడంలో వారి కృషిని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. రాబో వు స్థానిక సంస్థలు, జిహెచ్‌ఎంసి ఎన్నికలను గురించిచ ర్చించారు. కాంగ్రెస్ నాయకుల సమిష్టి కృషితో అంద రూ ఏకతాటిపై నిలిచి పార్టీ గెలుపు కొరకు పక్కాగా పనిచేశారన్నారు. ప్రతిపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసి నా జూబ్లీహిల్స్ ప్రజలు ప్రజా పాలనకు పట్టం కట్టారని కొనియాడారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని ఆరేపల్లి, బ్రాహ్మణపల్లి, అచ్చంపేట్ గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఐసిడిడిఎస్ సిడిపిఓసౌభాగ్య శనివారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణీలు, బా లింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. సమయపాలన పాటించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

## ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

### అక్రమ రేషన్ బియ్యం రవాణాపై 'ప్రజాపక్షం'ప్రభావం




**ప్రజాపక్షం /సిర్పూర్ టి :**సిర్పూర్ టి మండలంలో అక్రమ రేషన్ బియ్యం రవాణా అంశాలపై 'ప్రజాపక్షం' పత్రిక ప్రత్యేక కథనాలు ప్రచురించిన నే పథ్యంలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శనివారం రోజున 'ప్రజాపక్షం' కథనాల ప్రభావంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ అధికారులు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీ ధర్ రెడ్డి, ఎక్సైజ్ శ్రీనివాస్, డిటి రాజ్ కుమార్ కలిసి అధికారుల బృందా లు వెంకట్రావ్‌పేట్, హుడికి చెక్ పోస్ట్‌లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద అదనపు సిబ్బందిని నియమించినట్లు ఎన్‌ఫోర్స్‌మె ంట్ విభాగం వెల్లడించింది. ప్రజాపక్షం కథనాల ప్రభావంతో అధికారులు కదలిక చూపించడం పట్ల స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. అక్రమ రవాణా పూర్తిగా తగ్గేవరకు చర్యలుకొనసాగించాలనిప్రజలుడిమాండ్‌చేశారు.

## శ్రీ సాయి బాలాజీ ఆగ్రో టెక్ రైస్ మిల్‌లో భారీ లోపాలు



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :**సిర్పూర్ టి మండలంలో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ (ఓఎస్‌డి) శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఆకస్మిక తనిఖీలలో శ్రీ సాయి బాలాజీ ఆగ్రో టెక్ రైస్ మి ల్లో భారీ అవకతవకలు బట్టబయలయ్యాయి. తహసీల్దార్ రహీముద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దర్యాప్తులో 17,275.97 క్వింటాళ్ల పాడి తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒక క్వింటాల్ ధర 2,583.23గా లెక్కించగా, ప్ర భుత్వానికి రావాల్సిన మొత్తం విలువ 4,46,27,285 (4.46 కోట్లు) గా నిర్ధారించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లు యాజమాన్యం శివకుమార్, మనీష్‌లకు నోటీసులు జారీ చేసి డిఫాల్ట్ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతా లో జమ చేయాలని ఆదేశించారు. మిల్లు యాజమాన్యం వారం రోజులలోనే మొత్తం డిఫాల్ట్ మొత్తాన్ని పూర్తిగా చెల్లిస్తామని అధికారులకు వ్రాతపూర్వకంగా ఇచ్చినట్టు సమాచారం. ఈ తనిఖీల్లో డిటి రాజ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు), సిబ్బంది పాల్గొన్నారు.

## రైతంగానికి మద్దతు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



**ప్రజాపక్షం/భైంసా :**రైతులకు మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.శనివారం భైంసా మండలంలోని బిజ్జుర్,కోతుల్గాం,వానల్ పాడ్,పెండ్పెల్లి,తిమ్మాపూర్,గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్ళను వెనువెంటనే చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.రైతులకు రవాణా పరంగా ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో నియోజకవర్గంలో దాదాపు వంద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింద న్నారు.రైతులు తమ పంటను దళారులకు అమ్మవద్దన్నారు.మహిళ సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో కేంద్రాల నిర్వహణ బాధ్యత మహిళ సంఘ సభ్యులకు అప్పజేప్పడం జరిగిందని అన్నారు.కొనుగోలు కేంద్రాల పారంభం సందర్భంగా మొదట పంటను అమ్ముతున్న రైతును ఎమ్మెల్యే సన్మానించారు.కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను ఆయా గ్రామాల ప్రజలు స్వాగతించి శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్,తహసీల్దార్ ప్రవీణ్,ఎంపిడిఓ నీరజ్,ఎంపిఓజాదవ్ ప్రదీప్,సీనియర్ నాయకులు సోలంకి భీమ్రావు,భైంసా మండల బిజెపి అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి, వైస్ ఎంపిపి గంగాధర్,ఆయా గ్రామాల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణాలను వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామంలో కలెక్టర్ పర్యటించి లబ్ధిదారులు నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. మండలంలోని సుల్తాన్‌నగర్ పైలెట్ గ్రామంగా ఎంపికైన దృష్ట్యా లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం నిజాంసాగర్, వెల్గనూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలను పరిశీలించి ధాన్యం కొనుగోలు తీరు, కొనుగోలుకేంద్రాల నిర్వహణ, ధాన్యం తరలింపు, డేటా ఎంట్రీ వివరాలను కొనుగోలుకేంద్రాల నిర్వాహకుల ద్వారా తెలుసుకున్నారు. కొనుగోలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియపర్చాలన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, సివిల్ సప్లై జిల్లా డిఎం శ్రీకాంత్, డిసిఎస్ఇ వెంకటేశ్వర్, డిటి ఖాలిద్, తహసీల్దార్ భిక్షపతి తదితరులున్నారు.

# మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలు

### బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి:**మత్స్యకార్మిక కుటుంబాల ఉపాధిని మెరుగు పర్చి, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు గాను నాణ్యమైన చేప పిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని, ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో మత్స్య అభివృద్ధి పథకం కింద 2025–2026 సంవత్సరానికి గాను వందశాతం సబ్సిడీపై చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడుదల చేసే బృహత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ శివారులోని అశోక్ సాగర్ చెరువులో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి లాంఛనంగా చేప పిల్లలను విడుదల చేశారు.

**4.54కోట్ల చేప పిల్లల పంపిణీ...**

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 4.54కోట్ల చేప పిల్లలను పెంపకం నిమిత్తం పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగానే అశోక్ సాగర్ చెరువులో బొచ్చ, రొహు, బంగారు తీగ జాతికి చెందిన మొత్తం 1,14,600 చేప పిల్లలను వదలడం జరిగిందని వివరించారు.

**నాణ్యత పరిశీలన తప్పనిసరి...**

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మత్స్యకార్మిక సంఘాల సభ్యులకు కీలక సూచన చేశారు. ప్రతిచోట చెరువులు, ఇతర జలాశయాలలో చేప పిల్లలను వదిలే ముందు మత్స్య కార్మిక సంఘాల సభ్యులు తప్పనిసరిగా వాటి నాణ్యతను పరిశీలించాలని ఆయన హితవు పలికారు. నిర్ణీత ప్రమాణాలను అనుగుణంగానే చేప పిల్లలు కేటాయించబడినాయా..? లేదా..? అన్నది జాగ్రత్తగా నిర్ధారించుకోవాలన్నారు. చేప పిల్లల రకాలను, సైజును, నాణ్యతను పరిశీలించి, బరువును తూకం వేస్తూ, వాటి సంఖ్యను క్షుణ్ణంగా లెక్కించిన మీదటనే చెరువులో వదలాలని సూచించారు. ఎక్కడైనా తేడా జరిగినా, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఉన్నా, వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తేవాలని కోరారు.

**ఉపాధి అవకాశాల మెరుగుదలే లక్ష్యం...**

చెరువులలో వదులుతున్న ప్రతి చేప పిల్ల బతికేలా నాణ్యమైన చేప విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నామని నాణ్యమైన చేప పిల్లలను పెంచినట్లయితే మత్స్యకారుల ఉపాధి అవకాశాలు బాగుంటాయనే ఉద్దేశ్యంతో అన్ని దశలలోనూ పకడ్బందీ పర్యవేక్షణ జరిపిస్తున్నామని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆంజనేయ స్వామి, మత్స్య కార్మిక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం..

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లాలోని వాంకిడి మండలం ఖమానా గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం నాణ్యత, నిర్వహణ, బోధనా విధానం, హాజరు పట్టికలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులు తరగతులకు గైర్హాజరు కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి విద్యార్థులకు విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనజాతీయ గౌరవ్ దివస్

### సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్:**భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు నివాళులు అర్పించారు. కాగజ్ నగర్ పట్టణంలోని పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ంలో శనివారం భగవాన్ బిర్సా ముండా 150వ జ యంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భం గా డా. హరీష్ బాబు మాట్లాడుతూ, భగవాన్ బి ర్సా ముండా 25 సంవత్సరాలకు తక్కువ జీవించి నా, మధ్య భారత దేశంలోని ఆదివాసీ సమాజంపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ముండా రె బెలియన్‌కు నేతృత్వం వహించిన భగవాన్ బిర్సా ముండా మధ్య భారతదేశంలోని ఆదివాసులందరినీ ఒకతాటిపై నడిపించి బ్రిటిష్ ప్రభుత్వా న్ని గడగడలాడించారన్నారు. వారి స్ఫూర్తితో కేం ద్ర ప్రభుత్వం వారి జయంతిని జన జాతీయ గౌర వ్ దివస్గా జరుపుతుందని తెలిపారు. ఆదివాసుల సంక్షేమం కోసం పి ఎం జన్ మన్, పి ఎం జుగా తదితర పథకాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు రామయ్య, ఆదివాసి నాయకులు మెస్రం రాజారాం, సడ్మేక రమేష్, మడావి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్:**జిల్లాలోని వివిధప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వఅభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం ఆయన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ఆర్ఒబిల పనుల పురోగతి, ధాన్యంకొనుగోళ్లు తదితర అంశాలపై సంబంధిత శాఖలఅధికారులతో సమీక్ష జరిపారు. రూరల్ మండలం మాధవనగర్, మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి, నిజామాబాద్ అర్బన్ పరిధిలోని ఆర్సపల్లి ఆర్‌ఒబిల నిర్మాణ పనులపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌ఒబిల నిర్మాణాల కోసం ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం నిధులను సైతం విడుదల చేసిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మాధవనగర్ ఆర్‌ఒబికి రూ.3.15 కోట్లు, ఆర్సపల్లికి రూ.7.46 కోట్లనిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. డిసెంబర్ 15 నాటికి వంతెనను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కొనుగోళ్ల ప్రక్రియను సాఫీగా జరిగేలా చూడాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిసూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## కొనగోలులలో వేగం పెంచి.. సకాలంలో డబ్బులు చెల్లించాలి

### ట్యాగ్ చేసిన మిల్లులకే ధాన్యం తరలించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట:**ధాన్యం కొనుగోలులో వేగం పెంచి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం పాపన్నపేట మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహిసిల్దార్ తో కలిసి పరిశీలించారు. ముందుగా కేంద్రానికి ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం ఎంత, అందులో ఎంత మేరకు కొనుగోలు చేసారు. ఇంకా తేమ శాతం రావాల్సిన ధాన్యం ఎంత ఉంది. కొనుగోలు పూర్తి అయిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసారా లేదా, అలాగే కొనుగోలు అయిన ధాన్యం ట్యాగ్ చేసిన మిల్లులకి తరలిస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్ కి సంబందించి, ధాన్యం డబ్బుల చెల్లింపులలో మరింత వేగం పెంచి ముందుకు పోవాలని తెలిపారు. గత సంవత్సరం ఇదే నెలలో 10,185 మంది రైతుల నుంచి 61,231.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 4.71 కోట్ల రూపాయలను చెల్లించగా, ప్రస్తుత సీజన్ కి, ఇప్పటివరకు 27,252 మంది రైతుల నుండి 1,14,077.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 102.84 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. తేమ శాతం వచ్చి కొనుగోలు కి సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు వేగవంతం గా జరగాలన్నారు. అదే విధంగా కొనుగోలు కి సంబందించి రిజిస్టర్ లన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా... స్పెషల్ ఇన్స్పెక్షన్ టీంను నియమించి పర్యవేక్షణ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజెన్స్ 'వాగ్దాన్' కార్యక్రమం




**ప్రజాపక్షం /సంగారెడ్డి:**మహిళా శిశు వయోవృద్ధులు దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజెన్సీ వాగ్దాన్ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ బి. చంద్రశేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భముగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు మన సమాజం యొక్క అమూల్యమైన సంపద వారి అనుభవం జీవన జ్ఞానం భావితరాలకు దారి చూపి మార్గదర్శకమన్నారు. స్థిరమైన ప్రగతికి సీనియర్ సిటిజెన్స్ యొక్క ఆలోచనా పటిమ ,అనుభవం , బలమైన ఆదారంగా నిలుస్తాయని, సమాజ అభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. ఆధునిక సమాజ మార్పులకు కుటుంబ వ్యవస్థలు మారిపోవడం వల్ల వృద్ధులపై నిర్లక్ష్యం ,ఒంటరితనం పెరుగుతున్నాయన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావడం పెన్షన్ ,పథకాలు ,ఆస్థిహక్కుల రక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు కొంత మంది వృద్ధులసేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ప్రశంసనీయమన్నారు. తల్లిదండ్రుల ,వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సూచించారు. వృద్ధుల సంరక్షణలో ఎక్కడైనా సమస్యలు ఉంటే మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## ఆలయ పునర్నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ పట్టణంలోని క మల్ రోడ్,నాయుడువాడలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మందిరం (చిలువరి భవన్)లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీ లక్ష్మి వె ంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగర ంగ వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకకు నిజామాబాద్‌బిజెపిఅర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనా రాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఆలయ ంలో వాసవి మాతను దర్శించుకున్న అనంతరం ,ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆలయ భవన పునర్నిర్మాణం కోసం తన సొంత ట్రస్టు నుంచి 3 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు.భక్తులకు ఆధ్యాత్మి క అనుభూతిని పంచిన ఈ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించిన సంఘ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వైశ్యులు వ్యాపారంతో పాటు రాజకీయాల్లోకి కూడా రావాలని ఆకాంక్షించారు. అలాగే,ఎన్నికల్లో గెలిచిన నూతన అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ కార్యక్రమంలోబిజెపినాయకులు,సంఘ కార్యవర్గం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిర్సా ముండా, స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**భగవాన్ బిర్సా ముండా, కొమురం భీం స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం గుజరాత్ రాష్ట్రం దెడియాపాడ నుండి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ వర్చువల్ విధానం ద్వారా నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలలో జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల రైతు వేదిక నుండి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, గిరిజన సంఘాల నాయకులు, పటేళ్లు, సర్ మేడిలు, అధికారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భగవాన్ బిర్సా ముండా 25 సంవత్సరాల వయసులోనే గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడారని, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 15వ తేదీని జన జాతీయ గౌరవ్ దివస్‌గా బిర్సా ముండా జయంతిని ప్రకటించిందని తెలిపారు. భగవాన్ బిర్సా ముండా, కొమురం భీం స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి జిల్లాలో చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించి గిరిజన పెద్దలను, నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్మేడి మెస్రం దుర్గు, డిడి అంబాజీ, జిసిసి డిఎం సందీప్, ఇఇ తానాజీ, జెడిఎం నాగభూషణం, ఎటిడివో సదానందం, మెస్రం మనోహర్, మాజీ ఎంపిపి పంద్ర జైవంతరావు, నాయకులు మార్సుకోల తిరుపతి, పెందుర్ ప్రభాకర్, కుడ్మెత తిరుపతి, పెందుర్ దాదీరావు, పెందుర్ పుష్ప రాణి, బొంత ఆశ రెడ్డి, నాయకులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికిసిఎంకు పోస్ట్‌కార్డు వినతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :**మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఎంకు పోస్ట్ కార్డు వినతి పంపామని మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి చక్రపాణి అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గంజి కమాన కూరగాయల మార్కెట్‌లో పోస్ట్ బాక్స్ వద్ద నిలబడి జిల్లా కమిటీ సభ్యులందరూ కలిసి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఎంకు పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని నిర్వహించామన్నారు. మొదటగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు బకాయిలు జిల్లాకు 8 కోట్లు విడుదల చేయాలని అదేవిధంగా ప్రతి విద్యార్థికి రూ.25ల స్లాబ్ రేటు నిత్యావసర వస్తువులు కోడిగుడ్డు గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలని సిఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవటానికి ప్రతి కార్మికునికి 10 వేల వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికురాలికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ డిమాండ్‌తో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహిస్తూ పోస్ట్ బాక్స్‌లో వినతిని సిఎంకు పంపించామన్నారు. సమావేశంలో బాధ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ముంపు భూములకు రూ.23.50 కోట్ల పరిహారం మంజూరు

**ప్రజాపక్షం/కరీంనగర్:** శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 2 భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం, కెనాల్ ముంపు భూముల రైతులకు పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రూ.23 కోట్ల 50 లక్షల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజి 2 ద్వారా నారాయణపూర్, స్తంభంపల్లి చెరువుల విస్తరణ, నారాయణపూర్ నుంచి వేములవాడ, స్తంభంపల్లి చెరువులకు గ్రావిటీ కెనాల్ నిర్మాణం కోసం భూములను సేకరించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృషితో పరిహారం చెల్లింపుకు ప్రభుత్వానికి విన్నవించడంతో ఈ నిధులు మంజూరు అయ్యాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది.

## సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తతే ప్రధాన ఆయుధం: ఎస్‌పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాగాళ్ళు కొత్త కొత్త రూపాల్లో ప్రజలను మోసగిస్తున్నారని, వారి భారిన పడకుండా అప్రమత్తతే ప్రధాన ఆయుధం అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా,బ్యాంకింగ్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లింకులు, లక్కీ డ్రాలు,ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు వంటి అనేక మార్గాల్లో మోసగాళ్లు ప్రజల డేటా, డబ్బు ఎత్తుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సైబర్ మోసాల నివారణకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టడంలో సైబర్ క్రైమ్ టీ , సైబర్ వారియర్లు పకడ్బందిగా వ్యవహరిస్తు వచ్చిన ప్రతి పిర్యాదు వెంటనే నమోదు చేసి విచారణ ప్రారంభించడం, ఆధునిక సాంకేతికత ఆధారంగా గడిచిన సంవత్సరం కాలంలో జిల్లాలో 64 సైబర్ కేసులను నమోదు,వచ్చిన సైబర్ పిర్యాదులలో వెంటనే స్పందించి 36,29,853/ రూపాయలు ఫ్రీజ్ చేయడంతో పాటు బాధితులు కోల్పోయిన మొత్తం 54,97,683/ రూపాయలను రికవరీ చేసి వారికి తిరిగి అందజేయడం జరిగిందని తెలిపారు. సైబర్ క్రైమ్ టీమ్, సైబర్ వారియర్లు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులను సందర్శిస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డట్టయితే1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు



**ప్రజాపక్షం/మల్లాపూర్:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులను ఇబ్బంది పెట్టినట్టు దృష్టికి వస్తే తక్షణమే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాఘవపేట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తేమశాతం డబ్బులు చెల్లింపుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించలని, తూకం వేసిన ధాన్యాన్ని వెనువెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రాలలోనే వేచి ఉండే పరిస్థితులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమేష్, ఏఎంసీ చైర్మన్ పుష్పలత నర్సయ్య, మాజీ చైర్మన్ నర్సయ్య,మాజీ వైస్ ఎంపీపీ గౌరు నగేష్, బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు సతీష్ ,నాయకులు డీలర్ మల్లయ్య, బైరి రాకేష్, బోయిని సిద్దయ్య, బిట్ల నరేష్, ధ్యాగ గంగారెడ్డి, ఐకెపి నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని బొప్పాపూర్ గ్రామంలో సెట్ బ్యాక్ చేయకుండా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆర్ అండ్ బి అధికారులను నిలదీశారు. నిర్మాణాన్ని ఆపివేయాలంటూ వెంటనే కలెక్టర్ స్పందించాలని శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గొల్లపల్లి నుండి గంభీరావుపేట వెళ్లే ప్రధాన రహదారి రాచర్ల బొప్పాపూర్ గ్రామ శివారులో సుమారు 14 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తుండగా, రోడ్డు మధ్యలో నుంచి 33 ఫీట్లు సెట్ బ్యాక్ చేసి నిర్మించాలని లేనియెడల ఆందోళన చేపడుతామని గ్రామస్తులు అన్నారు. నిర్మాణ పనులు అడ్డుకున్న వారిలో గ్రామస్తులు భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, రామభీమేశ్వర్, బాపురెడ్డి, సతీష్, లక్ష్మ ణ్, భాను, పద్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## 19న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు నవంబర్ 19న బుధవారం రోజున రూమ్ నెంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 67 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని,సేల్స్ ఎగ్జిక్యూటివ్ 60, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ 4, హెచ్ఆర్ 2, ఆఫీస్ బాయ్ 1 పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డిగ్రీ ,డిప్లమా, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు అగ్రికల్చర్ బీఎస్సీ, హెచ్ఆర్ ఉద్యోగాలకు ఎంబీఏ ,ఆఫీస్ బాయ్ పోస్ట్ లకు పదవ తరగతి, విద్య అర్హతలు కలిగిన వారు అర్హులు.. ఆసక్తి ఉన్నవారు నవంబర్ 19న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో Room No.225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బస్సు ఢీ కొని ఒకరు మృతి



**ప్రజాపక్షం/కొండపాక:** బస్సు బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో రాజీవ్ రహదారి పై చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన న్యాలపోగుల నాగరాజు బైక్‌పై రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుండి సికింద్రాబాద్‌కు వెళ్తున్న సిద్దిపేట డిపో ఆర్టీసి బస్సు బైక్‌ను ఢీ కొట్టడంతో బైక్ పైన ఉన్న న్యాలపోగుల నాగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి.108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.అందరితో కలివిడిగా ఉండే నాగరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుకునూర్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మత్స్యకార్మికుల అభివృద్ధికి కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్‌లో మత్సకార్మికుల అభివృద్ధికోసం కృషిచేస్తామని అలాగే పట్టణంలోని అధునాధనమైన చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేసి మత్స్యకార్మికుల జీవనోపాధి కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని మంత్రు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తో పాటు మత్స కార్పోరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కృష్టలు తెలిపారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో పశువు వైద్యాశాలను, చేపల సంతను , ఎల్లమ్మ చెరువు పనుల పరిశీలన తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ సందదర్భంగా మంత్రులు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 165 చెరువులకు గాను 38 లక్షల 92 వేల చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు అలాగే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువలో 5 లక్షల 17వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు వీటితో పట్టణంలోని 253 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుందని వారు తెలిపారు. చేపల పెంపకం ద్వారా నియోజకవర్గంలో 4,144మంది మత్స్యకార్మికుల కుటుంబాలకు లబ్ది చేకురుతుందని అన్నారు. రాష్ట్రంలో 5లక్షల మత్స్యకార్మికుల కుటుంబాలు ఉన్నాయని 6వేల సోసైటిలు ఉన్నయని 26వేల చెరువులున్నాయని తెలిపారు. 123 కోట్ల తో చెరువులకు చేప పిల్లల పంపిని చేస్తున్నమని అన్నారు. ఈ సందర్బంగా గురుకుల హస్టల్లో మటన్, చికెన్ లాగ చెపల కూరను మెను ఉండాలని మంత్రి అదేశించారు.

**బస్‌స్టేషన్‌ను పరిశీలించిన మంత్రి పొన్నం**

ఇటివల భారీ వర్షాల కారణంగా నీట మునిగిన హుస్నాబాద్ బస్‌స్టేషన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ముందు ముందు బస్‌స్టేషన్‌లోకి వరద నీరు రాకుండ శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులకు పలు సూచనలు చేశారు. బస్సస్టేషన్ వెనుక బాగంలో లో ఉన్న డ్రైనేజీ లోకి బస్‌స్టాండ్ వరద నీరు పోయేలా లింక్ కాల్వ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మార్కెట్ యార్డును పరిశీలించి ధాన్యం వేగవంతే చేయాలని ధాన్యం కొనుగోలో చేసిన 24 గంటల్లో రైతుల డబ్బులు జమచేయాలని అదికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమవతి , గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బొల్లి శెట్టి శివయ్య, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి, తో పాటు అయా శాఖ అధికారులు ముఖ్య నేతలు పాల్గోన్నారు.

## 17న సిపిఐ రాష్ట్ర జాతా



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ల ఉత్సవాల సంధర్బంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార జాతా జరుగుతోందని, ఈ సంధర్బంగా ఈ నెల 17న చిగురుమామిడి మండలానికి రాష్ట్ర ప్రచార జాత వస్తున్న నేపథ్యంలో జాతాను జయప్రదం చేయడానికి అధిక సంఖ్యలో సిపిఐ శ్రేణులు, కార్యకర్తలు తరలిరావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జడ్పిటిసి అందె స్వామి, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ చిగురుమామిడి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ముస్కు రాజిరెడ్డి స్మారకభవన్‌లో జిల్లా కౌన్సిల్ సభ్యులు మావురపు రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సంధర్బంగా అందె స్వామి మాట్లాడుతూ డిసెంబర్26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రచారజాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న చిగురుమామిడి మండలానికి రాష్ట్ర జాతా వస్తున్న నేపథ్యంలో సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, రాజు, తేరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, రాజయ్య, బాపురెడ్డి, తిరుపతి, చంద్రయ్య, తమ్మిశెట్టి రవీందర్, అంజయ్య, జనార్దన్, కేతవ్వ, బసంతం దొంతరవేన వెంకన్న, ఓదెలు, లక్ష్మి తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని జగిత్యాల జిల్లా ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు చిలుముల లావణ్య సూచించారు. తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని తిమ్మాపూర్, రాయపట్నం, పాషిగామ, వెంకటాపూర్ గ్రామాలలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి ఏఎంసి చైర్ పర్సన్ చిలుముల లావణ్య ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపాధ్యక్షులు గటికె సత్తయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేష్, లక్ష్మ ణ్, మొగిలి,కాళ్ళ సత్తయ్య, హరీష్, రాజేశ్, వి.రాము, సంఘ సభ్యులు, వేణు, సిబ్బంది నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ:** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ పట్టణ పరిధిలోని అర్హులైన 19 మంది లబ్ధిదారులకు ఏడు లక్షల విలువ గల, రూరల్ మండల పరిధిలో అర్హులైన పది మంది లబ్ధిదారులకు మూడు లక్షల నలభై ఎనిమిది వేల విలువ గల, అర్బన్ మండల పరిధిలో ఆరు లక్షల విలువ గల పదహారు ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 సిలిండర్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు ఇరవై కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య రూరల్ మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు, పుల్కాం రాజు, మహ్మద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధి పనులకు పర్యవేక్షించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పాఠశాలల పర్యవేక్షణ, ప్రభుత్వ బ్యాంక్ ఖాతాల నిర్వహణ పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖలలో వినియోగించని బ్యాంకు ఖాతాలలో జమ చేసి ఉన్న ఆర్.బి.ఐ నుంచి వెనక్కి తీసుకునేందుకు కే.వై.సి వివరాలు, రిక్వెస్ట్ లెటర్ సంబంధిత శాఖలు అందించాలని కలెక్టర్ సూచించారు. నవంబర్ 22 నాటికి పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ శాఖల పరిధిలో ఉపయోగించని బ్యాంకు ఖాతాల నుంచి ఆర్.బి.ఐ ఫ్రీజ్ చెసిన డబ్బులు వెనక్కి తీసుకునేందుకు కార్యచరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డిసెంబర్ చివరి నాటికి పెద్దపెల్లి జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో అవసరమైన మౌలిక వసతుల పనులు పూర్తి చేసే దిశగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, కలెక్టరేట్ నుంచి దాదాపు 30 కోట్ల నిధులు మంజూరు చేసి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామని అన్నారు.ప్రతి జిల్లా అధికారికి రెండు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించాలని, రాబోయే 5 సంవత్సరాలకు సంబంధించి పాఠశాలలో అవసరమైన మేర అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని, పాఠశాల అవసరాలకు ఇంకా ఏమైనా పనులు చేపట్టాల్సి ఉంటే ప్రతిపాదనలు అందించాలని అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో నెరవేరుతున్న సొంత ఇంటి కల

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరుతున్నదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇల్లంత కుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

**ఫిల్లర్ రూఫింగ్ తో ఖర్చు ఆదా**

ఈ సందర్భంగా ఇల్లంతకుంటలో ఉన్న 40, ఓబులాపూర్ లో 24 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసి, ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పంపిణీ చేశారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ కలిసి ప్రారంభించారు. ఇంటిలో ఉష్ణోగ్రత కొన్ని డిగ్రీలు తగ్గించేందుకు, స్లాబ్ నిర్మాణ ఖర్చు తగ్గించేందుకు ఫిల్లర్ రూఫింగ్ విధానంలో పూర్తి చేయడాన్ని చూసి అభినందించారు.అనంతారం గ్రామంలో గన్నెపల్లి అనూష అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోగా, నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. గృహ ప్రవేశం చేసి, లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, హౌసింగ్ డీఈ ఖాజా ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురు దొంగల ముఠా అరెస్ట్

రూ.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం: సిపి




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంత పరిధిలో గత కొన్ని నెలలుగా రైతులు, పౌరుల ఆస్తులకు నష్టం కలిగించిన దొంగతనాల కేసులను జిల్లా పోలీసులు విజయవంతంగా చేధించారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సిపి గౌష్ ఆలం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆరుగురు దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ప్రధానంగా 12 కాపర్, కరెంటు మోటార్ వైర్ దొంగతనాలు, 3 పశువులు, పందులు, గొర్రెల మేకల దొంగతనాల కేసులు (మొత్తం 15 కేసులు) మిస్టరీని చేధించి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.20 లక్షల విలువై దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులు గతంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 కేసులున్నట్లు పేర్కొన్నారు. దొంగతనాల తీరును సిపి వెల్లడిస్తూ శనివారం చొప్పదండిలోని గుమ్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక బొలెరో క్యాంపర్ , ఒక అశోక లేల్యాండ్ వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఈ దొంగతనాలకు పాల్పడ్డ నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. దొంగతనాలకు పాల్పడి పట్టుబడ్డ వారిలో మానుపాటి శేఖర్(36), కట్టరాంపూర్, కరీంనగర్, మానుపాటి సంజీవ్(26) విజయనగరం కాలనీ, చొప్పదండి, ఉండాటి మహేష్(27) పందుల వ్యాపారం బేగంపేట, రామగిరి, బోదాసు కుమార్ (33) ఆటో డ్రైవర్, వెల్జిపూర్,ఇల్లంతకుంట, సాగర్ల రంజిత్ (36) జేసిబి డ్రైవర్, పెంచికల్పేట్, కమాన్‌పూర్, బొడిగె సంపత్(రిసీవర్)(42), స్క్రాప్ వ్యాపారి, సంతోష్ నగర్, చొప్పదండిలు పట్టుబడ్డట్లు తెలిపారు. పోలీసులు వారి నుంచి ఆస్తులలో ఒక బొలెరో వాహనం, ఒక అశోక లేల్యాండ్ వాహనం, ఒక మోటార్ సైకిల్, 3 క్వింటాళ్ల కాపర్ వైరు( మొత్తం రూ.20 లక్షల అంచనా)స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నామని సిపిఐ తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన 8 మంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కేసులను చేధించగా ఈ బృందంలో చొప్పదండి సిఐ ఎ.ప్రదీప్ కుమార్, మానకొండూర్ సిఐ సంజీవ్, ఎస్ఐ నరేష్ రెడ్డి, చొప్పదండి ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది అనిల్, రాజ్ నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనోద్దీన్(హెచ్సి), రవీందర్ సిసిఎస్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్క కరిచిన కేసుల్లో ప్రత్యేక పర్యవేక్షణ అవసరం

కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కుక్క, కోతి కరిచిన వారికి చికిత్స పట్ల ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హౌజింగ్‌బోర్డు కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన పలువురు వృద్దులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. బిపి, షుగర్ వంటి వ్యాధులకు కావాల్సిన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తారని వారికి సూచించారు. వృద్దురాలికి అవసరమైన మాత్రలను అందజేశారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలకు విటమిన్, ఐరన్, కాల్షియం మాత్రలను పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కుక్క, కోతి కరిచిన వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, క్రమం తప్పకుండా చికిత్స అందిస్తూ కోర్సు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. చిన్నారుల నెలవారీ టీకాలు, గర్భిణీల నాలుగు ఆరోగ్య పరీక్షలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు, ఇతర వైద్య సేవలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

**విటమిన్ గార్డెన్‌పై దృష్టి పెట్టాలి**

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విటమిన్ గార్డెన్లపై బయోసైన్స్ ఉపాధ్యాయులపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. హౌజింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల్లో విటమిన్ గార్డెన్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయడమే కాకుండా పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరల్లో ఏ రకమైన విటమిన్లు, మినరల్స్ ఉన్నాయో విద్యార్థులకు తెలిసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి ఉన్నారు.




# రెస్పాన్స్ అద్భుతం

## ప్రెస్ మీట్‌లో రానా దగ్గుబాటి



దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ రెట్రో బ్లాక్ బస్టర్ 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిలమ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మించారు. నవంబర్ 14 విడుదలైన ఈ సినిమా అన్ని చోట్ల అద్భుతమైన రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. కాంత సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్నిచ్చింది. ముఖ్యంగా పెర్ఫార్మెన్స్‌లకు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. దుల్కర్ కెరీర్ ఫైనెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. మ్యూజిక్, విజువల్స్ టెక్నికల్ వాల్యూస్ గురించి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూ వున్నా సినిమా ఇది. జోనర్ బెండింగ్ సినిమాగా వచ్చిన ఫస్ట్ ఫిలిమ్ కాంత. ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. మద్రాస్ నేపథ్యంలో జరిగే కథ కావడం, ఎలాంటి అంచనా లేకుండా చూడటంతో మద్రాస్ ఆడియన్స్ ఇంకా అద్భుతంగా కనెక్ట్ అయ్యారు.

# 'దేవగుడి' టీజర్ విడుదల



పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా, స్వీయ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'దేవగుడి'. ఈ చిత్రానికి లక్ష్మి కాంత్ కనికే డిఓపిగా పని చేస్తుండగా షేక్ మదీన్, రఘు కుంచె సంగీతాన్ని అందించారు. నాగిరెడ్డి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తించారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించగా పలువురు నటీనటులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. '2013లో రామకృష్ణా రెడ్డి నిర్మాతగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఎంతో ప్యాషన్తో ఇండస్ట్రీలోకి వచ్చిన ఆయన ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా సినిమాలు నిర్మించి సక్సెస్ అయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న ఈ 'దేవగుడి' చిత్రం మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. 'దేవగుడి' టైటిల్ చాలా బాగుంది. టీజర్ కూడా అద్భుతంగా ఉంది. ఇందులో చిత్రమ్మ పాడిన మెలోడీ సాంగ్ చాలా చాలా బాగుంది. చాలా రోజుల తర్వాత ఆ సాంగ్ నా మదిని తాకింది. ఇది ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రియల్‌గా జరిగిన స్టోరీ అని నేను అనుకుంటున్నాను. కంటెంట్ బాగుంటే.. తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. కచ్చితంగా ఈ సినిమాను కూడా ఆదరిస్తారని, ఆదరించాలని కోరుకుంటున్నాను. మా రామకృష్ణా రెడ్డికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నాను అని అన్నారు.

# సెకండ్ ఇన్నింగ్స్ నా డిక్షనరీలో లేదు

## అఖండ-2 ఈవెంట్‌లో బాలకృష్ణ



యాబై ఏళ్లుగా సినీ పరిశ్రమలో కథానాయకుడిగా ఉన్నాను. సెకండ్ ఇన్నింగ్స్ అనేది నా డిక్షనరీలో లేదు. హిందూ సనాతన ధర్మం శక్తి పరాక్రమం అఖండ–2లో సినిమాలో చూస్తారు. ధర్మంగా బ్రతకండి సత్యం మాట్లాడండి అన్యాయానికి తలవంచకండి..ఇది అఖండ తాండవం. బోయపాటితో మూడు సినిమాలు చేశాం. సింహ, లెజెండ్, అఖండ.. మూడు హ్యాట్రిక్స్. ఇది నాలుగో సినిమా. బోయపాటి నేను ఒకటే వేవ్ లెంత్‌లో వర్క్ చేస్తాం. తమన్‌తో అఖండ, వీరసింహారెడ్డి, నేలకొండ భగవంత కేసరి, డాకు మహారాజ్, ఇప్పుడు అఖండ2. మాది అద్భుతమైన కాంబినేషన్. కైలాష్ ఖేర్, శంకర్ మహదేవన్ హిందూ సనాతన ధర్మానికి సంబంధించిన ఈ పాటని ఎంతో అద్భుతంగా ఆలపించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని తీసుకెళ్లి ఈ సినిమాని చూపించాలి. మన హిందూ సనాతన ధర్మం ఏమిటో చెప్పాలి అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ముంబై లో జరిగిన అఖండ 2 టైటిల్ పాట ఆవిషకరణ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడారు. నాకు జన్మనిచ్చినటువంటి నా తల్లిదండ్రులకు ముందుగా ప్రణామాలు. వారి ఆశీర్వాదంతోనే నేనుమీ ముందు నిలబడి ఉన్నాను. మా నాన్నగారి అడుగుజాడల్లో ముం దుకు వెళుతున్నాను. హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తున్నాను. ఆచంట రామ్, గోపి నిర్మాణంలో నాకు ఇది రెండో సినిమా. చాలా మంచి సినిమాలు తీయాలి ఇండస్ట్రీకి కాంట్రిబ్యూట్ చేయాలని తపనతో ఉండే ప్రొడ్యూసర్స్. జార్జియా, మధ్యప్రదేశ్ ఇలా చాలా అద్భుతమైన లొకేషన్స్ లో షూట్ చేసిన సినిమా ఇది. సినిమాని ప్రజెంట్ చేస్తున్న నందమూరి తేజస్విని మా అమ్మాయి. నేను హోస్టుగా చేసిన అన్ స్టాపబుల్ ఇండియాలో నెంబర్ వన్ షో. ఆ షోకి మా అమ్మాయి క్రియేటివ్ కన్సల్టెంట్‌గా వర్క్ చేశారు. అఖండ 2 చాలా అద్భుతమైన సినిమా. డిసెంబర్ 5న మీ ముందుకు వస్తుంది. ముంబై ఈవెంట్‌లో ఈ సాంగ్‌ని లాంచ్ చేయడం ఇక్కడి నుంచి ప్రమోషన్స్ మొదలు పెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, సింగర్ కైలాష్ కేర్, నిర్మాత గోపి ఆచంట, నటుడు ఆది పినిశెట్టి పాల్గొన్నారు.

# ఇది నిజమైన కథ

## 'చిట్‌చాట్'లో దర్శకుడు సాయిలు కంపాటి

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ సాయిలు కంపాటి మీడియాతో చిట్ చాట్ చేశారు. మాది



వరంగల్ జిల్లా. చిన్నప్పటి నుంచే సినిమాల మీద ఆసక్తి ఉండేది. అప్పుడు 16 టీన్స్, సంపంగి ఇలాంటి మూవీస్ చూసి సినిమాల పట్ల ఆకర్షితుడిని అయ్యాను. సినిమా డైరెక్టర్ ఎవరు, టెక్నీషియన్స్ ఎవరు, వాళ్లు గతంలో ఏ సినిమాలకు వర్క్ చేశారు. ఇలా ప్రతి విషయం గమనించి గుర్తుపెట్టుకునేవాడిని. మా ఊరికి చెందిన స్నేహితుడు ఒకరు అప్పటికే ఇండస్ట్రీకి వచ్చారు. ఆయన నాగార్జున గ్రీకువీరుడు సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేసేవారు. సినిమాల పట్ల నా ఆసక్తిని గమనించి ఎంకరేజ్ చేశారు. బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల ప్రయత్నాలు చేసినా, నా మనసంతా సినిమాల వైపే ఉండేది. కొన్ని స్క్రిప్ట్ రెడీ చేసుకోవడం మొదలుపెట్టా. మొదట్లో కమర్షియల్ స్క్రిప్ట్ గురించి ఆలోచించినా, ఆ తర్వాత మనదైన నేటివిటీ, మన ఆత్మ ఆ మూవీలో కనిపించాలి అనిపించింది. ఆ తరహా స్క్రిప్ట్స్ రాయడం ప్రారంభించా. డైరెక్టర్స్ వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశా. ఒకరోజు వేణు ఊడుగుల అన్నకు 'రాజు వెడ్స్ రాంబాయి' కథ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. ఆ తర్వాత ఒక డెమో షూట్ చేసుకుని రమ్మన్నారు. అది చేశాక సినిమా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఈటీవీ విన్ వాళ్లు కూడా మా ప్రాజెక్ట్‌లో జాయిన్ అయ్యారు. ఇది పరువు హత్యకు సంబంధించిన కథ కాదు.. కానీ అలాంటిదే. రాజు తన ప్రేయసి రాంబాయిని పెళ్లి చేసుకున్నట్లే ఊహించుకుని రాజు వెడ్స్ రాంబాయి అని రాస్తుంటాడు. ఈ కథలో ప్రేమికులకు ఏం జరిగింది అనేది మాత్రం తెరపైనే చూడాలి. మూవీ బాగా వచ్చేందుకు మా టీమ్ బాగా సపోర్ట్ చేశారు. నా తదుపరి సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి, త్వరలోనే ఆ ప్రాజెక్ట్ అనౌన్స్ చేస్తాను అన్నారు.

# షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ దరఖాస్తు పొడిగింపు



తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19,20,21 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. యువకుల నుంచి వచ్చిన స్పందన చూసి ఈనెల 20 వరకు అనుకున్న లాస్ట్ డేట్‌ను 26వ తేది వరకు పొడిగించినట్టు ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈనెల 26వ తేది వరకు ఔత్సాహికులు తమ షార్ట్ ఫిల్మ్ ను HISFF.INకు పంపాలని దిల్ రాజు కోరారు. ఈ ఫెస్టివల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిలిం స్టడీస్ అధినేత , అంకురం సినిమా దర్శకులు ఉమా మహేశ్వర్ రావు అని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే చాలా షార్ట్ ఫిలిమ్స్ వచ్చాయని అన్నారు. మూడు రోజుల పాటు ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ఐమాక్స్‌లో జరుగుతుందన్నారు

# హ్యాపీగా ఉంది

## నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ఈ రోజు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సెంటర్స్ నుంచి ఈ సినిమాకు సూపర్ హిట్ టాక్ వస్తోంది. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందించారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న నేపథ్యంలో ఈ మూవీ టీమ్ ప్రెస్ మీట్ ద్వారా తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని




ర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అంటూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. ఒక ఎంటర్ టైనింగ్ మూవీ కోసం ప్రేక్షకులు ఎంతగా ఎదురుచూస్తున్నారో మా సినిమా సక్సెస్‌తో అర్థమైంది. ఆయ్, లిటిల్ హార్ట్స్ తర్వాత అలాంటి హోల్ సమ్ ఎంటర్ టైనర్ మా మూవీ అని అంటున్నారు. అన్ని ఏరియాల నుంచి మంచి టాక్ ఉంది. హీరో విక్రాంత్ మాట్లాడుతూ సినిమా రిలీజ్ కు ముందు రోజు రాత్రి టెన్షన్‌తో నిద్రపట్టలేదు. మార్నింగ్ బుక్ మై షో చూస్తే మేజర్ థియేటర్స్‌లో బుకింగ్స్ బాగా జరగడం చూసి సర్ ప్రైజ్ అయ్యాను. రివ్యూస్ ఒక్కొక్కటిగా పాజిటివ్‌గా రావడం సంతోషంగా అనిపించింది. హీరోయిన్ చాందినీ చౌదరి మాట్లాడుతూ 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అని మేము ప్రమోషన్‌లో చెబుతూ వచ్చాం. ఈ రోజు థియేటర్స్‌లో సినిమా చూస్తున్న ఆడియెన్స్ కూడా అదే ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు. థియేటర్స్‌కు వెళ్లి చూశాను. ఆడియెన్స్ ఎలా రెస్పాండ్ అవుతున్నారో చూశాక హ్యాపీగా అనిపించిన్నారు. డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ ఈ సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు.

# సంగీత్ శోభన్ హీరోగా కొత్త సినిమా షురూ



మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీస్ తో యూత్ ఆడియెన్స్‌లో తనకుంటూ ఓ స్పెషల్ ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, ఇటీవల గర్ల్ ఫ్రెండ్‌తో సూపర్ హిట్ అందుకున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని, ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని, డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ కాంబోలో ఓ క్రేజీ మూవీ రాబోతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంలో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ స్క్రిప్ట్ అందజేయగా, నిర్మాత ఎస్ కేఎన్ క్లాప్ ఇచ్చి మూవీ టీమ్ కు తమ బెస్ట్ విశెస్ అందించారు. ఓ సరికొత్త ట్రెండీ లవ్ స్టోరీతో ఈ సినిమా తెరకెక్కనుంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమా నిర్మాణం కానుంది. ఈ చిత్రాన్ని లక్ష్మి భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు.

# దిగొచ్చిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

చర్యను ప్రశంసించింది. గతనెల,ఈనెల పలు సంస్థలు చేసిన సర్వేలలో ట్రంప్‌పై 58నుండి 63 శాతం మేరకు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్లు వెల్లడైంది. ఉద్యోగాల కోత, వలస విధానం, షట్‌డౌన్ పరిస్థితులతో పాటు ఇటీవల ఎన్నికల్లో సోషలిస్టు జోహ్రాన్ మమ్దానీ సహా పలువురు డెమోక్రాట్ల విజయం ఆయనకు శరాఘాతంగా మారింది. పులిమీద పుట్రలా జెఫ్రీ ఎప్సీన్ ఈమెయిల్స్ బహిర్గతం కావడంతో ఆయన పాలనాయంత్రాంగం అన్ని వైపుల నుండీ తీవ్రమైన ఒత్తిళ్ళకు గురవుతూ ఉండటంతో ఆకస్మికంగా ఈ నాటకీయ పరిణామం సంభవించింది. వినియోగదారులకు ధరల నుండి ఉపశమనం కలిగించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ట్రంప్‌కు ఈ పరిస్థితి వస్తుందని తమకు ముందుగానే తెలుసునని డెమోక్రాట్లు విమర్శించారు. 'అధ్యక్షుడు ట్రంప్ చిట్టచివరకు టారిఫ్‌ల పెరుగుదలవల్ల ధరలు మండిపోతున్నాయన్న విషయాన్ని ఒప్పుకుంటారని మాకు తెలుసు'' అని విర్జీనియా డెమోక్రటిక్ ప్రతినిధి డాన్ బేయర్ అన్నారు. గడచిన ఏప్రిల్ నుండి ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాల భారాలు మోపారు. ఈ టారిఫ్‌లవల్ల తమ దేశ వినియోగదారులపై ఎలాంటి ధరల భారం పడదని వాస్తవాలు భిన్నంగా ఉన్నప్పటికీ ఆయనతోపాటు ఆయన యంత్రాంగం ఇప్పటికీ వాదిస్తోంది. ముఖ్యంగా రికార్డుస్థాయిలో పెరిగిన గొడ్డుమాంసం ధర ప్రజలకు ఆందోళనకరంగా మారింది. ఐతే తఈ ధరలు తగ్గించేందుకు ప్రయత్నిస్తామని, ఆ ఉద్దేశం తమకు ఉందని ఆయన అంటూ వచ్చారు. ప్రపంచంలో ఏ దేశంపైనా లేనంతగా బ్రెజిల్‌పై 50శాతం పైగా సుంకాలను ట్రంప్ విధించారు. కానీ బ్రెజిల్ నుండే అమెరికాకు ఎక్కువగా గొడ్డుమాంసం దిగుమతి అవుతుంది. ఆర్థిక వ్యవస్థను బ్రహ్మాండంగా విస్తరించి అమెరికాకు పునర్వైభవం తీసుకురావాలని సంకల్పించుకున్న ట్రంప్, అనేక దిగుమతి వస్తువులపై భారీ ఎత్తున సుంకాలు విధించడం ద్వారా దేశీయ ఉత్పత్తులకు గణనీయంగా ప్రోత్సాహం ఇవ్వగలమని ఊహించుకుని తన రెండో విడత పాలనలో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారారు. వ్యతిరేక పరిస్థితుల మధ్య ఆకస్మికంగా ఆయన యూటర్న్ తీసుకున్నారు. ఇటీవల న్యూయార్క్ మేయర్, మరో ఇద్దరు గవర్నర్ల ఎన్నికల సందర్భంగా విర్జీనియా, న్యూజెర్సీ, ఇతర కీలక ప్రాంతాలలో ఆర్థిక సమస్యలే ప్రధానాంశాలుగా ప్రచారంలో చర్చకు వచ్చాయి. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికలు కూడా దూసుకువస్తూ ఉండటంతో డెమోక్రాట్లు తమ దాడి తీవ్రత పెంచడంతో ట్రంప్ ఈ చర్యలకు దిగారు. 'మేం కేవల కాఫీ లాంటి కొన్ని ఆహార వస్తువులపై సుంకాలు తగ్గించాం' అని ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో ఫ్లోరిడాకు వెళ్ళే మార్గంలో మీడియాకు చెప్పారు. మరోవైపు తాను అధికారంలోకి వచ్చినప్పటినుండీ దేశంలో ద్రవ్యోల్బణం అదృశ్యమైపోయిందని ట్రంప్ చెబుతున్నప్పటికీ అది చెక్కుచెదరక పోగా అమెరికా వినియోగదారులపై మరింత ఒత్తిడి పెంచుతున్నది. టారిఫ్‌లు అన్ని విధాలా దిగుమతులపై పెంచడంవల్ల కోశాగారం నిండిపోయిందని, కిరాణా దుకాణాలలో ధరలు పెద్ద సమస్యగా లేదని ఆయన అన్నారు. ట్రంప్ ప్రకటనపై డెమోక్రాట్లు స్పందిస్తూ, దేశంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాలవల్ల జనం జేబులకు చిల్లు పడుతోందని విమర్శించారు.

# సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో 'ఏరోస్పేస్ అండ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్‌ఎంఈలు 'తెలంగాణ బ్రాండ ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023–24లో రూ.15,900 కోట్లు కాగా 2024–25లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా–సాఫ్రాన్' ఫెసిలిటీ ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యూఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. ఈ తరహాలోనే పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హీరో ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బి డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను సమ్మిట్‌లో ఆవిష్కరించడమే ప్రధాన ఆకర్షణ

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచ వేదికపైన ప్రదర్శించేందుకు డిసెంబర్ 8,9 తేదీల్లో జరగనున్న 'తెలంగాణ రేజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు.'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025'అంశంపైన హైదరాబాద్ సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో రామకృష్ణారావు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ సిటీ, ముచ్చర్లలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణలో చేపట్టనున్న భవిష్యత్అభివృద్ధి దిశను చూపే విధంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను సమ్మిట్‌లో ఆవిష్కరించడమే ప్రధాన ఆకర్షణగా ఉండబోతుందన్నారు. రాష్ట్రాన్ని 2035 నాటికి 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. ఇవి సాహసోపేతమైనా సాధ్యమైన లక్ష్యాలని, ఇందుకు అన్ని శాఖల సమన్వయ కృషి అవసరమన్నారు. సమ్మిట్‌ను ప్రతి శాఖ తమ కార్యక్రమాలు, సరికొత్త ఆవిష్కరణలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రదర్శించుకునే వేదికగా తీసుకోవాలని సూచించారు. అన్ని పనులు నిర్ణీత గడువులలో పూర్తి చేయాలని, ఎలాంటి లోపం లేకుండా కార్యక్రమాలు అమలు కావాలని ఆదేశించారు. ఇది రాష్ట్ర సామర్థ్యాన్ని, సమగ్ర సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న కట్టుబాటును ప్రపంచానికి చాటే గొప్ప అవకాశం అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమ ప్రముఖులు, ఐటి నిపుణులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, రాయబారులు, క్రీడా ప్రముఖులు, సినిమా ప్రముఖులు, రియల్ ఎస్టేట్, మౌలిక రంగ ప్రతినిధులు, బహుపక్ష సంస్థల సభ్యులు మొత్తంగా సుమారు 1,300మందికి పైగా విశిష్ట అతిథులు హాజరుకానున్నారని వివరించారు. సిఐఐ, ఎఫ్ఐసిసిఐ, నాస్కామ్, అసోచామ్ వంటి జాతీయ వ్యాపార సంస్థలతో పాటు పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల సిఎండిలు కూడా పాల్గొననున్నారు. కాగా సమ్మిట్ వేదికలో 70థీమ్ ఆధారిత స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఆడియో విజువల్ ప్రజంటేషన్లు, గ్రాఫికల్ డిస్‌ప్లేలు, అనిమేటెడ్ కంటెంట్ ద్వారా తెలంగాణ అభివృద్ధి ప్రయాణం, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, భవిష్యత్ అవకాశాలను సందర్శకులకు ఆకర్షణీయంగా పరిచయం చేయనున్నారు. సమ్మిట్ మొత్తం రాష్ట్ర ఇన్నోవేషన్ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ఉండాలని, శాఖల మధ్య సమన్వయం, పకడ్బందీ ప్రణాళిక, గడువులకు కట్టుబడి పనిచేయడం అత్యంత కీలకమని సిఎంచెప్పిన విషయాన్ని రామకృష్ణారావు వివరించారు. సమావేశంలో వైఎటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రహదారులు, భవనాలు రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచిఘోష్‌తో పాటు వివిధ శాఖ ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.




# ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యూఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్(ఐఐటిఎఫ్) ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ను శనివారం తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్2025లో రాష్ట్ర పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేతి వృత్తులకు సంబంధించిన వస్తువులు, చేనేత వస్త్రాలు, గిరిజన ఆభరణాలు, చేతితో తయారు చేసిన గాజులు, హెర్బల్, మెడికల్ ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు, ఫ్యూజన్ బ్యాగ్స్‌ను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించనున్నటు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ స్టాల్స్ ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. పోచంపల్లికి చెందిన ఇక్కత్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, వాస్‌కోట్స్, దుప్పట్టా, కాటన్ బెడ్‌షీడ్స్, షర్టింగ్ ఫ్యాబ్రిక్స్ తదితర వైరెటీలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ ట్రేడ్ ఫెయిర్ రెండు వారాలు కొనసాగనుందని, మన దేశ ఐక్యత, వైవిధ్యం, జాతీయ పురోగతిని సూచిస్తూ జరుపుకునే 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' అనే ఇతివృత్తాన్ని ఈ 44వ ఎడిషన్ హైలైట్ చేస్తుందని డా.శశాంక్ గోయెల్ పేర్కొన్నారు.



# ప్రజలకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, కలవేన శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, సిపిఐ నాయకులు బద్రి సత్యనారాయణ, ఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# తిప్పికొట్టడం సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

నెడుతుందని మండపడ్డారు. దేశం సమైక్యంగా ఉండకుండగా మతం పేరుతోటి వర్గాలుగా విభజించి మెజార్టీ వర్గం ఓట్లతోటి చిరకాలంగా అధికారంలో ఉండాలని చూస్తుందని, అందుకు మతవిద్వేషాలను పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. పేద ప్రజలను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేయాలని అనేక పోరాటాలు నిర్వహించి, విజయాలు సాధించిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు దేశాన్ని సమైక్యంగా నిర్మించేందుకు పార్టీని బలోపేతం చేసేందుకు వందేళ్ళ బస్సు జాత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వందేళ్ళ సిపిఐ ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం జిల్లాలో ఐదు లక్షల మంది తో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు మేధావులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న ఆశన్న, నాగర్ దొడ్డి వెంకట రాములు, ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ఎఐవైఎఫ్ నాయకులు పరమేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, వీరేశ్, భరత్, గురుస్వామి, భీమేశ్, తిరుమలేశ్ కార్మిక సంఘాల నాయకులు నారాయణ, ప్రభుదాసు, తిమ్మప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com